epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

16-8-2022 మంగళవారం సంపుటి : 28 సంచిక : 197, పేజీలు : 10+4 వెల : 6.50

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



సోమవారం ఎర్రకోట వద్ద కళాకారులతో ప్రధాని మోడీ



## అవినీతి, కుటుంబ పాలనల
# భరతం పడతాం

### వాటిని సమూలంగా పెకలిస్తాం
### పంచసూత్రాలతో సమగ్రాభివృద్ధి
### వచ్చే 25 యేళ్లలో అభివృద్ధి చెందిన దేశంగా భారత్
### 75 యేళ్లకు ఆజాదీకా అమృత్ ఫలాలు అనుభవిస్తున్నాం
### స్వాతంత్ర్య వజ్రోత్సవ ఎర్రకోట ప్రసంగంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్యం సిద్ధించిన 75వ సంవత్సరంలో ఆజాదీకా అమృత్ ఫలాలు ఇపుడు అనుభవిస్తున్నామని, ఎందరో మహనీయుల త్యాగఫలితమే దేశానికి స్వాతంత్ర్యమని, ఆనాడు బ్రిటిష్ వలసవాదుల పునాదులను కూకటివేళ్లతో పెకలించేందుకు శాంతియుతమార్గంలోనిర్వహించిన ఆందోళన ఫలితమే దేశం ఇపుడు సర్వసత్తాక దేశంగా నిలిచిందని ప్రధానిమోడీ పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఎంతో అభివృద్ధిచెందిన దేశం 2047 నాటికిస్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లుపూర్తిచేసుకుంటుందని, 2047 నాటికి పూర్తి అభివృద్ధిచెందిన దేశంగా నిలపడమే మనముందున్న కర్తవ్యమని మోడీ పేర్కొన్నారు. ఎర్రకోటనుంచి వరుసగా తొమ్మిదోసారి ప్రసంగించినమోడీ మాట్లాడుతూ అవినీతికి వ్యతిరేకంగాను, బంధుప్రీతికి వ్యతిరేకంగాపోరాడి ఎన్నో సవాళ్లను అధిగమించామని, ఇవేమీ కేవలం రాజకీయ కారణాలు కాదని, ప్రజాజీవితంలోను, వ్యవస్థల్లోను పాతుకునిపోయిన వీటిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. ఇపుడు కొత్తదిశవైపు ప్రగతిపథంలోకి వెళుతున్నామని, భారతీయుల్లో నెలకొన్న దేశభక్తి భారత్‌ను సుస్థిరంగా నిలిపిందని ప్రజాస్వామ్యానికి భారత్ తల్లివంటిదని పేర్కొన్నారు. 2047నాటికి భారత్ అభివృద్ధిచెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ఐదు సూత్రాలు అవలంభించాలని, అప్పుడే స్వాతంత్ర్య సమర యోధులు కన్న కలలు సాకారం చేసినట్లవుతుందని అన్నారు. వలసవాదుల పాలన విధానాలనుంచి మారాలని, భారతీయ వైభవాన్ని ప్రాభవాన్ని ముందుకు తీసుకువెళ్లాలన్నారు. మన సమైక్యతను చాటిచెప్పాలని, పౌరుల బాధ్యతలను గుర్తించి నిజాయితీతో పనిచేసేందుకు ముందుకురావాలని అన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రులుసైతం దేశంయావత్తు ఈదిశగాముందుకువెళ్లాల్సి ఉందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం కోరుకునే భారత్‌లో అన్ని భాషలకు ≫2

సోమవారం ఎర్రకోటపై జెండా ఎగురవేస్తున్న ప్రధాని మోడీ

## మరో 10 లక్షల మందికి
# పింఛన్ ఆసరా

### కిడ్నీ,డయాలసిస్ పేషెంట్లకు మరింత సాయం
### కొత్త పెన్షన్లతో 46 లక్షల మందికి లబ్ధి
### దళితబంధు సంక్షేమ పథకం కాదు.. సామాజిక ఉద్యమం
### బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ, 127శాతం పెరిగిన జిఎస్‌డిపి
### దేశ నిర్మాణంలో తెలంగాణ బలమైన భాగస్వామి
### స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రసంగం



సోమవారం స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగం చేస్తున్న సిఎం కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** ఆసరా పథకంలో భాగంగా ప్రంద్రాగస్టు నుంచి మరో 10లక్షల మంది లబ్దిదారులకు పింఛన్లను ప్రభుత్వం అందజేస్తుందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు ప్రకటించారు. వజ్రోత్సవ సందర్భంలో రాష్ట్ర ప్రజలకు శుభవార్తను తెలియజేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో 36లక్షల మందికి ఆసరా పెన్షన్లు అందుతున్నాయని,కొత్తగా ఇచ్చే పెన్షన్లతో కలిపి రాష్ట్రంలో మొత్తం 46లక్షల మందికి ఆసరా పెన్షన్ల ద్వారా లబ్ది చేకూరుతుందన్నారు. సోమవారం పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని గోల్కొండ కోటలో 76వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా సిఎం కెసిఆర్‌ప్రసంగించారు.మరో మానవీయమైన ≫2

## సమాఖ్య విలువలకు
# కేంద్రం తూట్లు

### ఉచితాల పేరుతో అవమానించడం గర్హనీయం
### రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛను దెబ్బతీస్తూ నిరంకుశంగా ఆంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** కేంద్ర ప్రభుత్వంపై ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సోమవారంనాడు గోల్కొండ కోటపై సిఎం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ≫7

# 'ఎట్ హోమ్'కు హాజరు కాని సిఎం కెసిఆర్

### సిఎం కోసం 30 నిమిషాలు ఎదురు చూశాం: గవర్నర్ తమిళిసై

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు15:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గవర్నర్ తమిళిసై తేనీటి విందు ఇచ్చారు. ఈ వేడుకకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్,తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, హైదరాబాద్ సీపీ ఆనంద్, ≫7




సోమవారం రాజ్‌భవన్‌లో ఎట్‌హోంలో గవర్నర్, హైకోర్టు సిజె తదితరులు

# విడుదల కాని క్షమాభిక్ష ఖైదీలు

### చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్ల వద్ద ఖైదీల కుటుంబీకుల ఎదురు చూపులు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** స్వాతంత్ర వజ్రోత్సవాల వేళ 75 మంది జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రకటిస్తూ సర్కారు తీసుకున్న నిర్ణయం పంద్రాగస్టు నాడు ఆ చరణలో అమలు కాలేదు. జీవిత ఖైదీల విడుదలపై సర్కారు నిర్ణయం తీసుకున్నా దీనిపై ఇంకా అధికారిక ఉత్తర్వులు జారీ కాకపోవడంతో ఖైదీల విడుదల జరగలేదని జైళ్ల శాఖ అధికారులు తెలిపారు. మరోవైపు జీవిత ఖైదీల కుటుంబీకులు పలువురు సోమవారం నాడు చంచల్‌గూడ, చర్లపల్లి జైళ్ల వద్ద తమ వారు విడుదల అవుతారే మోనని ఎదురుచూసి నిరాశతో వెనుదిరిగారు. రాష్ట్రంలో జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ప్రసాదించడం 2016 తరువాత ఇప్పుడే కావడంతో చాలా మంది ఖైదీలు ఆనందం చెందసాగారు. నిబంధనల ప్రకారం పదేళ్ల జై లు జీవితం గడిపి మంచి నడవడిక వుండి, పేరోల్‌ను దుర్వినియోగం చేయని జీవిత ఖైదీలు క్షమాభిక్షకు అర్హులు. ఈ లెక్కన రాష్ట్రంలో జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న రెండు వేల మందికి పైగా ఖైదీలలో కనీసం మూడు వందల మంది వరకు క్షమాభిక్షకు అర్హులు అవుతారు. సాతంత్ర వజ్రోత్సవ వేళ 75 మంది జీవిత ఖైదీల విడుదల కు మాత్రమే సర్కారు నిర్ణయం తీసుకోవడం తెలిసిందే. దీనిపై సిఎం కెసిఆర్ అధికారికంగా ప్రకటించడం విదితమే. అయితే దీనిపై జిఎడి నుంచి జైళ్ల శాఖకు ఇప్పటి వ రకు ఎలాంటి అధికారిక ఉత్తర్వులు అందలేదు. అయినప్పటికీ జైళ్ల శాఖ అధికారులు సర్కారు నిర్ణయం మేరకు అర్హులైన 75 మంది జీవిత ఖైదీల జాబితాను సిద్ధం చేసి అధికారిక ఉత్తర్వులు రాగానే దీనిని అమలు చేసేందుకు రెడీగానే వున్నారు. ముందుగా అనుకున్న దాని ప్రకారం పంద్రాగస్టు రోజునే జీవిత ఖైదీలకు క్షమాభిక్ష ≫2



## కరోనా సమాచారం

**ప్రపంచంలో**

మొత్తం బాధితులు 59.54 కోట్లు
మరణాలు-64.55 లక్షలు

**దేశంలో**

తాజా కేసులు - 14,917
మరణాలు - 32

రాష్ట్రంలో కొత్తగా
**265 కేసులు**
మృతులు జీరో

2లో

# బీదర్ వద్ద ఘోర ప్రమాదం

### కంటైనర్‌ను ఢీ కొన్న కారు
### చిన్నారి సహా ఐదుగురు దుర్మరణం
### మృతులంతా హైదరాబాద్ వాసులు



**భీదర్, ఆగస్టు 15:** కర్ణాటకలోని బీదర్‌జిల్లా బంగూర్‌వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక చిన్నారి సహా ఐదుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఐదుగురికి గాయాలయ్యాయి. మృతులు హైదరాబాద్ బేగంపేటకు చెందినవారిగా గుర్తించారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు గిరిధర్(450; అనిత(30), ప్రియా(15), మహేశ్(2)జగదీశ్(35)లు ఈ ప్రమాదంలో మృతిచెందారు. వీరంతాకాలాబురిగిజిల్లా గంగాపూర్ దత్తాత్రేయ ఆలయ సందర్శనకు కారులో వెళుతుండగా ఈప్రమాదంజరిగింది. వీరుప్రయాణిస్తున్న కారు ఓ కంటైనర్‌ను వెనుకనుంచి ఢీకొనడంతో ఈప్రమాదంజరిగింది.

ప్రమాదంలోమరో వ్యక్తిని ఆసుపత్రికి తీసుకెళుతుండగా మృతిచెందాడు. కారులో ఉన్న మరో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని బీదర్‌జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బీదర్ తాలూకా మన్నల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. హైదరాబాద్ సైబర్‌క్రైమ్ విభాగంలో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గిరిధర్ తన పదిమంది కుటుంబసభ్యులతోకలిసి కర్ణాటకలోని కాలాబురిగిజిల్లా గాన్గాపూర్‌లోని దత్తాత్రేయ స్వామి దర్శనానికి వెళుతున్నారు. బంగూరువద్దకురాగానే అదుపుతప్పినకారు కంటైనర్‌ను వెనుకనుంచి ఢీకొనడంతో కారులో ఉన్నవారిలోనలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.



## మంత్రి జగదీష్ అవినీతి
# బయటపెడతా

### కాంట్రాక్టుల అభియోగం నిరూపిస్తే పోటీ నుంచి తప్పుకుంటా..
### మునుగోడు బిజెపిదే: రాజగోపాల్ రెడ్డి

**చౌటుప్పల్, ఆగస్టు15 ప్రభాతవార్త:** కాంట్రాక్టుల కోసం తాను కాంగ్రెస్ పార్టీకి, పదవికి రాజీనామా చేసి బిజెపిలో చేరుతున్నట్లు మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన వాఖ్యల పట్ల తాజా మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. ఈ నెల 21న మునుగోడులో అమిషత్‌షా బహిరంగ సభ నిర్వహిస్తున్న సందర్భంగా సభను విజయవంతం చేయడం కోసం సోమవారం ఆయన చౌటుప్పల్‌లో బిజెపి, కోమటిరెడ్డి అనుచరులతో విరివిరిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. బిజెపి నాయకులతో పాటు కోమటిరెడ్డి అనుచరులకు సభ విజయవంతంపై ≫2

### నేటి ఉదయం 11.30 గం.కు
## జాతీయ గీతాలాపన
### అబిడ్స్ చౌరస్తాలో పాల్గొననున్న సిఎం కెసిఆర్

2లో

## టిఆర్ఎస్ నేత తమ్మినేని కృష్ణయ్య
# దారుణ హత్య

### వేటకొడవళ్లతో వేటాడి చంపిన దుండగులు.. తెల్దారుపల్లిలో తీవ్ర ఉద్రిక్తత
### 144 సెక్షన్ అమలు.. రాజకీయ కక్షలే హత్యకు కారణం



తమ్మినేని కృష్ణయ్య



గ్రామంలో పోలీసు పహారా దృశ్యం

**ఖమ్మం రూరల్ ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా రూరల్ మండల తెల్దారుపల్లిలో టీఆర్ఎస్ నేత తమ్మినేని కృష్ణయ్య (65) దారుణ హ్యాతకు గురయ్యారు. రాజకీయ కక్షల నేపథ్యంలో ఈ హత్యకు దారితీసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. సోమవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడకల్లో భాగంగా ఉదయం పొన్నెకల్లు గ్రామంలో జరిగిన జెండా వందనం కార్యక్రమంలో పాల్గొని ద్విచక్ర వాహనంపై తన స్వగ్రామం తెల్దారుపల్లికి వస్తుండగా ఆరుగురు వ్యక్తులు ఆటోలో వెంబడించి గ్రామశివారులో అత్యంత పాశవికంగా దాడి చేసి హత్య చేశారు. దీంతో తమ్మినేని కృష్ణయ్య అక్కడిక్కడే మృతి చెందారు. హత్య జరిగిన విషయం దావానంలా గ్రామంలో తెలియడంతో మృతుని బంధువులు గ్రామస్తులు పెద్ద ఎత్తున ఘటన స్థలానికి చేరుకున్నారు. గ్రానైట్ వ్యాపారి తమ్మినేని కోటేశ్వర్‌రావు గత కొంతకాలంగా రాజకీయ కక్ష, కుటుంబ నేపథ్యంలో ఉన్న గొడవలను ఆసారాగా చేసుకుని పథకం ప్రకారం ఇదే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తుల సహకారంతో ఈ హత్య చేయించాడని మృతుని భార్య మంగతాయి, కుమారుడు నవీన్ ఆరోపిస్తున్నారు. తమ్మినేని కృష్ణయ్య, తమ్మినేని కోటేశ్వర్‌రావులు చిన్నానపెద్దనాన కొడుకులు కావడం వీరిలో తమ్మినేని కృష్ణయ్య మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు ప్రధాన అనుచరునిగా టీఆర్ఎస్‌లో కొనసాగుతున్నారు. తమ్మినేని కోటేశ్వర్‌రావు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు సోదరుడు కావడంతో పాటు పార్టీలోనే కొనసాగుతున్నాడు. గత 30 ఏండ్లుగా తెల్దారుపల్లి గ్రామంలో సీపీఎం ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తూ సీపీఎం పార్టీకి పంచాయతీ ఏకగ్రీవంగా అవుతూ వస్తోంది. టీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడంతో గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి తమ్మినేని కృష్ణయ్య కృషి చేస్తూ బలమైన నాయకుడిగా ఉన్నాడు. ఇతనిపై దాడి చేసేందుకు పలుమార్లు ప్రయత్నం చేసినప్పటికీ అవి ఫలించకపోవడంతో పథకం ప్రకారం తమ్మినేని కృష్ణయ్యపై వేటకొడవల్లతో దాడి చేసి అత్యంత పాశవికంగా హత్య చేసి ఉండవచ్చని మృతుని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన ఇంటికి అత్యంత సమీపంలోనే ప్రత్యర్థులు దాడి చేసి తమ్మినేని కృష్ణయ్యను హతమర్చారు. గుర్రాలపాడులో అనారోగ్యానికి గురైన వారిని పరామర్శించి తన అనుచరుడు కొప్పుల ముత్తేశం ద్విచక్ర వాహనం తోలుతుండగా వెనకాల తమ్మినేని కృష్ణయ్య ≫2

నేటి ఉదయం 11.30 గం.కు

# జాతీయ గీతాలాపన

## అబిడ్స్ చౌరస్తాలో పాల్గొననున్న సిఎం కెసిఆర్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** స్వాతంత్ర వజ్రోత్స వాలలో భాగంగా మంగళవారం ఉదయం 11.30 గంటలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్నిచోట్ల ఏకకాలంలో జాతీయ గీతాలాపన జరగనుండడంతో ఇందుకోసం పోలీసు, పౌర విభాగాలు విస్తృత ఏర్పాట్లు చేబట్టాయి. జాతీయ గీతాలాపన కోసం పోలీసు శాఖ ఇప్పటికే ఏర్పాట్లు చేయడంతో 11.30 గంటల సమయంలో ఎక్కడ వున్న వారు అక్కడే నిలబడి జాతీయ గీతాన్ని ఆలపించేలా చూడాలని ఆయా ప్రాంతాల పోలీసులకు ఆదేశించడం తె లిసిందే. ఇందుకోసం రాష్ట్రంలోని అన్ని జిల్లా పోలీసు విభాగాలు, కమిషనరేట్ల పోలీసు విభాగాలు ఏర్పాట్లు చేశాయి, ఉదయం 10 గంటల నుంచే ఈ కార్యక్రమం విజ యవంతం చేసేందుకు పోలీసులు రంగంలో దిగనున్నారు. ఠంచనుగా 11.30 గంటల సమయంలో ఏకకాలంలో జాతీయ గీతాలాపన జరగనుండగా ఎక్కడివారు అక్కడే వుండి దీనిని ఆలపించాల్సి వుంటుంది. కాగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిఎం కెసిఆర్ మంగళవారం నగరంలోని అబిడ్స్ చౌరస్తాకు అరగంట ముందుగానే రానున్నారు. అక్కడ వున్న మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహం వద్ద స్థానికులు, ప్రముఖులతో కలిసి జాతీయ గీతాలాపన చేయనున్నారు.



సోమవారం ఎర్రకోట వద్ద జాతినుద్దేశించి ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ



కళాకారులతో ప్రధాని

# అవినీతి, కుటుంబ పాలనల భరతం పడతాం

≫సముచిత గౌరవం ఉంటుందన్నారు. కొత్త జాతీయ విద్యావిధానంతో విద్యావ్యవస్థను మరింత ముందుకు తీసుకెళుతున్నట్లు మోడీ ప్రకటించారు. మోడీ తన ప్రసంగంలో అత్యధికభాగాన్ని అవినీతిని ర్మూలనకే కేటాయించారు. కొందరు పెద్దమనుషులు తమ అక్రమసంపాదన దాచుకోడానికి భారత్‌లో వారికి చోటు లభించడంలేదని, అదే విధంగా కొందరు సామాన్యప్రజలకు సైతం నివసించేందుకు నిలువనీడలేదని అన్నారు. లెక్కలుతేలని అవినీతిధనాన్ని మొత్తం వెలికితీస్తామని చెప్పారు. అంతేకాకుండా కొన్ని విపక్ష పార్టీలకు చెందిన నాయకులనుంచి స్వాధీనంచేసుకున్న నల్లధనం వివరాలను కూడా ఈసందర్భంగా ప్రస్తావించారు.

దేశాన్ని అవినీతి చీడపురుగులా పట్టిపీడిస్తోందని పూర్తిస్థాయిలో నిర్మూలనకు పనిచేయాలన్నారు. ఎవరైతే దేశాన్ని లూటీచేసారో వారంతా తిరిగి ఇచ్చేయాలన్నారు. అవినీతిలో భాగస్వాములయిన విపక్షనేతలను ఆపార్టీలు వెనకేసుకురావడాన్ని మోడీ తీవ్రంగా విమర్శించారు. అవినీతిపట్ల ద్వేషం పెరిగితే తప్ప వ్యవస్థలో ఈ అవినీతి నిర్మూలించలేమని సామాజిక బలహీనతలన్నింటినీ పక్కనపెట్టాలని ఆయన సూచించారు. విపక్ష పార్టీల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఇటీవల దర్యాప్తుసంస్థలు కొందరునేతలనుప్రశ్నిస్తే అది తప్పనట్లుగా ఆందోళనలు నిర్వహించారని పేర్కొన్నారు. వంశపారంపర్యపాలన, బంధుప్రీతికి తావులేదని రాజకీయాల్లో వారి మనుగడ అనేది అన్ని విభాగాల్లోను వేళ్లానుకున్నదనిఇలాంటి వ్యవస్థలను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బంధుప్రీతికారణంగానే భారత్‌లోప్రతిభకు అడ్డంకులు ఎదురవుతున్నాయని, అందువల్లనే అవినీతికూడా మరింతపెచ్చరిల్లేందుకు అవకాశం కలిగిందన్నారు. ఈ సామాజిక చీడను నిర్మూలిచేందుకు ప్రజలు నడుం బిగించాలన్నారు. దేశ సార్వభౌమత్వానికి వంశపారంపర్యపాలన అత్యంత విఘాతం తెస్తుందని, కుటుంబసంక్షేమానికే ప్రాధాన్యతనిచ్చే వంశపారంపర్యపాలన దేశ సంక్షేమంపై శ్రద్ధచూపించదని అన్నారు.

మహిళలను కించపరిచే వ్యవస్థలు ఉండకూడదని, వచ్చే2 5ఏళ్లలో మహిళల్లో ఉన్న ప్రతిభ ఆధారంగానే మరింత అభివృద్ధికి బాటలువేస్తామన్నారు. గడచిన 75 ఏళ్లలో మేడిన్‌ఇండియా తుపాకీని 21మంది గౌరవ వందనానికి వినియోగించామని ఇదొక గర్వకారణంగా నిలుస్తుందన్నారు. భారత్ లో రానున్న దశాబ్దం టెకేడ్ (సాంకేతిక దశాబ్దం)గా నిలుస్తుందని, 5జి తరంగాల సేవలు, సెమికండక్టర్ ఉత్పత్తి, గ్రామాల్లో ఆప్టికల్‌ఫైబర్‌కేబుల్ వంటివి డిజిటల్ ఇండియా విప్లవానికి బాటలువేసినట్లు తెలిపారు. డిజిటల్ ఇండియా విజయవంతం కావడానికి రెండు,మూడోశ్రేణి నగరాల్లో వస్తున్న స్టార్టప్‌లే కీలకమన్నారు.

# 10 లక్షల మందికి పింఛన్ ఆసరా

≫ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నదనినిరంరం డయాలసిస్ మీద ఆధారపడి జీవిస్తున్న కిడ్నీ పేషెంట్లకు కూడా ఇకపై ఆసరా పింఛన్ అందిస్తామని ప్రకటించారు. అణగారిన దళితజాతి సమగ్ర అభ్యున్నతే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మకమైన 'దళితబంధు' పథకాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. దళితబంధు పథకాన్ని ఒక సంక్షేమ పథకంగానే కాదు, ఒక సామాజిక ఉద్యమంగా అమలు పరుచుకుంటున్నామన్నారు.ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని బ్యాంకు లింకేజీ లేకుండా తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా గ్రాంటు రూపంలో అందిస్తున్నదన్నారు.ఆర్థిక సాయానికి అదనంగా ప్రభుత్వ లబ్దిదారుల భాగస్వామ్యంతో దళిత రక్షణ నిధి'ని కూడా ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 2616 వైన్‌షాపుల్లో 261 షాపులు దళితులకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక్కో దళిత కుటుంబానికి రూ.10లక్షల చొప్పున 1,70,700 కుటుంబాలకు అందివ్వడం లక్ష్యంగా పెట్టుకున్నదని,ఈ ఏడాది బడ్జెట్‌లో దళితబంధు పథకానికి రూ.17,700 కోట్లు కేటాయించిందన్నారు. షాదీ ముబారక్ పథకం ద్వారా ఇప్పటి వరకు 11 లక్షల 24వేల 684 మంది ఆడపిల్లల పెండ్లిళ్లకు రూ.1లక్షా 116 చొప్పున రూ.9వేల 716 కోట్లను ఆర్థిక సాయం అందజేసిన ఘనత తెలంగాణదేనన్నారు. స్వతంత్ర భారత వజ్రోత్సవ సందర్భంలో జాతీయ చేనేత దినోత్సవం నాటి నుంచీ నేతన్నకు బీమా సదుపాయాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. చేనేత కార్మికులు ఎవరైనా విధివశాత్తూ మరణిస్తే వారి కుటుంబానికి రూ.5లక్షల బీమా సొమ్మును ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మిషన్ భగీరథతో 100శాతం అవాసాలకు మంచినీరందించడంతో తెలంగాణ ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా మారిందని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ వేదికగా కొనియాడిందన్నారు. బంకించంద్రుడు వందేమాతర గీతంలో పేర్కొన్న సుజలాం,సుఫలాం,సస్యశ్యామలాం అన్న భావనను తెలంగాణ ప్రభుత్వం సాకారం చేసే చూపించిందని తెలిపారు. రైతు రుణ మాఫీ, 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయతో చెరువుల పునరుద్దరణ, పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం,కాళేశ్వరం తదితర భారీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టామన్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న ఉత్తేజంతో 2020-21 నాటికి 2 కోట్ల 15లక్షల ఎకరాలకు సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు



సోమవారం గోల్కొండలో జెండా వందనం చేస్తున్న ముఖ్యమంత్రి కెసిఆర్. చిత్రంలో సిఎస్ తదితరులు

**స్వతంత్ర వజ్రోత్సవేళ... ఇంటింటికి జాతీయ పతకాల ఆవిష్కరణ**

రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య అంతరించి, భారతదేశ స్వేచ్ఛకూ,సార్వభౌమాధికారానికి ప్రతీకగా త్రివర్ణ పతాకం ఆవిష్కృతమై నేటితో 75 సంవత్సరాలు పూర్తవుతున్నాయని సిఎం కెసిఆర్ పేర్కొన్నారు. ఈ చారిత్రిక సందర్భాన్ని పురస్కరించుకుని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపునిచ్చిందని, 1 కోటీ 20లక్షల జెండాలను ప్రభుత్వమే తెలంగాణ కార్మికుల చేతులతోనే తయారు చేయించి ఇంటింటికి ఉచితంగా అందజేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. త్రివర్ణ శోభితమైన యావత్ తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ఇచ్చిన పిలుపనకు ప్రతి స్పందించిన తెలంగాణ ప్రజానీకం ప్రతి ఇంటిపై జాతీయ పతకాలను ఎగరేయటంతో నేడు యావత్ తెలంగాణ రాష్ట్రం త్రివర్ణ శోభితమై మెరిసి మురిసి పోతున్నదని సిఎం కెసిఆర్ హర్షం వ్యక్తం చేశారు.

**స్వాతంత్ర జ్యోతిని వెలిగించిన సమరయోధులు**

1857 సిపాయిల తిరుగుబాటు సందర్భంలో వీరోచితంగా పోరాడిన ఝాన్సీ లక్ష్మీభాయి మొదలుకొని వేలాది మంది స్వాతంత్ర్య జ్యోతిని వెలిగించారని సిఎం కెసిఆర్ గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్యం నా జన్మహక్కని చాటిన లోకమాన్య బాలగంగాధర తిలక్, శాంతి, అహింసలతో స్వాతంత్ర్య పోరాటాన్ని శిఖరాగ్రానికి చేర్చిన మహాత్మాగాంధీ, అజాద్ హింద్ ఫౌజ్‌ను నడిపి సమరసేనానిగా నిలిచిన సుభాష్‌చంద్రబోస్, చిరునవ్వుతో ఉరికంబమెక్కిన ధీరాదాత్తుడు భగత్‌సింగ్ వంటి ఎందరో మహానీయుల త్యాగఫలం నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలోనూ,నవ భారత నిర్మాణంలోనూ మహోన్నతమైన పాత్ర పోషించిన తొలిప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ,తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్, మహోన్నత తాత్మికుడు,సంస్కర్త,భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వంటి మహానుభావుల సేవలు చిరస్మరణీయమన్నారు.

**స్వతంత్ర పోరాటంలో తెలంగాణ యోధుల ఉజ్వల పాత్ర**

భారత సముపార్జన కోసం మన తెలంగాణ వీరులు ఉజ్వలమైన పాత్రను నిర్వహించారని,తుర్రేబాజ్ ఖాన్, రాంజీ గోండు,మౌల్వీ అలావుద్దీన్,భారత కోకిల సరోజినీ నాయుడు,సంగెం లక్ష్మీభాయి,రామానంద తీర్థ, పీవీ నర్సింహారావు మొదలైన వారు సాహసోపేతంగా చేసిన పోరాటం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని సిఎం కెసిఆర్ వివరించారు. స్వాతంత్రోద్యమ సమయంలో తెలంగాణ ప్రజల పిలుపు మేరకు హైదరాబాద్‌ను సందర్శించిన గాంధీజి తెలంగాణ ప్రజల సామరస్య జీవనశైలిని గంగా జమునా తెహజీబ్‌గా అభివర్ణించారని, అది మనకు గర్వకారణమన్నారు. స్వతంత్ర భారతంలో 60 ఏండ్లు తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఉద్యమించిన తెలంగాణ స్వరాష్ట్రంగా అవతరించి,నేడు దేశానికే దిక్సూచిగా మారి దేదీప్యమానంగా వెలుగొందుతున్నదని సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు.

**బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ**

బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ నేడు దేశ నిర్మాణంలో అద్భుతమైన పాత్ర నిర్వహిస్తున్న బలీయమైన ఆర్థిక శక్తిగా మన తెలంగాణ రూపొందిందని చెప్పారు. దేశానికి అన్నం పెడుతున్న అన్నపూర్ణ తెలంగాణ ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయ సంక్షోభంతో సతమతమైన తెలంగాణ నేడు స్వరాష్ట్రంగా 11.6శాతం రికార్డు స్థాయి వ్యవసాయ వృద్ధిరేటుతో దేశానికి అన్నం పెడుతున్న అన్నపూర్ణగా అవతరించిందన్నారు. ఐటి,పారిశ్రామిక రంగాల్లో అగ్రగామి తెలంగాణ 12.01 శాతం ఉత్పత్తి రంగ వృద్ధి రేటుతో పారిశ్రామిక ప్రగతిలో అగ్రగామిగా నిలిచిన రాష్ట్రం మన తెలంగాణ అని,ఐటీ రంగ ఎగుమతుల్లో దేశంలో కెల్లా అత్యధికంగా 26.14శాతం వృద్ధిరేటుతో అప్రతిహతంగా దూసుకుపోతున్న రాష్ట్రం అని తెలిపారు. రాష్ట్రం అవతరించిన మొదటి సంవత్సరం 2014-15లో రాష్ట్ర ఆదాయం రూ.62 వేల కోట్లు ఉండగా, 2021 నాటికి రూ.1 లక్షా 84 వేల కోట్లకు పెంచుకోగలిగామని తెలిపారు. ఏడేండ్లలోనే తెలంగాణ రాష్ట్ర రాబడి మూడు రెట్లు పెరిగిందని, నేడు దేశంలోనే బలమైన ఆర్థిక సంపత్తి కలిగిన రాష్ట్రంగా తెలంగాణ ఎదిగిందన్నారు. గత ఏడేండ్లుగా రాష్ట్ర స్వంత పన్నుల ఆదాయం (ఎస్ఓటీఆర్)లో 11.5శాతం వృద్ధిరేటుతో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని చెప్పారు. ఈ విషయాన్ని కాగ్ నివేదిక వెల్లడించిందని, ఇది మన రాష్ట్రానికి గర్వకారణమని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం పాటించిన ఆర్థిక క్రమశిక్షణ, అడుగడుగునా ప్రదర్శించిన పారదర్శకత, అవినీతి రహిత పరిపాలన వల్లనే రాష్ట్ర ఆదాయ వనరుల్లో అనూహ్యమైన పెరుగుదల సాధ్యమైందన్నారు.

2014-15లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాడు రాష్ట్ర జీఎస్‌డీపీ రూ.5లక్షల 5వేల 849 కోట్లు కాగా, 2021-22 నాటికి రూ.11 లక్షల 48వేల 115 కోట్లకు చేరిందని అంటే గత ఏడేండ్లలో రాష్ట్ర జిఎస్‌డిపి 127శాతం పెరిగిందని, అదే సమయంలో దేశ జిడిపి 90శాతం పెరిగిందని, తెలంగాణ వృద్ధిరేటు భారత దేశ వృద్ధి రేటు కంటే 27 శాతం అధికంగా ఉందని, తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతికి ఇది నిదర్శమన్నారు. 2013-14లో సుమారు రూ.1లక్ష మాత్రమే ఉన్న రాష్ట్ర తలసరి ఆదాయం,తెలంగాణ ప్రభుత్వ కృషి వల్ల 2021-22 నాటికి రూ.2లక్షల 75వేలకు పెరిగిందని, ప్రస్తుతం జాతీయ తలసరి ఆదాయం రూ.1లక్ష 50వేల కంటే తెలంగాణలో తలసరి ఆదాయం 84శాతం అధికంగా ఉండటం గర్వించాల్సిన విషయమన్నారు.

# టిఆర్ఎస్ నేత తమ్మినేని కృష్ణయ్య దారుణ హత్య

≫ కూర్చుని ఉన్నారు. తెల్దారుపల్లిలోని తన నివాసానికి చేరుకోవడానికి కేవలం వందమీటర్ల దూరం మాత్రమే ఉండగా అంతలోనే వెనుక ఆటోలో ఆరుగురు వ్యక్తులు ద్విచక్ర వాహనాన్ని వెంబడించి ఆటోతో ఢీ కొట్టారు. దీంతో ద్విచక్ర వాహనంపై తమ్మినేని కృష్ణయ్య, కొప్పుల ముత్తేశం ఇరువురు కూడా నర్సరీ సమీపంలో ఉన్న సైడ్ కాలువలో పడిపోయారు. ఆటోలో ఉన్న ఆరుగురులో నలుగురు వ్యక్తులు వేటకొడవల్లతో అత్యంత పాశవికంగా కృష్ణయ్యపై దాడి చేసి రెండు చేతులను నరికేశారు. తలపై పలుమార్లు వేటు వేశారు. దీంతో కృష్ణయ్య అక్కడిక్కడే మృతి చెందారు. మరో రెండు నిమిషాలు గడిచి ఉంటే క్షేమంగా ఇంటికి చేరేవాడు. అంతలోనే ప్రత్యర్థుల చేతిలో దారుణ హత్యకు గురికావడం తీవ్ర సంచలనం రేకెత్తించింది.

**సీపీఎం గుండాలే హత్య చేశారు ప్రత్యక్షసాక్షి**

సీపీఎం పార్టీకి చెందిన గుండాలే ఈ హత్య చేశారని తమ్మినేని కృష్ణయ్యతో కలిసి ద్విచక్ర వాహనంపై ఉన్న కొప్పుల ముత్తేశ్ అనే ప్రత్యక్ష సాక్షి మీడియాకు వెల్లడించారు. ఆటోలో ఆరుగురు వ్యక్తులు తమను వెంబడించి తమ వాహనాన్ని ఢీ కొట్టారని వీరిలో గజ్జి.కృష్ణస్వామి, నూకల లింగయ్య, బోడపట్ల శ్రీను అలియాస్ మెంటల్ శ్రీను, చెవిటి నాగేశ్వర్‌రావు అనే వ్యక్తులు వేట కొడవళ్ళతో కృష్ణయ్యను నరికి హత్య చేశారని తనపై కూడా దాడి చేసేందకు ప్రయత్నించగా సమీపంలో ఉన్న రాళ్ళను వారిపై విసిరానని, అప్పటికే కృష్ణయ్య మరణించి ఉండవచ్చని భావించి తిరిగి ఆటోలో పరారయ్యరని తెలిపాడు. తన కాలు ద్విచక్రవాహనంలో పడిపోవడం వల్ల తీవ్ర గాయాలైనట్టు తెలిపాడు.

**తెల్దారుపల్లిలో తీవ్ర ఉద్రిక్తత**

తమ్మినేని కృష్ణయ్య హత్యకు గురికావాడానికి తమ్మినేని కోటేశ్వర్‌రావే ప్రధాన కారణమని మృతిని బంధువులు గ్రామస్తులు తీవ్ర కోపోద్రోక్తులై మృతిని నివాసానికి పక్కనే ఉక్క తమ్మినేని కోటేశ్వర్‌రావు ఇంటిపై దాడి చేశారు. కారును, ద్విచక్ర వాహనాలపై దాడికి పాల్పడి ధ్వంసం చేశారు. ఇంట్లో ఉన్న ఫర్నీచర్ విలువైన సామాగ్రిని పూలకుండీలను, కిటికీలను ధ్వంసం చేశారు. ఇంటిని పెద్దఎత్తున జనం దాడి చేసేక్రమంలో ఆ ఇంటిలో ఎవరూ లేకపోవడం విశేషం. కోటేశ్వర్‌రావు కు చెందిన ప్రొక్లేన్‌కు నిప్పు పెట్టి దగ్ధం చేశారు. విలువైన ఆస్తులను ధ్వంసం చేశారు. ఈ హత్యలో పాల్గొన్నట్లు భావిస్తున్న వారి ఇండ్లపై కూడా దాడికి యత్నించారు. విషయం తెలుసుకున్న పోలీసులు పెద్దఎత్తున పోలీస్ బలగాలను ఘటన స్థలానికి తరలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం ఉమ్మడి వరంగల్ జిల్లాలకు చెందిన పోలీస్ బలగాలను తెల్దారుపల్లి గ్రామానికి తరలించారు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు అధికారులు చర్యలు చేపట్టారు.

**ఘటనా స్థలానికి చేరుకున్న పోలీస్ కమిషనర్**

ప్రజాదరణ కలిగిన తమ్మినేని కృష్ణయ్య హత్యకు గురైనట్టు విషయం



దగ్ధమవుతున్న జెసిబి

తెలుసుకున్న ఖమ్మం పోలీస్ కమిషనర్‌విష్ణుయస్ వారియర్ ఇతర పోలీసు అధికారులతో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. హత్యకు గల కారణాలను మృతుని బంధువులను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. తెల్దారుపల్లి అత్యంత సమస్యాత్మాక గ్రామం కావడంతో ఈ గ్రామంలో గతంలో అనేక హత్యలు జరగడం రాజకీయ గొడవలు కలిగి ఉండటం, పాతకక్షల నేపథ్యంలో ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడుతూ ఉండటం ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం జరిగిన హత్యతో గ్రామంలో మరింత అలజడి రేగి మరిన్ని ఘటనలకు దారితీసే అవకాశాలు ఉంటాయని భావించి ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామం మొత్తం కలియతిరిగి పరిశీలించారు. ఈ నెల 16 వరకూ 144 సెక్షన్‌ను విధిస్తూ గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. గుంపులుగుంపులుగా తిరగడాన్నినిషేదిస్తూ గ్రామంలో మైక్ ద్వారా నిర్వహించారు. తమ్మినేని కృష్ణయ్య హత్యకు పాల్పడినట్లు భావిస్తున్న ఏడుగురు వ్యక్తులపై ఖమ్మం రూరల్ పోలీసులు కేసే నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్టు తెలుస్తుంది.

**తెల్దారుపల్లి ఘటనపై కేటీఆర్ ఆరా**

టీఆర్ఎస్ నేత మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రధాన అనచరుడు తమ్మినేని కృష్ణయ్య హత్యకు గురికావడంతో ఈ హత్యకు గల కారణాలను మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నుండి వివరాలను సేకరించారు. సీపీఎం పార్టీ హత్య రాజకీయాలకు పాల్పడుతుందని గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక రాజకీయ లబ్ది పొందేందుకు తమ్మినేని కృష్ణయ్యను హత్య చేసి ఉండవచ్చని మాజీ మంత్రి కేటీఆర్‌కు వివరించారు. పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించగా అక్కడ పోస్టుమార్టం ముగించుకుని తిరిగి ఇంటికి వచ్చే వరకూ తుమ్మల నాగేశ్వర్‌రావు ఆ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తూ వచ్చారు. మృతిని బంధువులను ఓదార్చారు. వారికి ధైర్యాన్ని ఇచ్చే విధంగా ఓదార్చి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# మంత్రి జగదీష్ అవినీతి బయటపెడతా

≫ పలు సలహాలు, సూచనలు చేశారు. తన రాజీనమాతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మునుగోడు ఉప ఎన్నిక కోసం దేశం ఎదురు చూస్తుందన్నారు. దేశ, రాష్ట్ర భవిష్యత్తులకు దిశా నిర్దేశం చేసేలా మునుగోడు ఉప ఎన్నిక మారిందన్నారు. మునుగోడులో బిజెపి గెలుపు కాదని, పోటీ చేసేది ప్రజలే, గెలిచేది ప్రజలేనన్నారు. తాను మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్నన్ని నాళ్లు నిధులు ఇవ్వకుండా టీఆర్ఎస్ ప్రభుత్వం నియోజవకర్గ అభివృద్ధిని అడ్డుకున్నాడన్నారు. తన రాజీనామాతోనైనా మునుగోడు అభివృద్ధి చెందుతుందని భావించే తాను తన పదవికి రాజీనామా చేశానన్నారు. ఉప ఎన్నికలు వస్తేనే అభివృద్ధి చేస్తాం అన్న రీతిలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజల బతుకులు మారుతాయని అనుకున్నారని, నేడు కేసిఆర్ కుటుంబం బంగారు తెలంగాణ పేరా కుటుంబ పాలన సాగుతుందని, బంగారు కుటుంబంగా సంపాదించుకుంటుందన్నారు. తాను కాంట్రాక్టుల కోసం బిజెపిలో చేరుతున్నట్లు మంత్రి జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి వాస్తవం లేదని, అది వాస్తవం అని నిరూపిస్తే నేను మునుగోడు ఉప ఎన్నికల్లో పోటీ చేయబోనన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి అవినీతి, నేర చరిత్ర కలవాడని, గత ఎనమిదున్నర ఏళ్లల్లో రూ.వెయ్యి కోట్లు అక్రమంగా సంపాదించుకున్నాడని ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ ఎయిర్ పోర్టు వద్ద 70 ఎకరాల్లో ఫామ్ హౌజ్ నిర్మించుకున్నాడని, అవి ఎక్కడి సొమ్ము అంటూ సవాల్ చేశారు. జగదీష్‌రెడ్డి అవినీతి చిట్టాను త్వరలోనే బయట పెడతానని, నాపై మంత్రి చేసిన ఆరోపణలను నిరూపించకపోతే మంత్రి పదవికి రాజీనామా చేస్తావా అంటూ తీవ్ర పదజాలంతో విరుచుకుపడ్డారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే తనపై తప్పుడు ప్రచారం చేస్తూ వాల్ పోస్టర్లను వేయడం సరికాదన్నారు. చౌటుప్పల్‌లో విచ్చల విడిగా పరిశ్రమల కాలుష్యం పెరిగి రైతులు పండించిన పంటలు పూర్తిగా దెబ్బతింటున్నా పట్టించుకునే నాధుడు కరువయ్యాడన్నారు. ఈ ప్రాంత యువతకు ఉపాధి కల్పించలేకపోయారన్నారు. రానున్న రోజుల్లో బిజెపి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. మునుగోడును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటిసి చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, వైస్ ఎంపిపిఉప్పుభద్రయ్య, ఉబ్బు వెంటకయ్యతో పాటు పెద్ద సంఖ్యలో కోమటిరెడ్డి అనుచరులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విడుదల కాని క్షమాభిక్ష ఖైదీలు

≫ అమలు చేయాల్సి వుంది. ఇందుకు సంబంధించిన కసరత్తులు కూడా జరిగాయని సమాచారం. దీనిపై ఖైదీల కుటుంబీకులకు కూడా సమాచారం అందడంతో వారిలో అనేకులు చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్ల వద్ద సోమవారం ఉదయం నుంచి తమ వారి విడుదల కోసం ఎదురు చూశారు. దీనిపై కొందరు జైళ్ల శాఖ అధికారులను అడిగినా తమకు ఎ లాంటి ఆదేశాలు రాలేదని, దీంతో ఖైదీల విడుదల జరగడం లేదని వారు సమాధానం ఇచ్చారు. దీంతో చేసేది లేక ఖైదీల కుటుంబీకులు సాయంత్రం వరకు ఎదురు చూసి నిరాశతో వెనుదిరిగారు. మరోవైపు పొరుగు తెలుగు రాష్ట్రం ఎపిలో పంద్రాగస్టు రోజునే 175 మంది జీవిత ఖైదీలు క్షమాభిక్ష కారణంగా విడుదలయ్యారు.

దీంతో తెలంగాణలోనూ జీవిత ఖైదీల విడుదల వుంటుందని ఉదయం నుంచి వార్తలు వచ్చినా దీనిపై ఆదేశాలు రాకపోవడంతో వాయిదా పడింది. జైళ్ల శాఖ అధికారులు చెబు తున్న వివరాల ప్రకారం మరో వారం, పది రోజుల్లో రాష్ట్రంలో జీవిత ఖైదీలకు క్షమాభిక్ష లభించే వీలుంది.

## వారం - వర్జ్యం

16-8-2022 మంగళవారం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం
శ్రావణ మాసం, కృష్ణ పక్షం, కార్తె ఆశ్లేష
పంచమి రా.11-45; రేవతి రా.1-22
వర్జ్యం మ.1-22 ల 2-58
రా.కా. మ.3-00 ల 4-30 వ
యమగండం ఉ.9-00 ల 10-30 వ
దుర్ముహూర్తం ఉ.8-24 ల 9-12 వ
రా.10-48 - 11-36

## వార్తాఫలం

**మేషం:** నూతన వస్త్రాభరణాలు కొనుగోలు. పెట్టుబడులు లాభిస్తాయి. వాహన యోగం.

**వృషభం:** వృధా ఖర్చులుంటాయి. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి.

**మిథునం:** విద్యార్థులకు సానుకూలం. చిరకాల కోరిక నెరవేరుతుంది.

**కర్కాటకం:** విశేష వస్తువులు సమకూర్చుకుంటారు. చర్చలు వాయిదా.

**సింహం:** ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. వృత్తి విద్యా కోర్సుల్లో చేరతారు.

**కన్య:** ఆరోగ్య సలహాలు పాటించండి. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు.

**తుల:** సంతానాభివృద్ధి ఆనందం కలిగిస్తుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి.

**వృశ్చికం:** దేవాలయాలు సందర్శిస్తారు. స్త్రీలకు సానుకూలంగా ఉంటుంది.

**ధనుస్సు:** వ్యవసాయదారులకు సామాన్యం. శుభ వార్తలు వింటారు. గృహ యోగం.

**మకరం:** ముఖ్య నిర్ణయాలు అమలు. సాహిత్య సభలకు హాజరవుతారు.

**కుంభం:** రోజంతా ఉత్సాహంగా గడుస్తుంది. మొండి బకాయిలు వసూలు.

**మీనం:** ప్రభుత్వ సంబంధమైన పనులు పూర్తి. విందు-వినోదాల్లో పాల్గొంటారు.

**- పాలకుర్తి సంతోష శర్మ,** విజయపురి కాలనీ, హైదరాబాద్

# డిజిపికి కరోనా

## పంద్రాగస్టు వేడుకలకు దూరం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** డిజిపి మహేందర్ రెడ్డి కరోనా బారిన పడ్డారు. ఈ కారణంగా గోల్కొండ కోటలో సోమవారం జరిగిన పంద్రాగస్టు వేడుకలకు ఆ యన దూరంగా వున్నారు. సిఎం కెసిఆర్ సహా మంత్రులు, ప్రముఖులు హాజరైన ఈ వేడుకలకు ప్రతీ ఏడాది డిజిపి మహేందర్ రెడ్డి సహా పోలీసు ఉన్నతాధికారులు పాల్గొనడం విదితమే. అయితే ఈసారి డిజిపి మహేందర్ రెడ్డి రాకపోవడంతో దీనిపై పలువురు పలురకాలుగా చర్చించుకున్నారు. అయితే డిజిపి కార్యాలయం దీనిపై స్పష్టత ఇస్తూ మహేందర్ రెడ్డి కరోనా బారినపడి హోం క్వారంటైన్‌లో వున్నారని, ప్రస్తుతం తన కార్యకలాపాలన్నీ ఇంటి నుంచే నిర్వహిస్తున్నారని వెల్లడించింది. కాగా సిఎం పాల్గొన్న పంద్రాగస్టు వేడుకలకు శాంతి భద్రతల అదనపు డిజిపి జితేందర్‌తో పాటు సిటీ కొత్వాల్ సి.వి ఆనంద్ సహా అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు. కాగా సోమవారం సాయంత్రం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై ఆధ్వర్యంలో జరిగిన ఎట్ హోం కార్యక్రమానికి కూడా డిజిపి హాజరు కాలేదు.

# రాష్ట్రంలో తాజా కేసులు 265

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు15:** రాష్ట్రంలో కరోనా పాజిటీవ్ కేసులు మళ్లీ పెరుగుతున్నాయి. సోమవారం సాయంత్రం వరకు ఒక్క రోజులో 265 కేసులు నమోదైనట్లు వైద్య ఆరోగ్యశాఖ తెలిపింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 8,29,467పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటలో కరోనా వల్ల మృతి చెందినట్లుగా నమోదు కాలేదు.రాష్ట్రంలో ఇప్పటివరకు మృతి చెందిన వారి సంఖ్య 4111 వరకు చేరింది. ఒక్క రోజులో 17,521మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటివరకు రాష్ట్రంలో 3,70,16,317 మందికి కరోనా పరీక్షలు నిర్వహించారు.ఇప్పటి వరకు కరోనా నుంచి 8,22,173 మంది కోలుకోగా (99.12శాతం)సోమవారం 528మంది కోలుకున్నారు,మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 3183కు చేరింది.ఆదివారం నమోదైన కేసుల్లో జిహెచ్ఎంసి పరిధిలో 142 కరోనా పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్‌లో2,భద్రాద్రి కొత్తగూడెంలో2, జగిత్యాలలో5,జనగామ్‌లో1,జయశంకర్ భూపాలపల్లిలో0,జోగులాంబ గద్వాలలో2,కామారెడ్డిలో0, కరీంనగర్‌లో15, ఖమ్మంలో5, కొమురంభీమ్ ఆసిఫాబాద్‌లో0,మహబూబ్‌నగర్‌లో2,మహబూబాబాద్‌లో2,మంచిర్యాలలో10,మెదక్‌లో1,మేడ్చల్ మల్కాజిగిరిలో15, ములుగులో3,నాగర్‌కర్నూలులో2, నల్లగొండలో3,నారాయణ్‌పేటలో0, నిజామాబాద్‌లో 6 పాజిటీవ్ కేసులు నమోదయ్యాయి.



సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో సైనిక అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం కెసిఆర్



ప్రగతిభవన్ వద్ద జాతీయ పతాకావిష్కరణ చేసిన సిఎం కెసిఆర్



గోల్కొండలో పతాకావిష్కరణలో పాల్గొన్న పలు సంస్థల చైర్మన్లు

# రాష్ట్రంలో ఆగని రాజకీయ హత్యలు

- రెండేళ్లలో ముగ్గురు ప్రముఖుల దారుణ హత్య
- మొన్న వెంకన్న యాదవ్, నిన్న విజయ్ రెడ్డి, నేడు తమ్మినేని కృష్ణయ్యల హత్యోదంతాలు
- మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎంఎల్ఎ జీవన్ రెడ్డి హత్యలకు కుట్ర

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** తెలంగాణలో వరుస రాజకీయ హత్యలు, హత్యలకు కుట్రలు ప్రకంపనలు రేపుతున్నాయి. రెండేళ్ల వ్యవధిలో ముగ్గురు రాజకీయ నేతలు ప్రత్యర్థుల చేత దారుణంగా హత్యకు గురవడం ఒక మంత్రి, మరో ఎంఎల్ఎను హత్య చేసేందుకు కుట్రలను పోలీసులు చివరి నిమిషంలో భగ్నం చేయడం రాజ కీయంగా తీవ్ర కలకలం రేపింది. ఇదే సమయంలో రాజకీయ హత్యల సందర్భంగా ఆయా ప్రాంతాలలో ప్రతీకార దాడులకు ఆస్కారం కలిగించడంతో పాటు శాంతి భ ద్రతలకు విఘాతం కలిగిస్తుండడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఖమ్మంలో ఆదివారం నాడు టిఆర్ఎస్ నాయకుడు తమ్మినేని కృష్ణయ్యను కొందరు పథకం ప్రకారం హత్య చేయడంతో ఆయన అనుచరులు ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు చేసి, ఆస్తులను ధ్వంసం చేయడం సంచలనం రేపింది.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి ఎపి హయాంలో రాజకీయ హత్యలు పలుమార్లు జరిగిన ఉదంతాలు వున్నాయి. ఈ హత్యలు ఎక్కువగా రాయలసీమ, ఆంధ్ర ప్రాంతాలలో ఎక్కువగా జరిగేవి. తెలంగాణ వరకు వస్తే ఇలాంటివి తక్కువగా వెలుగు చూసేవి. తెలంగాణ ఏర్పాటయ్యాక రాష్ట్రంలో రాజకీయంగా ఎంత వేడి వున్నా హత్యల పరంపర పెద్దగా లేవనే చెప్పాలి. 2020 ఫిబ్రవరి నెలలోలో సూర్యాపేట్ జిల్లాలో మంత్రి జగదీష్ రెడ్డి ముఖ్య అనుచరుడు ఒంటెద్దు వెంకన్న యాదవ్ (39)ను ప్రత్యర్థులు దారుణంగా హత్య చేయడం కలకలం రేపింది. అధికార పార్టీకి చెందిన నాయకుడు, మంత్రికి ముఖ్య అనుచరుడుగా వున్న నేతను దారుణంగా చం పడం అప్పట్లో కలకలం రేపింది. ఈ హత్యకు పాల్పడ్డ వారు కిరాయి హంతకులు కావడం ఒక ఎత్తయితే ఈ హత్యకు వాడిన పదునైన కత్తులను రైలు పట్టాలకు వాడే పదునైన ఇనుముతో ప్రత్యేకంగా తయారు చేయడం మరో ఎత్తు. ఈ కేసులో నిందితులందరు అరెస్టయినా వివాదరహితుడైన ఓ నేత అన్యాయంగా ప్రాణాలు కోల్పోవడ ం అందరిని కలచి వేసింది. ఈ హత్య తరువాత మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను హత్య చేసేందుకు కొందరు కుట్ర పన్నిన విషయం వెలుగు చూడడం మరింత సంచలనం రే పింది. ఈ కేసులో నిందితులు అరెస్టయ్యారు. దీన తరువాత పక్షం రోజుల క్రితం ఆర్మూరు ఎంఎల్ఎ జీవన్ రెడ్డిని హత్య చేసేందుకు కొందరు ప్రయత్నించడం మరిం త సంచలనం రేపింది. జీవన్ రెడ్డిని హత్య చేసేందుకు అధికార పార్టీకి చెందిన సర్పంచ్ భర్త ప్రసాద్ గౌడ్ కుట్ర పన్నడం రాజకీయంగా కలకలం రేపింది. ఇందుకుగానూ నిందితుడు ఏకంగా బంజారాహిల్స్‌లోని జీవన్ రెడ్డి ఇంట్లోకి రావడం, ఆయన బెడ్ రూంలోకి దూసుకువెళ్లగా చివరి నిమిషంలో జీవన్ రెడ్డి ప్రమాదాన్ని గమనిం చి కేకలు వేయడంతో కుట్ర భగ్నమయ్యింది. ఈ కేసులో నలుగురు నిందితులు పట్టుబడగా మరో ఇద్దరు పరారీలో వున్నారు. దీని తరువాత మూడు రోజుల క్రితం న ల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎల్లమ్మగూడ సర్పంచ్ గాదె సంధ్య భర్త న్యాయవాది కూడా అయిన గాదె విజయ్ రెడ్డిని ప్రత్యర్థులు దారికాచి దారుణంగా రోడ్డుపైనే హత్య చేశారు. ఈ హత్య వెనుక ఎంఎల్ఎ భూపాల్ రెడ్డి హస్తం వుందని హతుడి భార్య సర్పంచ్ సంధ్య ఆరోపణలు చేయడం గమనార్హం. ఈ హత్య వెనుక రాజకీయ కారణాలతో పాటు న్యాయవాది అయిన విజయ్ రెడ్డి సమాచార హక్కు చట్టం కింద సర్కారు పథకాలలో అక్రమాలను వెలుగులోకి తేవడం కూడా ఒక కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసులో ఇంకా నిందితులు పట్టుబడలేదు. ఈ హత్య తాలూకు రాజకీయ వేడి ఇంకా చల్లారక ముందే ఆదివారం నాడు అధికార పార్టీకి చెందిన తమ్మినేని కృష్ణయ్యను ప్రత్యర్థులు ఆటోతో ఢీకొట్టి వేట కొడవళ్లతో దారుణంగా నరికి చంపారు. హతుడు కృష్ణయ్య మాజీ మంత్రి ఖమ్మంకు చెందిన టిఆర్ఎస్ సీనియర్ నాయకుడు తుమ్మల నాగేశ్వరరావుకు ముఖ్య అనుచరుడు కావడం గమనార్హం. తెల్దారుపల్లి శివార్లలో జరిగిన ఈ హ త్యకు సిపిఎం నేత తమ్మినేని వీరభద్రం సోదరుడు కోటేశ్వరరావు కారణమని ఆరోపిస్తూ ఆయన ఇంటిపై, ఆస్తులపై దాడులకు, కోటేశ్వరరావు మైనింగ్ స్థావరంలో వున్న ప్రొక్లైనర్‌ను తగుల బెట్టారు. దీంతో పాటు సిపిఎం దిమ్మెలను ధ్వంసం చేశారు. వాహనాలను ధ్వంసం చేయడంతో ఆ ప్రాంతంలో పోలీసులు 144 సెక్షన్ విధించారు. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అ దనపు బలగాలను రంగంలో దించారు. ఈ ఘటనలతో పాటు పలుచోట్ల రాజకీయ కారణాల వల్ల ఇంకొన్ని హత్యలు జరిగిన ఉదంతాలూ వున్నాయి,అయితే వీరంతా చిన్నపాటి నాయకులు కావడం,ఇందులో అనేకఘటనల్లో వారి బంధువుల హస్తం వుండడం విశేషం.

### రాజకీయ వేడి రగులుతున్న తరుణంలో పోలీసులకు సవాల్‌గా మారుతున్న హత్యల పరంపర

రాష్ట్రంలో రాజకీయంగా వేడి రగులుతున్న తరుణంలో మూడు రోజుల వ్యవధిలో రెండు వేరు వేరు చోట్ల ఇద్దరు రాజకీయ నాయకులు దారుణంగా హత్య కావించ బడడం పోలీసులకు సవాల్‌గా మారింది. త్వరలోనే మునుగోడు అసెంబ్లీకి ఉప ఎన్నిక జరగనుండడం, ఇదే సమయంలో బిజెపి, కాంగ్రెస్ నాయకుల పోటాపోటీ పాద యాత్రలు జరుగుతుండడం తెలిసిందే సోమవారం నాడు జనగాంలో బిజెపి అధ్యక్షుడు బండి సంజయ్ పాదయాత్ర సందర్భంగా ఆ పార్టీ నాయకులు, టిఆర్ఎస్ కార్య కర్తలకు మధ్య గొడవ జరిగి బాహాబాహీకి దారితీయడంతో పోలీసులు రంగంలో దిగి లాఠీఛార్జి చేసి ఇరువర్గాలను చెదరగొట్టాల్సి వచ్చింది. బిజెపి, టిఆర్ఎస్ నాయకు ల మధ్య ఇంతకు ముందు కూడా పలుచోట్ల ఘర్షణ జరగడం, పోలీసులు లాఠీలకు పనిచెప్పిపరిస్థితులను అదుపులోకి తేవడం విదితమే. ఇటువంటి సమయంలో శాం తి భద్రతల పరంగా సున్నితమైన ప్రాంతం, రాజకీయంగా చురుకుగా వుండే ప్రాంతం ఖమ్మంలో అధికార పార్టీ నాయకుడు హత్యకు గురవడం పోలీసులకు చిక్కులు తె చ్చి పెట్టింది. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలకు ఇంకా ఏడాదిన్నరకు పైగా సమయం వున్నా అప్పుడే ఎన్నికలు అన్నట్లుగా రాజకీయ పార్టీలు ఒకరిని మించి మరొకరు ప్ర చారంలో దూసుకుపోతుండడం, వీటికి బందోబస్తు ఏర్పాటు చేయడం పోలీసులకు తలకుమించిన పనిగా మారుతోంది.

## తెలంగాణలోని దేవాలయాల్లో బంగారు, రాగి నాణాల విక్రయం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులు సమర్పించిన బంగారు, రాగి నాణాల విక్రయం సోమవారం నుంచి ప్రారంభమైంది. భక్తులు తమకు ఇష్టమైన దేవాలయాలను సందర్శించి తమ కోర్కెలు తీరితే నగదు, నాణాల రూపేణా మొక్కులు చెల్లించుకుంటామని మొక్కుతుంటారు. ఈ విధంగా భక్తులు హుండీలో మొక్కుల రూపేణా వేసిన కానుకలను దక్కించుకోవడం కూడా భక్తులు అదృష్టంగా భావిస్తారు. దీనిని దృష్టిలో ఉంచుకుని దేవాదాయ శాఖ రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో భక్తులు సమర్పించిన బంగారు, రాగి నాణాల విక్రయాన్ని సోమవారం నుంచి ప్రారంభించింది. కరీంనగర్ జిల్లా కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయం, బాసర జ్ఞాన సరస్వతి దేవాలయం, భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో రాణి నాణాలను భక్తులను విక్రయించనున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వరి దేవస్థానం, కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవస్థానం, సికింద్రాబాద్ తాడ్‌బండ్ ఆంజనేయస్వామి దేవస్థానం, ఉజ్జయిని మహంకాళి దేవస్థానం, హైదరాబాద్ బాల్కంపేట ఎల్లమ్మపోచమ్మ దేవస్థానం, శ్రీనగర్ కాలనీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం, సంగారెడ్డి జిల్లా రుద్రారం గణపతి దేవాలయం, వరంగల్ భద్రకాళి దేవస్థానం, ఖమ్మం జిల్లా శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానం, మహబూబాబాద్ జిల్లా కొరవి వీరభద్రస్వామి దేవస్థానం, అలాగే, యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో బంగారు నాణాలను విక్రయించనున్నారు.



## విద్యుత్‌లో దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ

### జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్‌రావు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** విద్యుత్ రంగంలో దేశానికే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలిచిందని జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి డి ప్రభాకర్‌రావు అన్నారు. విద్యుత్ రంగం అభివృద్ధే ధ్యేయంగా ఉద్యోగులందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ విద్యుత్ సౌధలో సోమవారం జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ వ్యవస్థలను 36,918 కోట్ల రూపాయలతో బలోపేతం చేసినట్లు చెప్పారు. రాష్ట్రం ఏర్పడక ముందు 1196గా ఉన్న తలసరి విద్యుత్ వినియోగం ప్రస్తుతం 2012 యూనిట్లకు పెరిగిందన్నారు. తెలంగాణ ప్రస్తుత తలసరి వినియోగం 1161 యూనిట్లు జాతీయ తలసరి వినియోగం కంటే 73 శాతం ఎక్కువని వివరించారు. 2021-22 సంవత్సరంలో ఆల్‌టైమ్ హైడల్ పవర్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా జెన్‌కో రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉండగా 2014 మార్చిలో అత్యధిక గరిష్ట డిమాండ్ 13162 మెగావాట్లు కాగా, ఈ ఏడాది మార్చి నెలలో 14160 మెగావాట్లకు పెరిగిందన్నారు. భవిష్యత్‌లో 17 వేల మెగావాట్ల డిమాండ్‌ను సైతం అందుకునేందుకు సిద్ధంగా ఉన్నాయమని చెప్పారు. 2014 జూన్ నాటికి 7778 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉండగా, దాన్ని 17333 మెగావాట్లకు పెంచడం జరిగిందన్నారు. వ్యవసాయానికి చరిత్రలో తొలిసారిగా 26.90 లక్షల పంప్ సెట్లకు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో విద్యుత్ వాహనాల వృద్ధిని దృష్టిలో ఉంచుకుని అందుకు తగినట్లుగా కరెంట్ సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జెఎండి సి శ్రీనివాసరావు, డైరక్టర్లు జి నర్సిం‌గ్‌రావు, టి జగత్‌రెడ్డి, జె సూర్యప్రకాష్, బి నర్సిం‌గ్‌రావు, టిఆర్‌కె రావు, సిహెచ్ వెంకట రాజం, ఎం సచ్చిదానందం, ఎస్ అశోక్‌కుమార్, బి లక్ష్మయ్య, ఎ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# మద్యమానేరులో ఆక్వాహబ్ ఏర్పాటుకు చర్యలు



- నేతన్న బీమాతో కార్మికుల కుటుంబాలకు ఆర్థిక భరోసా
- పేదల ఆత్మగౌరవ ప్రతీకలు డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- త్వరలో జిల్లాలోని ప్రజలకు డిజిటల్ హెల్త్ కార్డులు
- రాష్ట్రానికి, దేశానికి ఆదర్శంగా సిరిసిల్ల
- రాష్ట్ర మున్సిపల్,ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు

**సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 15, ప్రభాతవార్త:**జిల్లాల పునర్వ్యవస్థీకరణలో బాగంగా కొత్తగా ఏర్పడిన దార్మిక, కార్మిక, కర్షక క్షేత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలో గతంలో ఎప్పుడు చూడని విదంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయని రాష్ట్ర మున్సిపల్, ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరావు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఘనంగా స్వతంత్ర భారత వజ్రోత్సవ వేడుకలు నిర్వహించారు. మంత్రి కెటిఆర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ప్రసంగిస్తూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు శరవేగంగా నడుస్తున్నాయని తెలిపారు. శ్రీ రాజరాజేశ్వర జలాశయం కేంద్రంగా రెండు వేల కోట్ల భారీ పెట్టుబడితో 10 వేల మందికి ఉపాదినిచ్చేలా మద్యమానేరులో 367 ఎకరాల విస్తీర్ణంలో అతిపెద్ద అక్వాహబ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 3 వేల 402 డబుల్ బెడ్ రూం ఇండ్లను పూర్తి చేశామని తంగళపల్లి మండలం మండెపల్లి శివారులో సిరిసిల్ల పట్టణ లబ్దిదారులకు 27 ఎకరాల్లో సుమారు 87 కోట్ల 67 లక్షల రూపాయలతో నిర్మించిన 1320 ఇండ్లు సిఎం కెసిఆర్ చేతుల మీదుగా గత ఏడాది ప్రారంబించుకోవడం జరిగిందన్నారు. సొంత స్థలంలో ఇండ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం 3 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి త్వరలో ప్రారంబిస్తామని తెలిపారు. నిరుపేదల ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం అధిక ప్రాదాన్యత ఇస్తుందని సిరిసిల్ల జిల్లా కేంద్ర ఆసుపత్రిలో రక్తనిది, మాతాశిశు సంరక్షణ కేంద్రం, ఇంటెన్సివ్ కేర్ యూనిట్, డయాలసిస్ కేంద్రంను అందుబాటులోకి తెచ్చమని మంత్రి తెలిపారు. వేములవాడలో ప్రాంతీయ వైద్యశాలను ఇప్పటికే ప్రారంబించుకున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాదారణ ప్రసవాలను పెంచేందుకు జిల్లా యంత్రాంగం, వైద్యాదికారులు తీసుకుంటున్న చర్యలు అబినందనీయమన్నారు.జిల్లా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈహెల్త్ ప్రొఫైల్ ప్రాజెక్ట్‌ను జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా తీసుకోవడం జరిగిందన్నారు. త్వరలోనే జిల్లాలోని ప్రజలందరికి ఆరోగ్య డిజిటల్ కార్డులను అందజేస్తామని మంత్రి చెప్పారు. జిల్లాలో కొత్తగా 18 వేల 383 పించన్‌లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. జిల్లా కేంద్రం సిరిసిల్ల అబివృద్ధికి చిరునామాగా నిలుస్తోందన్నారు. దక్షిణ బారత దేశంలో పరిశుభ్రమైన పట్టణంగా అవార్డు సొంతం చేసుకుందని ఎన్నో అవార్డులను అందుకుందని తెలిపారు. రాష్ట్రానికి, దేశానికి సిరిసిల్ల ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. దార్మిక క్షేత్రం వేములవాడ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందని మంత్రి తెలిపారు. నేత కార్మికుల జీవితాల్లో వెలుగుల నింపడానికి, నిరంతరం ఉపాది కల్పించాదానికి ప్రభుత్వం 2500 కోట్ల విలువైన బతుకమ్మ చీరల ఉత్పత్తికి అనుమతి ఇచ్చిందన్నారు. దేశంలోనే తొలిసారిగా నేతన్న భీమా పథకానికి ప్రభుతం శ్రీకారం చుట్టిందని తెలంగాణలో సుమారు 80 వేల మంది కార్మికుల కుటుంబాలకు ఈ భీమా ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. తమప్రభుత్వం పవర్‌లూం రంగంపై ఆదారపడిన కుటుంబాలకు అన్ని వేళాలా అండగా ఉంటామని తెలిపారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీలేకుండ జిల్లా యంత్రాంగం ముందుకు సాగుతుందని నేర నియంత్రణ కోసం కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తూ జిల్లాను సేఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లాగా తీర్చిదిద్దుతున్నామని మంత్రి కెటిఆర్ తెలిపారు. అనంతరం ఉత్తమ సేవలన అందించిన అధికారులకు మంత్రి ప్రశంసా పత్రాలను ఆందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ రాఘవరెడ్డి, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే, అదనపు కలెక్టర్‌లు సత్యప్రసాద్, ఖ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగుల సంక్షేమం కోసం కృషి

### మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ కమిషనర్ దివ్య

**హైదరాబాద్, ఆగస్టు 15,ప్రభాతవార్త:**ప్రత్యేకఅవసరాలు కలిగిన వారి (వికలాంగులు) అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్నటు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ దివ్య తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం వికలాంగులకు వివిధ పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులను అన్ని రకాలుగాను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. వివిధ స్వచ్ఛంధ సంస్థల సహకారంతో ప్రత్యేక అవసరాలు కలిగిన వ్యక్తులకు వీల్ చైర్‌లు,వినికిడి పరికరాలను అందించడం జరిగిందనిచెప్పారు. ఈ కార్యక్రమంలోమహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ జాయింట్ డైర్టర్లు లక్ష్మీదేవి, సునం ద, రీజినల్ జాయింట్ డైరక్టర్ శారద, తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు శ్రీనివాసరావు వివిధ స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# బండి సంజయ్ పాదయాత్రలో ఉద్రిక్తత!

### పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన గొడవ కార్యకర్తలకు తీవ్రగాయాలు

**ప్రభాతవార్త ప్రతినిధి, జనగామ:** స్వాతంత్ర్య దినోత్సవం వేళ ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. ఆదివారం రాత్రి బీజేపీ పార్టీకి చెందిన గద్దెను గుర్తుతెలియని వ్యక్తులుకూల్చివేయడంతో మొదలైన గొడవ ఉద్రిక్తత పరిస్థితులకు దారి తీసింది. జనగామ జిల్లాలో టీఆర్ఎస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో బీజేపీ నేతలపై టీఆర్ఎస్ కార్యకర్తలు రాళ్లు విసిరారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. వివరాల ప్రకారం.. తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు బండిసంజయ్ పాదయాత్రలో భాగంగా ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ ప్రజాసంగ్రామ యాత్రలో భాగంగా సోమవారం దేవరుప్పుల మండలకేంద్రంలో మాట్లాడుతుండగా రాళ్లు, కర్రలుపైకి లేచాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చిందా అని బండి సంజయ్ ప్రశ్నించారు. మీపార్టీ కూడా ఇవ్వలేదుకదా అని టీఆర్ఎస్ కార్యకర్తలు ప్రశ్నిస్తూ బీజేపీ డౌన్ డౌన అంటూ నినాదాలు చేయడంతో బీజేపీ కార్యకర్తలు టీఆర్ఎస్ డౌన్ డౌన్ అంటూ ఇరుపార్టీల మధ్యతోపులాట జరిగింది. పాదయాత్ర సందర్భంగా దేవరుప్పుల టీఆర్ఎస్ నాయకులు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఇరుపార్టీల కార్యకర్తలు, నేతలు రాళ్లు, కర్రలతో దాడులకు దిగడంతో అరగంటపాటు మూడుచోట్ల రెండుపార్టీలు నినాదాలు చేసుకుంటు దాడులకు దిగడంతో దాడులలో బీజేపీ కార్యకర్తల తలలకు గాయాలు కాగా ఆంబులెన్స్‌లో





వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

**వరంగల్‌సీపీపై బండిసంజయ్ తీవ్ర ఆగ్రహం:** విధులు నిర్వహించడం చేతకాకుంటే ఇంట్లో కూర్చోవాలని వరంగల్ సీపీ తరుణ్‌జోషిపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలకేంద్రంలో బీజేపీ కార్యకర్తలపై జరిగిన దాడి గురించి డీజీపీ మహేందర్‌రెడ్డికి బండిసంజయ్ ఫోన్‌చేసి మాట్లాడారు. ముందుగా అన్ని అనుమతులు తీసుకుని యాత్రకు బయల్దేరినా కనీసం భద్రత కల్పించకుంటే పోలీసులు ఏం విధులు నిర్వహిస్తున్నట్లు అని ప్రశ్నించారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తులుగా మారారని ఆరోపించారు. టీఆర్ఎస్‌పార్టీ కార్యకర్తలు చేసిన దాడుల్లో బీజేపీ కార్యకర్తలు చేసిన దాడుల్లో బీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. దాడిచేసిన వారిని వదిలి బీజేపీ కార్యకర్తలపైనే పోలీసులు లాఠీచార్జికి దిగారంటూ మండిపడ్డారు. పదినిముషాల్లో పరిస్థితిని అదుపులోకి తీసుకవచ్చి తమ యాత్రకు విఘాతం కలగకుండా చూడాలని లేనిపక్షంలో తామేంటో చూపిస్తామని చెప్పారు. పోలీసుల వైఖరికి నిరసనగా తనకు కల్పించిన భద్రతా సిబ్బందిని తిరస్కరించారు. తన భద్రతను పార్టీ కార్యకర్తలే చూసుకుంటారంటూ భద్రతను స్వీకరించడానికి నిరాకరించారు.

## స్వాతంత్ర్య పోరాట గాథలు భవిష్యత్ తరాలకు అందించాలి: ఎస్‌బిఐ సీజీఎం



**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య పోరాట గాథలను రాబోయే తరాలకు అదించాలని ఎస బిఐ సీజీఎం అమిత్ ఝింగ్రాన్ అన్నారు. హైదరాబాద్‌లోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో సోమవారం జాతీయ జెండాను ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు స్వేచ్ఛ యొక్క నిజమైన విలువను గుర్తించడంలో సహాయ పడుతుందన్నారు.

1947 భారత దేశం అనుభవించిన భయాందోళనలను నేటి తరానికి తెలియచేసే విధంగా తెలంగాణ వ్యాప్తంగా 19 కేంద్రాల్లో ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎస్‌బిఐ ఎన్నో సవాళ్లను అధిగమించి 50 లక్షల కోట్ల రూపాయలకు చేరుకుందని తెలిపారు. ఎస్‌బిఐ కేవలం బ్యాంకింగ్‌ను మాత్రమే కాకుండా దాని అనుబంధ సంస్థల ద్వారా బీమా, జనర్ ఇన్సూరెన్స్, క్యాపిటల్ మార్కెట్‌లు, క్రెడిట్ కార్డ్ వ్యాపారాల్లో అగ్ర గామిగా ఉందన్నారు. ఏడాది కాలంగా వివిధ విభాగాల్లో మార్కెట్ వాటాను మెరుగుపరచుకోవడంపై దృష్టిసారించి నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంలు, ఏజీఎంలు తదితరులు పాల్గొన్నారు.

వార్త

ఆయుధాల కంటే కోపం
మిక్కిలి ప్రమాదకరమైనది.
-సిసిరో

# ఇంకా ఎన్నాళ్లీ కష్టాల 'సాగు'!

ఏడున్నర దశాబ్దకాలంలో స్వతంత్ర భారతదేశం ఎంతో అభివృద్ధి సాధించింది. పురోగాభివృద్ధివైపు అడుగులు వేస్తూనే ఉంది. డెబ్బైఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వతంత్ర భారతావనిలో ఎంతో ఘనంగా వజ్రోత్సవాలు జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా రాబోయే ఇరవై ఐదేళ్ల కాలం ఎంతో ప్రధానమైనది. వంద సంవత్సరాలు పూర్తి చేసుకోబోతున్నాం. ప్రజల ఆశల సాకారం లక్ష్యంగా పనిచేయాలి. ఇది అమృతోత్సవకాలం. సంపూర్ణ అభివృద్ధే మనముందున్న అదిపెద్ద సవాల్ అంటూ ప్రాధాన్యతల గూర్చి ప్రధానమంత్రి నరేంద్రమోడీ సోమవారం ఎర్రకోట నుంచి జాతిని ఉద్దేశిస్తూ ప్రసంగించారు. దేశంలోనిరాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా తమతమ ప్రాధాన్యతలు, ప్రణాళికల గూర్చి ఈ సందర్భంగా వివరించారు. వాస్తవంగా చూసినా, ఈ ఏడున్నర దశాబ్దంలో దాదాపు అన్నిరంగాల్లోనూ గణనీయమైన అభివృద్ధిసాధించాం. పురోగాభివృద్ధి వైపు నిరంతర అన్వేషణ జరుగుతూనే ఉన్నది. కార్యాచరణ అమలుకు కృషి చేస్తూనే ఉన్నాం. అయితే కొన్ని రంగాలు మాత్రం ఆశించిన మేరకు లక్ష్యాలను సాధించలేకపోయాయి. అందులో ఒకటి ప్రధానమైంది వ్యవసాయ రంగం. ఆ రంగానికి ఏమీ చేయడం లేదని చెప్పడం లేదు. ఏడున్నర దశాబ్దకాలంలో అన్నదాతల అభివృద్ధికి లక్షలాదికోట్లు ఖర్చుపెట్టారు, పెడుతూనే ఉన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రధానమంత్రిహామీ ఇచ్చారు. ఆదాయం సంగతి దేవుడెరుగు వ్యయం మాత్రం రెట్టింపు అయి వ్యవసాయం మరింత కుదేలవుతున్నది. భారతదేశంలో ఇప్పటికీ అధిక శాతం జనాభా వ్యవసాయం, దాని అనుబంధ పరిశ్రమలపై వ్యవసాయం మీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారనేది నిర్వివాదం. ప్రధానమంత్రి అన్నట్లు సంపూర్ణ అభివృద్ధి సాధించాలంటే వ్యవసాయరంగానికి ప్రాధాన్యత ఇవ్వకుండా అది సాధ్యంకాదు. ఇన్నేళ్లకాలంలో ఆ వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి చేసిన ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. రైతుల జీవన విధానంలో ఆశించిన మార్పు రావడం లేదు. ఎవరెన్ని మాట్లాడినా, ఎంత చేశామని చెప్పుకుంటున్నా రైతుల పరిస్థితి నానాటికీ దిగజారిపోతున్నది. కారకులు ఎవరైనా, కారణాలు ఏమైనా రైతులు ఎంతోకాలంగా బలైపోతున్నారు. ఈ డెబ్బైఐదేళ్ల కాలంలో దేశవ్యాప్తంగా ఎన్ని లక్షలమంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారో, ఆ కుటుంబాల పరిస్థితి ఆలోచిస్తే ఆవేదన కలగక తప్పదు. 'నీ చేతన్ నా చేతన్ వరమడిగిన కుంతి చేత, వాసవ్ చేతన్.... అరయంగా కర్ణుడీల్గె ఆర్వురి చేతన్.' అన్నట్లు రైతుల ఈ దుస్థికి ఎంతోమంది, మరెన్నో విభాగాలతోపాటు ప్రకృతి చేస్తున్న విన్యాసాలు కూడా కారణాలవుతున్నాయి. వీటిని అధిగమించాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వాలు అంతోఇంతో చేయూతనిస్తున్నాయి. తోటి మానవులుగా ఎందరో వ్యక్తులు ఎన్నో స్వచ్ఛంద సంస్థలు చేతనైనా సహాయం చేస్తున్నాయి. కానీ వరదల్లో సర్వం కోల్పోయినవారు ఈ సహాయాలు ఎన్ని అయినా తాత్కాలిక ఉపశమనమే తప్ప వారిని నష్టాల ఊబినుండి బయటకు తీసుకురాలేం. ఇలాంటి ఉపద్రవాలు వచ్చినప్పుడు పాలకులు వాగ్దానాలకు కరవు ఉండదు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగాఉంది. జూన్ నెల మధ్యలో ఆరంభమైన ముసుర్లు, వానలు, కుంభవృష్టిలు ఇంకా వదిలిపెట్టడం లేదు. కుంటలు, చెరువులు అన్నీ నిండిపోయాయి. కృష్ణా,గోదావరి, వాటి ఉపనదులు పొంగిపొర్లుతున్నాయి. కృష్ణాపరివాహక ప్రాంతంలో ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల అన్నీ ప్రాజెక్టులు దాదాపుపూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకు న్నాయి. దాదాపు రెండులక్షల ఎనభైవేల క్యూసెక్కుల నీరు పులిచింతల నుండి ప్రకాశం బ్యారేజ్ ద్వారా సముద్రం పాలవుతున్నది. ఇక గోదావరి పరివాహక ప్రాంతంలో ప్రధానంగా భద్రాచలం వద్ద గోదావరి పొంగి పొర్లుతున్నది. కరకట్టలు దాటుకొని గ్రామాలకుగ్రామాలనే ముంచివేసింది. ఈ సీజన్‌లోనే రెండుసార్లు గోదావరి పొంగి పొర్లడంతో దానిపరివాహక ప్రాంతాల్లోని గ్రామాలపరిస్థితి దారుణంగా ఉంది. ఇప్పటికీ అనేక గ్రామాలు నీళ్లలోనే మునిగితేలుతున్నాయి. ఆ గ్రామాల ప్రజలు ఎత్తు ప్రదేశాలకు వెళ్లి భయభయంగా ప్రాణాలను కాపాడుకుంటున్నారు. ఈ వర్షాలు ఇంకా తగ్గే అవకాశాలు లేవని, మరో నాలుగైదురోజుల పాటు భారీవర్షాలు ఉండవచ్చునని వాతావరణ శాఖ అంచనాలతో వారు ఆందోళన చెందుతున్నారు. అంతేకాదు వర్షాకాలం మరో మూడు నెలలు ఉంది. ఇక ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో మెట్ట పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈసారి తెలంగాణలో వరికిప్రత్యామ్నాయంగా పత్తి, మొక్క జొన్న, మిర్చి లాంటి పంటలు పెద్దఎత్తున సాగు చేశారు. వరితోపాటు పత్తి లాంటి వాణిజ్యపంటలు నీటమునిగిపోయాయి. మళ్లీ సాగుచేసి విత్తనం వేయాలంటే తలకుమించిన భారంగా తయారైందని రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏంచేయాలో వారికి దిక్కుతోచడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా పశుగ్రాసం కొరత తీవ్రంగాఉంది. కేంద్రప్రభుత్వ బృందాలు, ప్రజాప్రతినిధులు ఎందరో ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. కానీ ఇప్పటివరకు వారికి అందిన సహాయం అంతంత మాత్రమే. ఇంకా ఎన్నాళ్లీ కష్టాలసాగు అంటూ అర్థాకలితో అల్లాడుతున్న అన్నదాతలు కూడా మనవారేనని గుర్తుంచుకోవాలి. ఇంతపెద్ద జనాభాకు కావలసిన ఆహారోత్పత్తులు వారి 'చెమట' పుణ్యమేననే విషయాన్ని విస్మరించరాదు. వజ్రోత్సవాలు సందర్భంగా నైనా వ్యవసాయరంగాన్ని సంక్షోభం నుంచి శాశ్వతంగా గట్టెక్కించేందుకు త్రికరణశుద్ధిగా ప్రయత్నాలు జరగాలి.

అధికారం నిలుపుకోలేనివారు వేరొకరిపై అధికారం చూపడం భావ్యంకాదు.



ఆస్కార్‌వైల్డ్

ఒక సమాజం దాని నైతిక విలువలు కోల్పోతే అది సర్వస్వం కోల్పోయినట్లే.



కె.స్టానిస్లావిస్కి

# ప్రజావాక్కు



## రోడ్ల నిర్మాణం చేపట్టాలి

**రహదారి** ప్రమాదాలలో మనదేశం ప్రపంచవ్యాప్తంగా 13వ స్థానంలో నిలిచి బోలెడంత అప్రతిష్ట మూటగట్టుకుంటోంది. ట్రాఫిక్ విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, రోజూ కొత్తవాహనాలు కూడా అదనంగా రోడ్లపైకి చేరి ట్రాఫిక్ కిక్కిరిసిపోతున్నా రోడ్ల నిర్మాణం, నిర్వహణలో మాత్రం ఏం మార్పు ఉండటం లేదు. రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు అభివృద్ధి చెందిన దేశాలైన అమెరికా, ఇటలీ, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఎన్నోవిస్తృత పరిశోధనలను చేపట్టి రహదారుల నిర్మాణంలో కొత్త పోకడలను అనుసరిస్తుంటే, మనదేశంలో మాత్రం పాతచింతకాయ పచ్చడిపద్ధతులనే పట్టుకొని వేలాడుతున్నాం. ప్రస్తుత ట్రాఫిక్ అవసరాలతోపాటు వచ్చే 20 సంవత్సరాలకు కావాల్సిన వసతులు అనుగుణంగా నిర్మాణాలను చేపట్టాల్సి ఉండగా మన దేశంలో రహదారుల నిర్మాణం ప్రస్తుత అవసరాలకు కూడా సరిపోకపోవడం దురదృష్టకరం. ప్రమాదాలలో తీవ్రంగా గాయపడిన వారికి కూడా అత్యవసర వైద్యం అందించడంలో ప్రభుత్వాల వైఫల్యం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. మనదేశంలో రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పటికైనా ప్రభుత్వాలు రోడ్లపై శ్రద్ధ పెట్టి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దాలి.

-సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఉదారంగా ఆదుకోవాలి

**గోదావరి** వరదలతో కోనసీమ రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు రుణాల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇప్పుడు మరల పంటలు వేసుకోవాలంటే రైతుల వద్ద చిల్లిగవ్వ లేదు. ప్రభుత్వంపై ప్రతి రైతుకు కనీసం ఎకరాకు పదివేల రూపాయలు పెట్టుబడి సహాయం అందించాలి. లేకుంటే రైతులు కాడి పారేసే దుస్థితి నెలకొంది. రైతులను సకాలంలో ఆదుకుంటేనే మనిషికి బుక్కెడు అన్నం దొరుకుతుంది. లేదంటే ఆకలిలో అలమటించాల్సిందే.

-గరిమెళ్లరామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

## వీరు నాయకులేంటి?

**సంక్షోభాలు,** కష్టాల కడలిలో పడి ఊగిసలాడుతున్న కాంగ్రెస్ పార్టీని వీడి చాలా మంది బిజెపి తీర్థం పుచ్చుకుంటున్నారు. తల్లి పాలుతాగి మాతృద్రోహానికి ఒడిగడుతున్నారు. తమ స్వార్థంకోసం ఏ ఎండకాగొడుగు పడుతున్నారు. ఆశలకు ప్రలోభాలకు లొంగకుండా ఎలాంటి పరిస్థితులనైనా నమ్ముకున్న వారిని అంటిపెట్టుకుని ఉన్నవారే నాయకులనిపించుకుంటారు.

-మిథునం, హైదరాబాద్

## పెరిగిన ఫోన్‌కాల్ దోపిడీలు

**ఒకప్పుడు** నేరుగా దొంగతనాలు, దోపిడీలు జరిగేవి. సాంకేతికత అభివృద్ధి చెందాక సైబర్ నేరాలు జరుగుతున్నాయి. ఇప్పుడు నేరుగా ఫోన్లో మాట్లాడుతూ సులువుగా దోపిడీ చేసేస్తున్నారు. ఫోన్‌చేసి మాయమాటలు చెప్పిడబ్బులు కాజేసే కేసులు ఇటీవలకాలంలో ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఈరకమైన కేసులు పోలీసులకు కూడా తలనొప్పి తెప్పిస్తున్నాయి. ఫోన్ చేసి నమ్మకంగా మాట్లాడి పరిచయాలు పెంచుకొని తర్వాత మోసగించడం చేస్తున్నారు. స్వయానా నగదుఅందచేసి తర్వాత లబోదిబో మనడం బాధితుల వంతు అవుతుంది. ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు, విద్యార్థులు కూడా ఈ రకమైన దోపిడీకి గురవుతున్నారు. కనుక అపరిచిత వ్యక్తులతో సంభాషించడం చేయరాదు. ఫోన్‌కాల్స్ విషయంలో అప్రమత్తంగా ఉంటూ అనుమానం కలిగితే పోలీసులకు తెలియచేయాలి. ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు కాలర్‌ట్యూన్‌లో చూసుకోవాలి. ఏ నెంబర్ పడితే ఆ నెంబర్ ఫోన్‌కాల్స్ వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలి.

-చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

## కులానికేం సంబంధం?

**అభ్యంతరకర,** అసహ్యకరమైన వీడియోతో దొరికిపోయిన పార్లమెంట్ సభ్యుడు గోరంట్ల మాధవ్ దిక్కుతోచక కమ్మ కులాన్ని నిందించడం సరికాదు. సమాజంలో కుల విద్వేషాలు రెచ్చగొట్టడం చట్ట వ్యతిరేకం. పార్లమెంట్ సభ్యుడై ఉండి ఇలా కుల భావజాలంతో మీడియా ముందుకు రావడంసిగ్గుచేటు. ఆయన గారికి ఏదైనా అవమానం జరిగినా, ఇబ్బంది కలిగినా చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. కానీ ఇలా వ్యర్థ ప్రేలాపనలతో ప్రజల మధ్య ద్వేషభావం పెంచడం ప్రతి ఒక్కరు ఖండించాలి. ఆయన చేసిన తప్పును ఆయన బంధుమిత్రులే అసహ్యించుకుంటున్నారు. కులాలను గొడవలోకి తీసుకురావొద్దు.

-కంభంపాటి కోటేశ్వరరావు, విశాఖపట్నం

## స్థానిక సంస్థలపై దృష్టి సారించాలి

**మునుగోడు** ఉపఎన్నికపై దృష్టిపెట్టిన అధికార ప్రతిపక్ష పార్టీలు మూడు సంవత్సరాల నుండి రాష్ట్రవ్యాప్తంగా అనివార్య కారణాల వల్ల ఖాళీలు ఏర్పడిన సర్పంచ్, జెడ్పిటిసి, ఎంపిటిసి, వార్డుమెంబర్ స్థానాలకు ఎన్నికలపై ఎందుకు దృష్టిపెట్టడం లేదు. అన్ని రాజకీయ పార్టీలకు స్థానిక సంస్థలపై చిన్నచూపు ఉంది అనడానికి ఇదే నిదర్శనం. మునుగోడు ఉప ఎన్నికలతోపాటే ఖాళీలు ఏర్పడిన స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

-బూర్గుపల్లి కృష్ణయాదవ్, జడ్చర్ల

**ఎడిట్ పేజీకి..** ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# పేదవాడి 'ఉచిత ముద్ద'ను లాగేస్తారా?

**సంక్షేమ సామాజిక భద్రతా పథకాలకి ఉచితాలు అనే పేరుపెట్టి వాటిని రద్దుచేయాలని వాదించడంకాదు ఆయా పథకాలలో ఉన్న లోటుపాట్లను సరిచేసి అవినీతికి, పక్షపాతానికి తావులేకుండా నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చర్యలు చేపట్టినప్పుడే వాస్తవిక ఫలితాలు రాబట్టగలం. పాలకులు చేసేతప్పులకి పేదలను శిక్షిస్తారా అనే ప్రశ్నఉదయిస్తుంది. పేదలకి భద్రత కల్పించే సంక్షేమ పథకాలకి ఉచితాలనే ముద్రవేసి రద్దుచేసే ఆలోచనచేయకుండా కిందివర్గాలను కాపాడాల్సినబాధ్యత ప్రభుత్వాలదే. దాశరధి కృష్ణమాచార్య ఆశించినట్లు కరువంటూ కాటకమంటూ కనిపించని కాలాలు వచ్చినప్పుడు ఉచితాలు అడిగేవారు, కావాలనే వారేఉండరు. అసమానతలు కొనసాగినంతకాలం బాధితులకు భద్రత కల్పించడమే సహజ సామాజిక న్యాయం. దానికి ప్రభుత్వాలు కట్టుబడి పని చేయాల్సిందే.**



డాక్టర్ తిరునహరి శేషు

ఎన్నికల సమయంలో ఓటర్లను ఆకర్షించడానికి రాజకీయపార్టీలు, ప్రభుత్వాలు ఇచ్చే హామీలు, ఉచితాల వలన దేశ, రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం పడి ఉచితాలు భారంగా మారుతున్నాయి కాబట్టి ఎన్నికలలో ఉచితంగా ఇస్తామనే హామీలు ఇవ్వకుండా పార్టీలను నియంత్రించడంతోపాటు పార్టీల గుర్తింపును, వాటి ఎన్నికల గుర్తుని రద్దు చేయాలని అశ్విని ఉపాధ్యాయ దాఖలు చేసిన పిల్ విచారించిన సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ ఎన్వీరమణ, కృష్ణమూరారి, హిమాకోహ్లీతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం నీతి ఆయోగ్, రిజర్వు బ్యాంకు, ఆర్థిక సంఘం లాంటి సంస్థలతో విపక్షాలతో సంప్రదింపులు జరిపి కేంద్ర ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలనిసూచన చేసింది. గతంలో కూడా అనేక సందర్భాలలో ప్రభుత్వాలు ఇస్తున్న ఉచితాలు రద్దు చేయాలి. ఉచితాలు ఆర్థిక వ్యవస్థలను సంక్షోభంలోకి నెడుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమైనాయి. ఉచితాల వలన ప్రభుత్వాలపై ఆర్థికభారం పడి ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి నెట్టబడతాయనే పిడివాదం, అసందర్భమైన, అనాలోచితమైన వాదనను ముందుకు తెస్తున్న వారు ఏవి ఉచితాలు వేటిని ఉచితాలుగా పరిగణించాలనే విషయంలో స్పష్టత ఇవ్వలేకపోతున్నారు. భారత పాలకులు అవలంబించిన ట్రికిల్ డౌన్ థియరీ వలన పేదరికం మొక్కై వంగనిది మానై వంగుతుందా అన్న చందంగా అంతకంతకు పెరిగిపోయిన పేదరికంతో మగ్గిపోతున్న వారిని ఆదుకోటానికి ప్రభుత్వాలు సామాజిక భద్రతా పథకాలు, పేదరిక నిర్మూలన, స్వయం ఉపాధి, ఉపాధి కల్పనా కార్యక్రమాలను ఐదవ ప్రణాళిక నుండి ప్రారంభించాయి. వీటి ద్వారానే దేశంలోని కింది వర్గాలకి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించబడుతుందనేది వాస్తవం. ఇందిరాగాంధీ గరీబీ హఠావో కార్యక్రమాలు, పేదలకు ఆహార భద్రత కోసం ఎన్టీరామారావు రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం, పేదల ఆరోగ్య సంరక్షణ కోసం వైయస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకం, రైతులకు ఉచిత విద్యుత్ పథకం, పేద పిల్లలను బడిబాట పట్టించడానికి జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి పథకం, సన్నచిన్నకారు రైతులకు పెట్టుబడి సహాయం కోసం కెసిఆర్ రైతుబంధు పథకం, కరోనా కష్టకాలంలో పనులు కోల్పోయి దిక్కుతోచని పేదలకి ఉచితంగా ఐదు కిలోల బియ్యం పంపిణీ చేయడానికి నరేంద్ర మోడీ ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నా యోజన పథకాలతోపాటు వృద్ధాప్యపు పెన్షన్లు, నిరుద్యోగ భృతి, ఫీజురీయింబర్స్‌మెంట్ లాంటి సామాజిక భద్రతా సంక్షేమ పథకాలకు ఉచితాలని ముద్రవేసి ఆర్థికభారంగా పరిగణించి రద్దు చేయాలనే వాదన సహేతుకమైనదేనా? పేద ప్రజల పక్షాన ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను ఉచితాలుగా భావిద్దామా? సామాజిక భద్రతను కల్పించే పథకాలుగా భావిద్దామా అనే విషయాన్ని తెలుసుకున్నప్పుడే సమాజంలో సమానత్వాన్ని ఐక్యతను ఆశించగలం. సంక్షేమ పథకాలను ఆర్థికకోణంలో కాకుండా భద్రత, సామాజిక న్యాయకోణంలో చూడాల్సిన బాధ్యతుందనేది గమనించాలి. ఉచితాలకు సరైన నిర్వచనం ఇవ్వకుండా ఉచితాలను రద్దు చేయాలనే వాదన సరైందికాదు. కొవిడ్ సంక్షోభ కాలంలో ఆత్మనిర్భర భారత అభియాన్‌లో భాగంగా పారిశ్రామికవేత్తలకి, కార్పొరేట్ సంస్థలకి ఇచ్చిన ఉద్దీపన ప్యాకేజీల కంటే పేదలకి ఉపాధి కోల్పోయిన వారికి చేసిన సహాయం తక్కువనే చెప్పాలి. పేదలకి



సామాజిక భద్రతా పథకాలు సంక్షేమ పథకాలు ప్రకటిస్తే ఆర్థిక భారం పడుతుందా రోజుకి వెయ్యికోట్ల రూపాయలు సంపాదించే ప్రపంచ కుబేరులలోనాలుగోస్థానంలో ఉన్న గౌతమ్ అదాని లాంటి పారిశ్రామిక కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తే అధికభారం పడదా, పేదలకి ఇచ్చేవి ఉచితాలైనప్పుడు పెట్టుబడి సంస్థలకు, కార్పొరేట్ సంస్థలకు ఇచ్చే వాటిని కూడా ఉచితాలుగానే భావిస్తారా ? పేదల కోసం అమలు చేసే సంక్షేమ పథకాలే ఉచితాలవుతాయా? కార్పొరేట్ సంస్థలకు ఇచ్చేవి ఉచితాలు కావా? ఉచితాలతోటే ఆర్థిక వ్యవస్థలు పతనం అవుతాయనే వాదనలో కూడా పస లేదు. ఎందుకంటే ఇప్పటివరకు ప్రపంచంలో ఉచితాలు ఇవ్వటం వలన పతనమైన ఆర్థిక వ్యవస్థ లేదు. ప్రభుత్వ నిర్ణయాలు సమర్థవంతంగా లేకపోవడం, పాలకుల అనాలోచిత నిర్ణయాలు, అవినీతి వలన పతనమైన దేశాలను చూశాం కానీ ఉచితాలతో పతనమైన ఆర్థిక వ్యవస్థలను ఎక్కడా చూడలేదు. శ్రీలంక పతనానికి సంక్షోభానికి కారణం ఆ దేశ పాలకుల అనాలోచిత నిర్ణయాలు, పర్యాటక, వ్యవసాయ, విదేశీ వ్యాపార రంగంలో సంక్షోభం, రష్యా, ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం, ఆ దేశం చేసిన అప్పులు అని గమనించాలి. శ్రీలంక పాలకులు ఉచితాలు ఇవ్వటానికి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడానికి అప్పులు చేయలేదనే విషయాన్ని కూడా గమనించాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాల నిర్వహణకే అప్పులు చేస్తున్నాయనే వాదన కూడా తప్పు. లక్షలకోట్ల రూపాయల అప్పులు చేస్తున్న ప్రభుత్వాలు పాలన నిర్వహణపై చేసే ఖర్చుకంటే సంక్షేమ కార్యక్రమాలపై చేసే ఖర్చు చాలా తక్కువనే చెప్పాలి. గడిచిన ఐదేళ్ల కాలంలో బ్యాంకులు 10 లక్షల కోట్ల రూపాయల మొండిబకాయిలను రద్దు చేశాయి. పారిశ్రామిక, పెట్టుబడిదారీ, కార్పొరేట్ రంగ సంస్థలు లక్షల కోట్లరూపాయల అవినీతికి పాల్పడుతున్నాయి. వేల కోట్ల రూపాయల పన్ను బకాయిలు ఎగవేతకు పాల్పడుతున్నాయి. ఇవి అన్ని ఆర్థికభారం కానప్పుడు సంక్షేమ కార్యక్రమాలపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చుని భారంగా ఎలా భావిస్తారు. వాటిని ఉచితాలుగా ప్రకటించి రద్దుచేయాలనే వాదనను తీసుకురావడం అంటే దేశంలోని పేదలపై విషం కక్కటమే అవుతుంది. అమెరికా చైనాల తర్వాత అత్యంత ఎక్కువ కుబేరులు ఉన్న మూడవ దేశం భారతదేశమే అయినప్పుడు సంక్షేమ పథకాలు అమలు చేయడం భారం ఎలా అవుతుంది. పేదరికం, నిరుద్యోగం, అసమానతలు ఉన్నంత కాలం పేదలను కిందివర్గాలను ఆదుకోవడానికి సంక్షేమ, సామాజిక, భద్రతా కార్యక్రమాలు కొనసాగించాల్సిందే. ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రమాదకరం కాదు. ఎన్నికలలో ఓట్లు సంపాదించడానికి ఓటర్లకి పంచే డబ్బు ప్రమాదకరం. రాజకీయాలలో, పాలనలో, వ్యాపారంలో వివిధ స్థాయిలలో పెద్దఎత్తున జరుగుతున్న అవినీతి దేశ ఆర్థికవ్యవస్థకు గొడ్డలిపెట్టు. వాటిని నియంత్రించడానికి చట్టాలు, వ్యవస్థలు ముందుకురావాలి. కానీ పేదలకి సామాజిక, ఆర్థిక, భద్రత కల్పించడానికి తీసుకువచ్చిన పథకాలను ఉచితాలుగా పేర్కొంటూ అది ఆర్థికవ్యవస్థపై భారం ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నాయి. కాబట్టి వాటిని రద్దు చేయాలని వాదించడం సహేతుకం కాదు. ప్రభుత్వాల, పాలకుల, పార్టీల ఆలోచన దృక్పథం కూడా మారాలి. ఏదైనా ఒకసంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టేటప్పుడు అది ఓటర్లను ఆకర్షించేవిధంగా కాకుండా కింది వర్గాల సాధికారతను సాధించే మహత్తరమైన లక్ష్యంతో రూపొందించాలి. అప్పుడే ఆయా సంక్షేమ పథకాలు వాస్తవ ఫలితాలను ప్రతిబింబిస్తాయి. సంక్షేమ సామాజిక భద్రతా పథకాలకి ఉచితాలు అనే పేరు పెట్టి వాటిని రద్దుచేయాలని వాదించడం కాదు ఆయా పథకాలలో ఉన్న లోటుపాట్లను సరిచేసి అవినీతికి, పక్షపాతానికి తావులేకుండా నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చర్యలు చేపట్టినప్పుడే వాస్తవిక ఫలితాలు రాబట్టగలం. పాలకులు చేసేతప్పులకి పేదలను శిక్షిస్తారా అనే ప్రశ్నఉదయిస్తుంది. పేదలకి భద్రత కల్పించే సంక్షేమ పథకాలకి ఉచితాలనే ముద్ర వేసి రద్దు చేసే ఆలోచన చేయకుండా కిందివర్గాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. దాశరధి కృష్ణమాచార్య ఆశించినట్లు కరువంటూ కాటకమంటూ కనిపించని కాలాలు వచ్చినప్పుడు ఉచితాలు అడిగే వారు, కావాలనే వారే ఉండరు. అసమానతలు కొనసాగినంత కాలం బాధితులకు భద్రత కల్పించడమే సహజ సామాజిక న్యాయం. దానికి ప్రభుత్వాలు కట్టుబడి పని చేయాల్సిందే. ●

# చైతన్యం పొందిన అఫ్ఘానిస్థాన్ మహిళలు


**కనుమ ఎల్లారెడ్డి**

విశ్వంలో అఫ్ఘానిస్థాన్ మహిళలు ఏ పనిచేయక కొన్ని కట్టుబాట్లుకు లోనుకావడం దురదృష్టకరం. అయితే ఆ కట్టుబాట్లు తెంచుకొని బహిరంగంగా ఉద్యమించడం శుభపరిణామం. అఫ్ఘానిస్థాన్‌లో మహిళల పరిస్థితి కడుదుర్భరం. ముఖ్యంగా తాలిబన్లు మహిళలపై ఉక్కుపాదం మోపారు. వారు చదువుకోకూడదు. ఒంటరిగా తిరగరాదు. పూర్తిగా శరీరం కప్పుకోవాలి. ఇలా కొన్నిఆంక్షలు వారిపైఉన్నాయి. ఇది వారి హుకుం. దీనికి అఫ్ఘానిస్థాన్ మహిళల్లో తీవ్ర నిరసన మొదలయింది. అందరి మహిళలు లాగే తాము చదువుకొని, ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలకు అండగా ఉండాలని, తమ కుటుంబాలను పోషించుకోవడానికి మేము కూడా మమేకం అవుతామని, ఇక తాలిబన్ల చర్యలు సహించమని మహిళలు నినదించారు. ఎన్నో రంగాల్లో మహిళలు ముందడుగు వేస్తుంటే తాలిబన్ల పాలనలో అఫ్ఘానిస్థాన్ మహిళలు తిరోగమన స్థాయిలో పయనిస్తున్నారు. అందుకే అఫ్ఘానిస్థాన్ మహిళలు కట్టుబాట్లు తెంపుకొని ఉద్యమిస్తున్నారు. అఫ్ఘానిస్థాన్‌ను తాలిబన్లు హస్తగతం చేసుకున్నప్పటి నుంచి అక్కడ మహిళలు అణచివేయబడ్డారు. గత ఏడాది ఆగస్టు 15న తాలిబన్లు అధికారం చేపట్టినప్పటి నుంచి అఫ్ఘాన్‌లో అమెరికా జోక్యం చేసుకొన్న దాదాపు రెండు దశాబ్దాల కాలంలో మహిళల హక్కులు కాలరాశారు. వారు ఎక్కడా పని చేయకూడదని, వారి అభివృద్ధిని అణగదొక్కుతున్నారని అంతర్జాతీయసంస్థలు ఆరోపించాయి. పొరుగు దేశాలు, మిగతా దేశాలు అన్ని రంగాలలో చురుకుగా పాల్గొంటూ దూసుకుపోతుంటే అఫ్ఘాన్ మహిళలు మేము కూడా దేశ ఔన్నత్యానికి పాటుపడతాం, మేము క్రీడలలో, వివిధ ప్రక్రియలలో పాల్గొంటాం, మా హక్కులు, మా స్వేచ్ఛ మాకు ఇవ్వండి, నిరంకుశంగా ప్రవర్తించకండి అని అఫ్ఘాన్ మహిళలు ప్రభుత్వాన్ని నిలదీశారు. దాదాపు నలభై మందికి పైగా మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి నినందించారు. అయిన అఫ్ఘాన్ ప్రభుత్వం, తాలిబన్లు చీఫ్ అయిన హిబతుల్లా స్పందించలేదు. వీటికి దూరంగా ఉండాల్సిందే అని వితండ వాదం చేశారు. వీరి ఉద్యమం చెదరగొట్టుటకు తాలిబన్లు, మహిళలపై చేయి చేసుకున్నారు. దానికి మహిళలు ఆగస్టు 15 'బ్లాక్ డే' అనే బ్యానర్ పట్టుకుని మీ అజ్ఞానం, మూర్ఖత్వంతో విసిగి వేసారిపోయాం. మాకు స్వేచ్ఛ కావాలి. న్యాయం కావాలిఅంటూ ఓ సమూహంగా ఏర్పడి ర్యాలీచేపట్టారు. అయినా తాలి బన్లలో చైతన్యంలేదు. మహిళలపై దాడులకు దిగారు. అయినా అఫ్ఘాన్ మహిళలు వెరవక ముందుకు సాగారు. వీరిలో చాలామంది మహిళలు ముఖానికి ముసుగులు ధరించలేదు. తాలిబన్ల చర్యతో మహిళలకు ఎన్నో ఇక్కట్లు మొదలైనాయి. దాదాపు పది వేలకు పైగా సెకండరీ విద్యకు దూరమయ్యారు. వారు పాఠశాలలకు రాకుండా అడ్డుకున్నారు. అందునిమిత్తమే మహిళలు కూడా తాము చేస్తున్న ఉద్యోగాలు వదిలిపెట్టారు. ఇలా మహిళలను తాలిబన్లు తీవ్రంగా అడ్డుకుని, వారిప్రగతి, పురోగతి, చైతన్యం గ్రహించకవారిపై హింసాత్మక దాడికి దిగటం మూర్ఖమైన చర్య. తాలిబన్ల చర్యలు మహిళా ప్రగతికి ఆటంకం, దీనివల్ల అభివృద్ధి కుంటుపడుతుంది. దేశాలు సహకరించవు అప్పుడు అఫ్ఘాన్ ఒంటరై తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడాలి. కనుక తాలిబన్లు ఇప్పటికైనా కళ్లుతెరచి మహిళలకు స్వేచ్ఛ కల్పించి, వారి హక్కులు కాపాడతారని, తద్వారా అఫ్ఘాన్ మహిళలు ఏదేశానికి తీసిపోకుండా అన్ని రంగాలలో ప్రగతిని సాధిస్తారు. ●

# అభ్యసన సాధనకు పూర్వ ప్రాథమిక విద్యే పునాది!

**మల్లాడి శ్రీనగేష్**

విద్యకు, విద్యార్థికి ప్రాథమిక విద్యయే పునాది. పునాది లేని చదువులవల్ల పై తరగతులలో విద్యార్థులు తరగతి లేదా వయసువారీ అభ్యసనా సామర్థ్యాలను సాధించలేరనేది నిర్వివాదాంశం. కొవిడ్ వలన బడులు మూతపడడం లేదా పిల్లలు పాఠశాలలకు దూరం కావడం వల్లనేకాదు, కరోనా ముందు కూడా విద్యార్థుల విద్యాసామర్థ్యాల గురించి ఎన్నో కథనాలు వచ్చాయి. అసరు నివేదిక, రాష్ట్రస్థాయి, నాస్ వంటిజాతీయ అధ్యయనాలు పిల్లల అభ్యసనాస్థాయి పెరగాలని అందుకు పాఠశాల యాజమాన్యాలు స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు సాగాలని హెచ్చరికలు చేస్తూనే ఉన్నాయి. ఉపాధ్యాయుల శిక్షణ, కొత్త బోధనావ్యూహాలు తగిన ప్రణాళికల అవశ్యకతను నిపుణులు సూచిస్తూనే ఉన్నారు. ఈ పరిస్థితులను చక్కదిద్దేలోపు కరోనా లాంటి ఉపద్రవం విద్యార్థులకు మరిత భారాన్ని చేర్చింది. ఆన్‌లైన్ విద్య అందుబాటులోకి వచ్చినప్పటికీ సుమారు 60 శాతం మంది విద్యార్థులకు అందని ద్రాక్షలా పరిణమించింది. దీనికితోడు ఒకేసారి బడులు తెరిచేనాటికి పిల్లలు బడిమానేయడం, బడిపట్ల విముఖత వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ఎన్నో అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. దానికి తోడు రెండు సంవత్సరాలు బడులు తెరవలేదు గనుక పిల్లల అభ్యసనను అనుకున్న స్థాయిలో పునరుద్ధరించడానికి ముందస్తు ప్రణాళికలు లేకపోవడం, దానికి కావలసిన నిధులు, సిబ్బంది, ప్రత్యేక శిక్షణ కూడా కొరవడటం వలన అభ్యసనాల అంతరం పెరిగిందని చెప్పకతప్పదు. ప్రణాళికాబద్ధమైన పఠన కొరవడితే కోల్పోయిన సామర్థ్యాలను తిరిగి పొందడం పిల్లలకు కష్టతరం. ఉపాధ్యాయులకు ఒక పెద్ద సవాలు కూడా. అంతేకాదు ఆర్థికస్థోమత లేని కుటుంబాలు, నిరక్షరాస్యతలో ఉన్న కుటుంబాల పిల్లలు ఇటు చదువు రాక, ఉత్తీర్ణత పొందిన తరగతికి సరితూగక తీరని మానసిక ఒత్తిడితో పాఠశాల, చదువు పట్ల భయం, నిర్లక్ష్యం దానికితోడు పరుగులు పెట్టించే అకడమిక్ కాలెండర్ వంటి అంశాలు ఆతృతను కలిగించాయే తప్ప పిల్లలకు ప్రశాంతతను అందించలేకపోయాయి. అభ్యసన అంచెలంచెలుగా ఆకళింపు చేసుకునేలా జరగాలి తప్ప బట్టీ విధానంతో మార్కులే ప్రామాణికంగా చదివితే విద్యార్థికి ఎంతమాత్రం పరిణతి లభించదు. అందుకే నూతన విద్యావిధానం విద్యార్థులకు పటిష్ట పునాది దిశగా పూర్వ ప్రాథమిక విద్య ప్రాధాన్యతను చాటిచెప్పింది. ఎందుకనగా ఐదు సంవత్సరాలు పూర్తి అయిన బాలలు ఎటువంటి పునాది లేకుండా 1వ తరగతిలో ప్రవేశించడం వలన ఇప్పుడున్న విద్యాసరళి సరితూగడం, తద్వారా తరగతి వారీ సామర్థ్యాలను సులభంగా సాధించడం ఎంతో జటిలమని ఎంతో మంది నిపుణులు ఎన్నడో విశదీకరించారు. నిజానికి శిశు విద్యకు వెచ్చించే నిధుల వల్ల బహుళ ప్రయోజనాలు కలుగుతాయని, దీనివల్ల బాలల అభ్యసనలో పటిష్టమైన పునాది ఏర్పడుతుందని తద్వారా బాలలు 1వ తరగతిలో ప్రవేశించే నాటికి పాఠశాలకు సమాయత్తం మాత్రమే కాదు అభ్యసనలో కూడా ముందుంటారనేది ప్రధాన నమ్మకం. ఎందుకంటే 90 శాతం మానసిక పరివర్తన



బాలల్లో ఐదు సంవత్సరాల వయసులోపు ఎక్కువ జరుగుతుందని అనేక అధ్యయనాలు కూడా తెలియపరిచాయి. బాలలకు బాల్య దశలోనే ఒక సుస్థిరమైన అభ్యసనా పునాదిని వేయడానికితద్వారా ప్రాథమిక దశలో ఇప్పుడు ఎదుర్కొంటున్న అభ్యసనాపరమైన సమస్యలు రాకుండా ఆది నుండి ఒక ప్రణాళికబద్ధమైన ప్రక్రియతో విద్యార్థి విద్యాసామర్థ్యాలు సాధించడానికి పూర్వ ప్రాథమిక విద్య ఒక ప్రధాన భూమికయని నొక్కి వక్కాణించింది. ఏది ఏమైనా ఈ విద్యావిధానంలో పూర్వ ప్రాథమిక విద్యకు ఒక ప్రధాన భూమికి ద్వారా ఐదు సంవత్సరాలు ఫౌండేషన్ కోర్సును ప్రవేశపెట్టింది. అనగా వయసు 3-8 వరకు ఉన్నపిల్లలు మూడు సంవత్సరాల శిశువిద్యతో 1వ తరగతి, 2వ తరగతులను శిశువిద్యతో జోడించింది. అనగా ఈ విద్యాస్థాయిని ఒక ప్రత్యేక పూర్వ ప్రాథమిక స్థాయి విద్య కేంద్రంగా పరిగణించి పాఠశాల విద్యాశాఖతో పూర్వ ప్రాథమిక విద్యాభ్యాస బాధ్యతను అనుసంధానం చేసింది. దీని ద్వారా ప్రతి విద్యార్థికి పూర్వ ప్రాథమిక విద్య సమపాళ్లలో లభిస్తే ప్రాథమిక పాఠశాల స్థాయి చేరేసరికి తరగతి, వయసు వారీ సామర్థ్యాలను సాధించడం సులభం. అంతేకాదు ఆర్థికస్థోమత లేని కుటుంబాలు పూర్వ ప్రాథమిక విద్యావసతిని తమ పిల్లలకు కల్పించలేకోవడం వలన సబ్జెక్టువారీ సామర్థ్యాల్లో వెనుకంజ వేయడం తద్వారా బడిపట్ల ఆసక్తి లేకపోవడం, బడిమానేయడం వంటి ప్రమాదాలు ఉన్నాయి అనేది నిర్వివాదాంశం. ఇవన్నీ పరిగణనలోనికి తీసుకొని నూతన విద్యావిధానం సాంకేతిక విద్య, మాతృభాషలో విద్యవంటి సూక్ష్మ అంశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నది. విద్యార్థులు నిపుణుల అంచనాల మేర సమగ్రాభివృద్ధిని సాధించాలంటే పాఠశాల విద్యాశాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కలసి సమన్వయంతో బాలల సమగ్రాభివృద్ధికి కృషిచేయాలి. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడం ద్వారా ప్రాథమిక విద్యలో ఎదురవుతున్న అభ్యసనా సామర్థ్యాల సమస్య ఎగువ తరగతులకు వెళ్లేకొలది వయసు, తరగతివారీ విద్యాసామర్థ్యాలను సాధించడం అనేది పూర్వ ప్రాథమిక విద్య ప్రధాన భూమికయని ప్రభుత్వం, తల్లిదండ్రులు బోధనా సిబ్బంది గ్రహించి తగు ప్రణాళికలను రూపొందించాలి. అప్పుడే నూతన విద్యావిధానంలో పూర్వ ప్రాథమిక విద్య అనగా ఐదు సంవత్సరాల ఫౌండేషన్ కోర్సు ఫలితం విద్యార్థి ప్రగతి ప్రత్యక్షంగా కనిపిస్తుంది. దీనికి తల్లిదండ్రులు, సమాజం, పాఠశాల యాజమాన్య కమిటీలు తమ వంతు భాగస్వామ్యాన్ని తప్పక కనబరచాలి. తమ పిల్లలు అనుకున్న స్థాయిలో చదువుతున్నారా, క్రమం తప్పక పాఠశాలకు వెళుతున్నారా అనే పర్యవేక్షణతోబాటు మానసిక ఒత్తిడి లేని వాతావరణాన్ని కల్పించాలి. ఆటలు, పాటలు, డ్రాయింగ్, పెయింటింగ్, కథలు వినడం, రచించడం, లైబ్రరీ, పుస్తక పఠనం, రీడింగ్, తోటి విద్యార్థులతో కలిసిమెలసి మెలగడం, నూతన విషయాల వైపు దృష్టి సారించడం వంటి జీవన నైపుణ్యాల తర్ఫీదు కూడా ప్రతి పాఠశాలలో జరగాలి. ప్రతి విద్యార్థికి మౌలిక భాష, గణిత శాస్త్ర నైపుణ్యాలు చిన్నప్పటి నుంచి అనగా మూడు సంవత్సరాల నుండి చిన్న పిల్లల్లో పునాదిగా ఉండేలా తల్లిదండ్రులు విద్యావ్యవస్థ సంసిద్ధంగా ఉండాలి. దీనివలన పాఠశాల ప్రవేశానికి సంసిద్ధత, ప్రాథమిక స్థాయి నుండి అభ్యసనలో ముందంజలో ఉండడం తద్వారా విద్యార్థులు తాను కొనసాగించాల్సిన ప్రయాణాన్ని తమకు తామే నిర్ణయించుకునే స్వతంత్రతను పొందుతారు. జీవన నైపుణ్యాలతో విజేయులై నిలుస్తారు. ●

# ప్రపంచంలో 60 కోట్లకు చేరువవుతున్న కరోనా కేసులు

**64.55 లక్షలకు చేరుకున్న మృతులు**

**జెనీవా, ఆగస్టు 15:** ప్రపంచదేశాల్లో కరోనా వ్యాప్తి పెరుగుతోంది. వైరస్ మహమ్మారిలా విస్తరిస్తున్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థసైతం గుర్తించింది. ప్రతి పదిలక్షల జనాభాలో 76,387 మందికి కరోనాసోకుతుంటే వారిలో 828 మంది చనిపోతున్నారు. గడచిన ఒక్కరోజులోనే 3.26 లక్షలమందికి కరోనాసోకింది. ప్రపంచదేశాల్లో సోమవారం నాటికి 59.54 కోట్లమందికి కరోనాసోకి వారిలో 64.55 లక్షలమంది చనిపోయారు. మరో 45,624 మంది పరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 56.84 కోట్లకుపైగా నమోదుకాగా మరో 2.01 కోట్లమందివరకూ ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. యూరోప్ దేశాల్లో మొత్తం 21.86 కోట్లమందికి కరోనాసోకి 18.89 లక్షలమంది చనిపోయారు. మరో 9433 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 21.10 కోట్లకుపైగా నమోదయ్యాయి. మరో 57.45 లక్షలమంది ఇప్పటికీ ఆందోళనగా ఉంది.ఉత్తర అమెరికా దేశాల్లో మొత్తం 11.24 కోట్లమందికి కరోనాసోకి వారిలో 15.13 లక్షలమంది చనిపోయారు. మరో 9791 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 10.56 కోట్లకుపైగా నమోదుకాగా మరో 53.18 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో పోరాటంచేస్తున్నారు. ఆసియాదేశాల్లో మొత్తం 17.68 కోట్లకుపైగా కరోనా కేసులుంటే వారిలో 14.55 లక్షలమంది చనిపోయారు. మరో 14,693 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 16.81కోట్లకుపైగా ఉన్నాయి. మరో 72.46 లక్షలమంది ఇప్పటికీ ఆందోళనకరంగా ఉన్నట్లు తేలింది. దక్షిణ అమెరికా దేశాల్లో మొత్తం 6.30 కోట్లమందికి కరోనాసోకి 13.20 లక్షలమంది చనిపోయారు. మరో 10,576 మందిపరిస్థితి ఆందోళనగా ఉంది. రికవరీలు 6.06 కోట్లకుపైబడ్డాయి. మరో 10.71 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో సతమతం అవుతున్నారు. ఆఫ్రికా దేశాల్లో మొత్తం 1.25 కోట్లకుపైగా కరోనా కేసులునమోదుకాగా వారిలో 2,57,121 మందిచనిపోయారు. రికవరీలు 1.19 కోట్లకుపైగా నమోదుకాగా మరో 4,06,458 మంది ఇప్పటికీ ఐసియుల్లోనే కొనసాగుతున్నారు. ఇక 19 ద్వీపకల్పదేశాలపరంగాచూస్తే మొత్తం 1.18 కోట్లకుపైగా కేసులునమోదయ్యాయి. వారిలో 18,153 మంది చనిపోయారు. రికవరీలు 1.15 కోట్లవరక ఉన్నాయి. మరో 3.40 లక్షలమంది ఇప్పటికీ వైరస్‌తో పోరాడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థకు నివేదికలందాయి.



## 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

**ఐదు ప్రతిజ్ఞలు చెయ్యాలన్న ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** భారతదేశం 75యేళ్ల స్వాతంత్ర్య వేడుకలను జరుపుకుంటున్న 15 ఆగస్టు చారిత్రాత్మక ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించిన తర్వాత జాతిని ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని నరేంద్ర మోడీ, 2047నాటికి భారత దేశం కోసం స్వాతంత్ర్య సమరయోధుల కలలను నెరవేర్చేందుకు పౌరులు తీసుకోవాల్సిన ఐదు ప్రతిజ్ఞలను జాబితా చేశారు. ప్రధాని మోడీ పేర్కొన్న ముఖ్యమైన 5 ప్రతిజ్ఞలు పాటిస్తే వచ్చే 25 యేళ్లలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. ప్రస్తుతం 76వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే 25 యేళ్లలో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా మారాలని ఆకాంక్షించారు. తాను యువతను రాబోయే 25 సంవత్సరాల జీవితాన్ని దేశాభివృద్ధికి అంకితం చేయాలని కోరుతున్నానని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 2047 సంవత్సరం నాటికి భారతదేశ అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలని యువత ప్రతిజ్ఞ చేయాలన్నారు. భారతదేశ పౌరులు మానవాళి అభివృద్ధికి కృషి చేస్తారని ప్రధాని మోడీ అన్నారు. అలాగే మనం ఇతరులలాగా మారడానికి ప్రయత్నించకూడదు, మన ఆలోచనలో బానిసత్వం యొక్క జాడ ఉండకూడదని ప్రధాని మోడీ పేర్కొన్నారు. కొన్నిసార్లు మన ప్రతిభకు భాషా అవరోధాలు అడ్డుగా ఉంటాయని, మన దేశంలోని ప్రతి భాష గురించి గర్వపడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మనం ప్రపంచం నుంచి ధృవీకరణను కోరుకోకూడదని పేర్కొన్న మోడీ, గర్వించదగిన దేశంగా మన గుర్తింపును కాపాడుకోవాలని తెలిపారు. ఇక మన వారసత్వం గురించి మనం గర్వపడాలి. మన మూలాలకు మనం కనెక్ట్ అయినప్పుడు మాత్రమే మనం ఎత్తుకు ఎగరగలమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. మన వారసత్వ సంపదను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మనం ఎత్తుకు ఎదిగినప్పుడే మొత్తం ప్రపంచానికి పరిష్కారాలను అందిస్తాము అని ప్రధాన మంత్రి అన్నారు. సజాతి అభ్యున్నతికి పాటుపడేందుకు మనం ప్రజలుగా ఐక్యంగా ఉండాలని నాల్గవ ప్రతిజ్ఞ చేయాలన్నారు. భారతదేశ ప్రగతికి సమానత్వం మూలస్తంభం అని మోడీ పేర్కొన్నారు. భారతదేశమే మొదటి ప్రాధాన్యతగా మనం ఐక్యంగా ఉన్నామని నిర్ధారించుకోవాలని ప్రధాని మోడీ అన్నారు. మహిళలకు సమానత్వాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ప్రజల మధ్య సమానత్వం అవసరమని కూడా ఆయన అన్నారు. భారత దేశ వృద్ధికి మహిళల పట్ల గౌరవం ఒక ముఖ్యమైన మూలస్తంభమని, మన 'నారీ శక్తి'కి మనం మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఆడ, మగ ఇద్దరినీ సమానంగా చూడాల్సిన అవసరం ఉందని ప్రధాని నరేంద్రమోడీ గుర్తుచేశారు. వేధింపుల నుంచి మహిళలు బయటపడేలా సంకల్పం తీసుకోవాలని ప్రధాని నరేంద్రమోడీ కోరారు. ఐదవ ప్రతిజ్ఞపౌరుల కర్తవ్యంగా పేర్కొన్నారు ప్రధాని మోడీ, విద్యుత్తు, నీటిని పొదుపు చేయడం ప్రజల కర్తవ్యం అని ప్రధాని నరేంద్ర మోడీ వెల్ల డించారు. దీనిని అనుసరిస్తే, మనం అనుకున్న ఫలితాలను ముందుగానే చేరుకోగలమన్నారు.

## మోడీపై సోనియా గాంధీ ఫైర్

న్యూఢిల్లీ, ఆగస్టు 15: జాతిపిత మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, మౌలానా అబుల్‌కలామ్ ఆజాద్ లాంటి మహోన్నత నేతలను కించపరచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ మండిపడ్డారు. రాజకీయంగా తమకు ఉపయోపడుతుందనే ఉద్దేశంతో వీరిపై చేస్తున్న ప్రచారాన్ని ఇకనైనా ఆపాలని కోరారు. దేశ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె ప్రజలకు శుభాకాంక్షలు తెలియచేశారు. 75 సంవత్సరాలుగా భారత బలగాలు దేశానికి చేసిన త్యాగాలను తక్కువ చేసి చూపించేందుకు కేంద్రం ప్రయత్నాస్తోందని, రాజకీయ ప్రయోజనాల కోసం చారిత్రక వాస్తవాలను తప్పుగా చిత్రీకరిస్తోందని, అటువంటి వాటిని కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోబోదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ అనుసరిస్తోన్న ఫాసిస్టు ధోరణిని తీవ్రంగా తప్పుపట్టారు. కర్ణాటకలో బిజెపి హర్ ఘర్ తిరంగాలో భాగంగా నెహ్రూ ఫొటోను తొలగించడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశంలో గతం సాధించిన విజయాలను కేంద్రం చిన్నచూపు చూస్తోందని, వాటిని అణగదొక్కుతోందన్నారు. 75 సంవత్సరాలుగా అత్యంత ప్రతిభావంతులైన భారతీయులు అన్ని రంగాలలో దేశాన్ని ప్రగతి పథంలో ముందుకు నడిపించారని, స్వేచ్ఛ, న్యాయమైన, పారదర్శక ఎన్నికల వ్యవస్థకు మహానుభావులు పునాదులు వేశారని, ఇప్పుడు ఆ పునాదులను కూకటివేళ్లతో సహా పెకిలించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.




## అహింసావాదంతో సత్తాను చాటి చెప్పిన కాంగ్రెస్: రాహుల్

**కాంగ్రెస్ ఆఫీసునుంచి మహాత్మాగాంధీ స్మృతివనం వరకు 'ఆజాది గౌరవ్ యాత్ర'**

**న్యూఢిల్లీ, ఆగస్టు15:** భారత్ 75 ఏళ్ల క్రితం అహింసా సిద్ధాంతాన్ని అనుసరించి తన సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఆ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ త్యాగధనులైన స్వాతంత్ర్యపోరాటయోధులను గుర్తు చేసుకుంటూ 'ఆజాది గౌరవ్ మార్చ్' నిర్వహిస్తున్నదని రాహుల్ పేర్కొన్నారు. స్వాతంత్ర్యదినం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ చేసిన ప్రసంగంలో వారసత్వం, బంధుప్రీతి గురించి మాట్లాడారని అందుకు మీ సమాధానమేమిటని ప్రశ్నించగా, ఆ విషయాలపై తాను ఎటువంటి వ్యాఖ్యలు చేయదలచుకోలేదని రాహుల్ స్పష్టం చేశారు. 76వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా రాహుల్ గాంధీ ప్రతిఒక్కరికి అభినందనలు చెప్పారు. కాంగ్రెస్ నాయకులు పార్టీ ప్రధాన కార్యాలయం నుండి గాంధీ స్మృతివనం వరకు ఆజాది గౌరవ్ యాత్ర పేరుతో పాదయాత్ర చేశారు. ఈ మార్చ్‌లో రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీ వాద్రా, అంబికాసోని, గులాంనబీఆజాద్, ఆనంద్‌శర్మ, వేణుగోపాల్‌లతో పాటు ఇతరులు పాల్గొన్నారు. గాంధీ స్మృతివనం చేరుకున్న వీరంతా మహాత్మాగాంధీకి శ్రద్ధాంజలి ఘటించారు. స్వాతంత్ర్యదినం వంటి విశేషమైన సందర్భాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ ఆజాది గౌరవ్ యాత్ర చేపట్టిందని యాత్ర అనంతరం రాహుల్‌గాంధీ తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేసిన ప్రసంగాన్ని పోస్టుచేసిన రాహుల్ గాంధీ మనదేశ సంస్కృతి సంప్రదాయాలకు సంబంధించిన ప్రధాన చిత్రాలను కూడా పెట్టారు. మన మాతృభూమిని మనమంతా ప్రేమించాలి. మన ప్రాచీన చరిత్రను గుర్తుచేసుకుంటూ కర్తవ్యదీక్షతో వినూత్నంగా ఉండాలి. హ్యాపి ఇండిపెండెన్స్ డే, జైహింద్ అంటూ రాహుల్ గాంధీ ట్విట్టర్‌లో వివరించారు.

## భూమికి 30 కిలోమీటర్ల పైన మువ్వన్నెల రెపరెపలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** స్వాతంత్ర్య వజ్రోత్సవాన దేశం మొతనం మువ్వన్నెల రంగులతో ధగధగమంటోంది. వాడవాడలా రెపరెపలాడుతున్న త్రివర్ణ పతాకాలు దేశానికి కొత్తందాలు తీసుకొచ్చాయి. ఈ పతాకాల రెపరెపలు ఒక్క భూమికే పరిమితం కాలేదు. ఈ నేలకు పైన 30 కిలోమీటర్ల ఎత్తులోనూ ఓ జాతీయ జెండా ఎగురుతూ నింగికే శోభను తీసుకొచ్చింది. స్వాతంత్ర్య వజ్రోత్స వాలను పురస్కరించుకుని స్పేస్ కిడ్జ్ ఇండియా అనే సంస్థ బెలూన్ సాయంతో 1,06,000 అడుగుల ఎత్తుకి జాతీయ జెండాను పంపి ఆవిష్కరించింది. స్పేస్ కిడ్జ్ ఇండియా అనేది దేశానికి యువ శాస్త్రవేత్తను అందించేందుకు కృషి చేస్తున్న సంస్థ. హద్దులు లేని ప్రపంచం కోంస చిన్నారుల్లో అవగాహన కల్పిస్తోంది. ఇటీవల లోఎర్త్ ఆర్బిటర్‌లోకి ఉపగ్రహం ఆజాదీశాట్‌ను ప్రయోగించింది. దేశవ్యాప్తంగా 750 మంది విద్యార్థినులతో ఈ ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశారు. అయితే దీనిని మోసుకెళ్లిన స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ ఉపగ్రహాన్ని కక్ష్యలో పెట్టడంలో విఫలమైంది. దేశం స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్న వేళ అంతరిక్షం నుంచి కూడా సందేశాలు వెల్లు వెత్తుతున్నాయి. అంతర్జాయ అంతరిక్ష కేంద్రం నుంచి వ్యోమగామి స మంతా క్రిస్టో ఫోరెట్టి ఒక విడియో సందేశాన్ని పంపు తూ భారత్‌కు 75 వసంతాల స్వాతంత్య్ర శుభాకాంక్ష లు తెలిపారు. అలాగే భారతీయ అమెరికన్ వ్యోమగామి రాజాచారి కూడా ఆసక్తికర ఫోటోలు షేర్ చేశారు. భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తన తండ్రి నగరమైన హైదరాబాద్ ఎలా వెలిగి పోతోందో అంతరిక్షం నుంచి వీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. భారతీయ అమెరికన్లు నిత్యం పురోగమిస్తున్న వాటిలో నాసా కూడా ఒకటన్నారు. ఈ సందర్భంగా అంతరిక్ష కేంద్రంలో భారత పతాకాన్ని ఆవిష్కరించిన ఫోటోలను షేర్ చేశారు.





## ఆంగ్‌శాన్‌సుకీకి ఆరేళ్ల జైలు

**నిధుల దుర్వినియోగం ఆరోపణలపై శిక్ష ఖరారు**

**మయన్మార్, ఆగస్టు15:** మయన్మార్ కీలకనేత, నోబెల్ బహుమతి విజేత ఆంగ్‌సాన్‌సూకీకి అక్కడి కోర్టు ఆరేళ్ల జైలు శిక్ష విధించినట్లు సమాచారం. నాలుగు అవినీతి కేసులతో సూకీకి సంబంధం ఉన్నట్లు పేర్కొంటూ కోర్టు ఆమెకు ఆరేళ్ల జైలు శిక్షను ఖరారు చేసినట్లు అనధికార వర్గాలు తెలిపాయి. దేశంలో ఆరోగ్యం, విద్యను ప్రోత్సహించేందుకు ఆమె స్థాపించిన 'డా cన్ క్యీ' ఫౌండేషన్ నిధులను దుర్వినియోగం చేశారంటూ కోర్టు ఆమెను దోషిగా తేల్చింది. సొంత ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమిని రాయితీ ధరకు లీజుకు తీసుకున్నట్లు తేల్చిన న్యాయస్థానం శిక్ష ఖరారు చేసినట్లు వర్గాలు పేర్కొన్నాయి. మయన్మార్‌లో సైన్యం తిరుగుబాటు చేసి అధికారాన్ని స్వాధీనం చేసుకున్న తర్వాత సూకీని గతేడాది ఫిబ్రవరి 1న అరెస్టు చేశారు. సాధారణ ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలతో ఆమెను పదవి నుంచి తొలగించారు. ఆమెతో పాటు పలువురు నేతలను కూడా నిర్బంధంలోకి తీసుకున్నారు. అప్పటి నుంచి సూకీని నిర్బంధంలోనే ఉంచి ఆమెపై పలు కేసులు మోపుతున్నారు. ఇప్పటికే పలు కేసుల్లో ఆమెకు జైలు శిక్షలు కూడా విధించారు. 1989, 2010మధ్యలో ఆంగ్ సాన్ సూకిని దాదాపు పదిహేనేళ్లపాటు సైన్యం గృహ నిర్బంధంలోనే ఉంచింది. ఇప్పుడు మరిన్ని అభి యోగాల్లో దోషిగా తేల్చింది. వాకీటాకీలను అక్రమంగా దిగుమతి చేసుకున్నారనని 6 లక్షల డాలర్ల నగదును, బంగారు కడ్డీలను లంచంగా తీసుకున్నారని 4,5 సంవత్సరాల జైలుశిక్ష విధించింది.

## జడ్జిలపై కాదు తీర్పులపైనే సద్విమర్శలుండాలి

**సుప్రీంకోర్టు కాబోయే సిజెఐ యుయులలిత్**



**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** కోర్టులు వెలువరించే తీర్పులను విమర్శిస్తే నష్టం లేదని కానీ వ్యక్తిగత కారణాలతో న్యాయమూర్తులను విమర్శించడం సరికాదని సుప్రీంకోర్టుకు కాబోయే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యుయులలిత్ అన్నారు. ఆగస్టు 27న ప్రస్తుత సిజెఐ ఎన్వీరమణనుంచి లలిత్ బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఒక జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ జడ్జిలు కేవలం వారి తీర్పులు, ఆర్డర్ల ద్వారా మాత్రమే మాట్లాడతారని అన్నారు. కాబట్టి విమర్శలు కేవలం తీర్పులపై మాత్రమే ఉండాలన్నారు. ఎవరైనా సరే తీర్పులను మాత్రమే చూడాలని, వాటి వెనుక ఉన్న జడ్జిలను చూడకూడదని అన్నారు. న్యాయమూర్తులపై సోషల్ మీడియాలో వ్యతిరేకప్రచారంజరుగుతోందని, వీటిపై జడ్జిలు వెంటనేప్రతిస్పందించరని, దీన్ని బలహీనతగా కూడా చూడకూడదని ఆయన హితవు చెప్పారు.

## 10 లక్షల ఉద్యోగాలను భర్తీచేసి నిరుద్యోగం తరిమేస్తాం

**స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రజలకు సిఎం నితీష్ వరాలు**



**పాట్నా, ఆగస్టు 15:** 75వ స్వాతంత్ర్యదినోత్సవం రోజున ఎనిమిదోసారి ముఖ్యమంత్రి బాధ్యతలుచేపట్టిన సిఎం నితీష్‌కుమార్ బీహార్‌ప్రజలకు వరాలు కురిపించారు. తమ ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా 10 లక్షల ఉద్యోగాలను భర్తీచేస్తామని తన డిప్యూటి సిఎం తేజస్వియాదవ్ చెప్పినట్లుగా ఉపాధి కల్పనకు మరింతప్రాధాన్యతనిస్తామని చెప్పారు.మేమిద్దరం కలిసి పనిచేస్తున్నామని, ఇపుడు ఇద్దరం కలిసే పది లక్షల ఉద్యోగాల కల్పనకు కృషిచేస్తామని చెప్పారు. మేం వాస్తవానికి తమ హయాంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయించామని ఈ లక్ష్యాన్ని అటు ప్రభుత్వరంగం, ఇటు ప్రైవేటురంగంలోను సాధిస్తామని అన్నారు .బీహార్‌లో ఉపాధికల్పనకంటే పెద్ద సమస్య మరేమీలేదని, నేనుచేసిన వాగ్దానాలను ఏంచేసారని ప్రశ్నిస్తున్నవారికి ఇదే సమాధానంగా నిలిచిందని ఆర్‌జెడి నేత తేజస్వియాదవ్ పేర్కొన్నారు. 2020 ఎన్నికల హయాంలో తాము పదిలక్షల ఉద్యోగాలను కల్పిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. పునరుత్పత్తి రేటును మెరుగుపరిచేందుకు మహిళల్లో చదువరులు పెరగాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. జనాభా చట్టం నిష్ప్రయోజనమని అన్నారు. ఈచట్టం అమలుచేసిన తర్వాత చైనా పరిస్థితి అందరికీ తెలుసునని, ఇపుడు రానురాను పిల్లల సంఖ్యను పెంచుతూ వస్తోందని, వాస్తవానికి మహిళల్లో పునరుత్పత్తిరేతు పడిపోతోందని, ఉన్నత విద్యకారణంగా సంతానం కోసం మహిళల ధ్యాస తగ్గిందని అన్నారు. ఈదిశగా కూడా కృషిచేస్తూ తమ లక్ష్యాన్ని సాధిస్తామని చెప్పారు. జెడియు మొదటినుంచి జనాభానియంత్రణను వ్యతిరేకిస్తోందని ఆయన చెప్పారు. 16వ సారి పాట్నాలో ఆయన జాతీయ పతాకిన్ని ఎగురవేసి సభలోప్రసంగించారు. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తమ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని అన్నారు.

## భారత్ బయోటెక్ నాసాల్‌స్ప్రే వ్యాక్సిన్ సక్సెస్

**హైదరాబాద్, ఆగస్టు 15:** భారత్ బయోటెక్ ముక్కుద్వారా వేసే కరోనా వ్యాక్సిన్ పరీక్షలు విజయవంతం అయ్యాయి. బిబివి154 వ్యాక్సిన్‌గా చెపుతున్న ఈ నాసాల్ వ్యాక్సిన్ మూడోదశ ఫలితాలు సానుకూలంగా వచ్చినట్లు భారత్ బయొటెక్ తన అధికారిక ట్వీట్‌లో వెల్లడించింది. బిబివి 154 ఇంట్రానాసల్‌టీకాను ఇచ్చేందుకు కావాల్సిన అన్ని పరీక్షలను పూర్తిచేసామని వివరించింది. ఇక ఈటీకా పూరిన తసురక్షితమైనదని, వ్యాధినిరోధక శక్తిని సమర్థంగా ప్రేరేపిస్తోందని తెలిపింది. కొన్ని మార్పులుచేసిన అడినోవైరస్ వెక్టార్‌సాయంతో ఈ టీకాను అభివృద్ధిచేసినట్లు వెల్లడించింది. వాషింగ్టన్ యూనివర్సిటీఇన్ సెయింట్‌లూయిస్ భాగసామవ్యంతో ఈ టీకాను అభివృద్ధిచేసామని వివరించింది. ఇక బూస్టర్‌డోసుగాను బిబివి 154ను ఇవ్వవచ్చని భారత్ బయోటెక్ వివరించింది. ఈ ప్రయోగాల ఫలితాలను ఔషధ నియంత్రణ ప్రాధికార సంస్థకు నివేదించామనికూడా సంస్థ యాజమాన్యం వెల్లడించింది.



## గోడకూలి ఒకే కుటుంబంలో ఐదుగురు మృతి

నయారాయ్‌పూర్, ఆగస్టు 15: ఇంటిగోడ కూలి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందారు. ఈ విషాద సంఘటన ఛత్తీస్‌ఘడ్‌లోని కాంకేర్‌జిల్లాలో సోమవారం జరిగింది. వివరాలను చూస్తే జిల్లాలో గడచిన రెండురోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు పఖంజోర్‌ప్రాంతంలోని ఇర్పనాం గ్రామంలో ఓ కుటుంబం వారింట్లో వర్షాలకు తలదాచుకుంటున్న సమయంలోనే మట్టిగోడ కూలిపోయింది. ఈప్రమాదంలో దంప తుల తోపాటు వారి ముగ్గురుపిల్లలుచనిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు అదికారులు ఘటనా స్థలానికి చేరుకుని మొత్తం వివరాలను సేకరించారు. కేసునమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

## మరాఠా, ధంగార్, ఒబిసిలకు రిజర్వేషన్లు

**మహారాష్ట్ర పంద్రాగస్టు ప్రసంగంలో సిఎం ఏక్‌నాథ్‌షిండే**



**ముంబయి, ఆగస్టు15:** మహారాష్ట్రలో ఇతర వెనుకబడిన తరగతులు,మరాఠా, ధంగార్ కులాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృషిచేస్తామని తమ ప్రభుత్వం సామాన్యమానవుడినుంచి అన్ని వర్గాలకు సమున్నత సేవలందించేందుకే ఉందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్‌షిండే తెలిపారు. 75వ స్వాతంత్ర్యదినోత్సవాల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం షిండే మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాలు భారీ వర్షాల కారనంగా వరదలకు గురయి అపారనష్టం కలిగించాయని, బాధ్యతలు స్వీకరించిన మొట్ట మొదటిరోజునుంచే ప్రజలకు సుస్థిర పాలన అందించే దిశగా చర్యలుచేపట్టామని సామాన్యులు, రైతులు, ఉద్యోగుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఒబిసిలు, మరాఠా, ధంగార్ కులాలకు రిజర్వేషన్‌ప్రయోజనాలు అందించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. 15 లక్షలహెక్టార్ల సాగుభూమి వరదలకు దెబ్బతిన్నదని, రాష్ట్రంలోని 28 జిల్లాలు భారీ వర్షాలు వరదలకు దెబ్బతిన్నాయన్నారు. నిరాశ్రయులయిన ప్రజలకు ఇందుకు సంబంధించి పూర్తి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు వరదలనుంచి రక్షణ చర్యలుచేపట్టేందుకు శాస్త్రీయపద్ధతిలోనే వ్యర్థాలను తొలగించాలనినిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు.

## రేసులో వెనకబడ్డా ప్రధాని ఛాన్స్ లేకపోలేదు



**తాజా సర్వేలో విదేశాంగమంత్రి లిజ్‌ట్రస్‌కే ఎక్కువ ఛాన్స్**

**లండన్, ఆగస్టు15:** బ్రిటన్ ప్రధానమంత్రి రేసులో ఉన్న రిషి సునాక్, సొంతపార్టీకి చెందిన ప్రత్యర్థితో పోలిస్తే వెనుకంజలో కొనసాగుతున్నారు. కన్జర్వేటివ్ పార్టీ నేత పోటీలో లిజ్‌ట్రస్ ఆధిక్యంలో కొనసాగుతున్నట్లు తాజా సర్వే వెల్లడించింది. ది అబ్జర్వర్ వార్తాపత్రికలో వచ్చిన ఒపీనియమ్ సంస్థ చేపట్టిన సర్వేలో 570 మంది కన్జర్వేటివ్ సభ్యులు పాల్గొనగా లిజ్ ట్రస్‌కు 61 శాతం, రిషిసునాకు 39 శాతం మద్దతు లభించింది. దాదాపు 22 అంశాలపై టోరి మెంబర్లను ప్రశ్నించగా దాదాపు సగానికిపైగా ట్రస్‌కే తమ ఓటు వేశారు. ఇప్పటివరకు లిజ్‌ట్రస్ ముందంజలో ఉన్నప్పటికీ పార్టీ నేతగా గెలిచేందుకు రిషీకి ఇంకా అవకాశాలున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా ట్రస్‌కు సీనియర్ కన్జర్వేటివ్ సభ్యులు మద్దతు పలుకుతుండగా, సునాక్‌కు మాత్రం యువనేతు అండగా ఉన్నట్లు తాజా సర్వేలను బట్టి తెలుస్తోంది. అయితే బోరిస్ జాన్సన్‌ను రాజీనామా చేయాలని రిషి సునాక్ కోరడం ఆయనకు ప్రతికూలంగా మారుతున్నట్లు తెలుస్తోంది. జాన్సన్‌కి సన్నిహితురాలుగా పేరొందిన ట్రస్ మాత్రం బోరిస్ జాన్సన్‌ను రాజీమాన చేయాలని కోరకపోవడం ఆమెకు కలసివస్తుందని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

## ఒక్కరోజులో కరోనా కేసులు14,917 మృతులు 32 దేశంలో మొత్తం కరోనాబాధితులు 4,42,68,381

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్ ఆగస్టు15:** భారత్‌లో కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతోంది.గడిచిన 24 గంటల్లో దేశవ్యాప్తంగా 14,917కేసులు నమోదయ్యాయి.32 మంది మరణించారు.ఇప్పటివరకు దేశంలో కరోనా బారిన పడిన మొత్తం బాధితుల సంఖ్య 4,42,68,381కి చేరిందని కేంద్ర ఆరోగ్య,కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది.మొత్తం బాధితుల్లో ఇప్పటి వరకు 4,36,23,804మంది కోలుకోగా 1,17,508మంది దేశంలోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు కరోనాతో మృతి చెందినవారు 5,27,069కు చేరినట్లు అంచనా.

## భారత్‌కు ప్రపంచం నలుమూలల నుంచి శుభాకాంక్షల వెల్లువ

**వాషింగ్టన్, ఆగస్టు 15:** ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేళ భారత్‌కు ప్రపంచం నలుమూలల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ భారత్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆదివారం రాత్రి భారత్-అమెరికన్ కమ్యూనిటీ, తమ దేశాన్ని మరింత సృజనాత్మకంగా, సమ్మిళితంగా, బలంగా నిలుపుతోందన్నారు. అమెరికాలోని నాలుగు మిలియన్ల ఇండో-అమెరికన్లు సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుపుకొంటున్నారు. గాంధీజీ మార్గదర్శకత్వంలోని అహింస, నిజాయతీ ఆధారంగా సాగుతున్న వారి ప్రజాస్వామ్య ప్రయాణాన్ని గౌరవించేందుకు అమెరికా కూడా వారితో కలుస్తుంది. ఇరు దేశాల ప్రజల మధ్య బంధంతో మా భాగస్వామ్యం భవిష్యత్తులో మరింత బలోపేతం అవుతుంది. అమెరికా తరపున భారత ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు అని పేర్కొన్నారు. అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకన్ కూడా భారత్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల భాగస్వామ్యం 75యేళ్లు పూర్తి చేసుకుందని ఆయన గుర్తుచేశారు. ప్రపంచ భద్రత, క్షేమం కోసం భవిష్యత్తులో మా రెండు ప్రజాస్వామ్య దేశాలు మరింత కృషి చేస్తాయి. ఈ విషయంలో నాకు నమ్మకం ఉంది అని పేర్కొన్నారు. ఆస్ట్రేలియా ప్రధాని అల్బానెస్ లౌడ్స్ సోమవారం ఉదయం భారత్‌కు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఆవిర్భవించిన



స్వతంత్ర భారత్ సాధించిన విజయాలు అపూర్వమైనవి. ఇరు దేశాల సంబంధాలను పరస్పర గౌరవం, స్నేహం, సహకారంతో మరింత బలోపేతం చేసుకొంటాం. నా తొలి పర్యటక నిమిత్తం క్వాడ్ భేటీ కోసం టోక్యో వెళ్లినప్పుడు ప్రధాని మోడీని కలిశాను. జపాన్ ప్రధాని, అమెరికా అధ్యక్షుడితో కలిసి ఇండో-పసిఫిక్‌లో మా ప్రణాళికను బలోపేతం చేసుకొన్నాం. భారత్- ఆస్ట్రేలియా సమగ్రమైన వ్యూహాత్మక భాగస్వాములు అని పేర్కొన్నారు.

## అసోంలో లక్షకుపైగా సోషల్ మీడియా కేసుల ఉపసంహారణ

**స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో సిఎం హిమంత్‌బిశ్వశర్మ**

**గువాహతి, ఆగస్టు 15:** అస్సాం ప్రభుత్వం న్యాయవ్యవస్థపై భారం తగ్గించేందుకు లక్షకుపైగా ఉన్న మైనర్‌కేసులను ఉపసంహరించాలని నిర్ణయించింది. సోషల్‌మీడియా పోస్టులపై నమోదయిన కేసులన్నింటినీ విత్‌డ్రా చేయాలని నిర్ణయించింది. దీనివల్ల న్యాయవ్యవస్థపై భారం తగ్గుతుందని ముఖ్యమంత్రి హిమంత్‌బిశ్వశర్మ పేర్కొన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్‌పోస్టులపై నమోదయిన కేసులే వీటిలో ఎక్కువ ఉన్నాయని, ఇవన్నీ ప్రస్తుతం కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ఈనెల 14వ తేదీ అర్ధరాత్రివరకూ పెండింగ్‌లో ఉన్న ఈమైనర్‌కేసులన్నింటినీ ఉపసంహరించాలనినిర్ణయించినట్లు తెలిపారు. దీనివల్ల ఇపుడు న్యాయవ్యవస్థ తీవ్రస్థాయి కేసులపై దృష్టిపెట్టే అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం న్యాయవ్యవస్థకు ఈకేసులు ఉపసంహరించాలని పిటిషన్ దాఖలుచేస్తుందని అన్నారు. అలాగే రాష్ట్రంలో ఉన్నయుఎల్ఎఫ్ఎ(ఉల్ఫా) పరేష్‌బారువా వర్గం హింసను వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. చర్చలద్వారానే అన్ని అంశాలు సమస్యలుపరిష్కారం అవుతాయని, అస్సాం ఉగ్రవాదాన్ని ప్రోత్సహించబోదని అన్నారు. రామాయణ, మహాభారత కాలం నుంచి అస్సాం భారత్‌లో అంతర్భాగంగా నిలిచిందని, గడచిన మూడేళ్లలో సార్వ భౌమ అస్సాంగా నిలిపేందుకు అవిరళ కృషిజరిగిందన్నారు. ఉల్ఫాకు చెందిన అనేక మంది ఇపుడు స్వాతంత్ర్య దినోత్సవాల్లో పాల్గొనడం సంతోషకరమని పేర్కొన్నారు. అలాగే వచ్చేనెలలోనే పదివేల ప్రభుత్వ ఉద్యోగాలు ప్రనకటిస్తున్నట్లు తెలిపారు. పారదర్శ కంగానే లక్ష ఉద్యోగాలు భర్తీచేయాలని నిర్ణయిం చామని, ఇప్పటికే 30వేల కొలువులు ఇచ్చామని అన్నారు.





తన నివాసంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించిన రేవంత్ రెడ్డి

## సరళీకృత ఆర్థిక విధానాలతో కోట్లాది మందికి ఉద్యోగ అవకాశాలు: టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** దేశ ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా, గుర్తించి సమన్వయంతో పనిచేసి ప్రజల మనసుల్లో మంచి స్థానం సంపాదించామని, కానీ నేడు దేశంలో మతతత్వ శక్తులు దేశంలో చిచ్చుపెట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తుందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్వతంత్ర వజ్రోత్సవాల సందర్భంగా తన నివాసంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. కోవిడ్ లక్షణాలు ఉండడంతో సెల్ఫ్ క్వారంటైన్‌లో ఉన్న రేవంత్‌రెడ్డి వజ్రోత్సవాల సందర్భంగా జుబ్లీహిల్స్‌లోని తన నివాసంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ జాతిపిత మహాత్మాగాంధీ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, అంబేద్కర్, నెహ్రూ లాంటి వాళ్లు ఎంతో మంది ఉద్యమాల ఫలితమే నేటి స్వాతంత్ర్యం అన్నారు. పోరాట ఫలితంగా వచ్చిన స్వాతంత్ర్యంతో ఒకవైపు ఆనందం, మరోవైపు దేశ విభజన విషాదం అన్నారు. దేశంలో ప్రజలకు సంక్షేమాన్ని అభివృద్ధిని అందించి, ప్రజలకు ఆత్మగౌరవంతో బతికేలా తీర్చిదిద్దిన ఘనత నేతలదన్నారు. దేశంలో కోసం మహాత్మాగాంధీ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు ప్రాణత్యాగం చేశారన్నారు. ఎన్నో పోరాటాలు, ఎంతో శ్రమను ఓర్చి నిర్మించిన ఈ దేశంలో మళ్లీ విభజించి లబ్ది పొందే వర్గాలను మనం ప్రతిఘటించాలన్నారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ నాయకత్వంలో పటిష్టమైన పోరాటంతో పనిచేయాలని కోరుకుంటున్నానన్నారు.

## ఫిరాయింపుల ప్రయోగశాలగా మార్చిన సిఎం: రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ తెలంగాణ ను ఫిరాయింపుల ప్రయోగశాలగా మార్చి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా రేవంత్‌రెడ్డి ఒక వీడియోను విడుదల చేశారు. మునుగోడు ఉప ఎన్నికలో టిఆర్ఎస్‌పార్టీ ముఖ్యమంత్రి ఎప్పటిలాగే ప్రజాప్రతినిధులను కొను గోలు చేస్తున్నారన్నారు. అభివృద్ది, సంక్షేమ పథకాలు అమలు చేసి వాటిని చూపించి ఓట్లు అడిగితే ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిని ప్రజలు గౌరవించే వారన్నారు. కానీ అలా చేయడంలేదన్నారు. సర్పంచ్‌లను, ఎంపిటిసిలను కొను గోలు చేయడం ద్వారా అక్కడ గెలవాలని ఒక దుర్మార్గమైన రాజకీయాలకు ఒడిగడుతున్నారన్నారు. నల్లగొండలో పోరాట చరిత్ర ఉందని, అక్కడ ధర్మ బిక్షం, మల్లుస్వరాజ్యం, పాల్వాయిగోవర్ధన్‌రెడ్డి లాంటి ఎంతో మంది పోరాట యోధులు ఉన్న ప్రాంతం అన్నారు. ఇక్కడ కూడా నాయకులను కొనుగోలు చేసి రాజకీయాలను కలుషితం చేయాలని చూస్తున్నారన్నారు. రాజీవ్‌గాంధీ జయంతిని నతాను మునుగోడు వెళ్తున్నానని, 20వ తేది నుంచి ఆ ప్రాంత ప్రజల మధ్య ఉంటానన్నారు. ఎనిమిది సంవత్సరాల శ్రేణులు ఎంతో కష్టపడ్డారని, కొట్లాడారని, నష్టపోయారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే సమయంలో మనం చిన్న ప్రలోభాలకు లొంగిపోతే చరిత్రహీనులుగా మిగిలి పోతామన్నారు. కలిసి నిలబడి మునుగోడులో కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బిజెపి, టిఆర్ఎస్‌లకు బుద్ది చెప్పే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ శ్రేణులు అందరూ చెందాల్సిన అవసరం లేదన్నారు. కలిసికట్టుగా పోరాటం చేసి మునుగోడులో విజయం సాధిద్దామన్నారు.



## గాంధీభవన్‌లో ఘనంగా స్వాతంత్ర్య వజ్రోత్సవాలు

### జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** గాంధీభవన్ ఆవరణలో స్వతంత్ర వజ్రోత్సవాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం స్వతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ పతకాన్ని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐసిసి కార్యదర్శి నదీమ్ జావిద్, వర్కింగ్ ప్రసిడెంట్ అంజన్‌కుమార్‌యాదవ్, గీతారెడ్డి, అజారుద్దిన్, మాజీ మంత్రి షబ్బీర్ అలీ, నేతలు కుసుమకుమార్, అనిల్‌కుమార్‌యాదవ్, శివసేనారెడ్డి, అజ్మత్ హుస్సేన్, పిరోజ్‌ఖాన్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్ నుంచి ఆబిడ్స్ నెహ్రూ విగ్రహం వరకు ఆజాది గౌరవ్ యాత్రను టిపిసిసి ఆధ్వర్యంలో చేపట్టారు. వర్కింగ్ ప్రసడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలిలో ఎంపి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో పాటు భారీగా కార్యకర్తలు నాయకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి వర్కింగ్ ప్రసిడెంట్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం వచ్చే నాటికి దేశంలో గుండుపిన్ను తయారయ్యే పరిస్థితి లేదన్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ దేశంలో కొన్ని లక్షల కోట్ల సంపదను దోచుకున్నారన్నారు. స్వాతంత్ర్య వచ్చిన మొదట్లో దేశం అత్యంత దయనీయ పరిస్థితుల్లో ఉందన్నారు. నెహ్రూ ముందు చూపుతో దేశం ప్రస్తుతం ఈ స్థాయిలో ఉందన్నారు. ప్రపంచంలో ఒకబలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో రూ.200రూపాయల తలసరి ఆదాయం ఉంటే ప్రస్తుతం రెండు లక్షల రూపాయల తలసరి ఆదాయం ఉందన్నారు. ఈ సంపదను సృష్టించిన ఘనత కాంగ్రెస్ పాలకులదన్నారు. జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని, సగటు జీవిత కాలం స్వతంత్ర వచ్చిన మొదట్లో 20 ఏళ్లు ఉంటే నేడు 70 సంవత్సరాలు ఉందన్నారు. కానీ మోడీ పాలనలో దేశంలో నేడు తలసరి అప్పులు రూ.2లక్షలు అయిందన్నారు.

## ఉపన్యసిస్తూ కుప్పకూలిన వ్యక్తి మృతి

**హైదరాబాద్ (కుషాయిగూడ), ఆగస్టు 15 ప్రభాతవార్త :** స్వాతంత్ర వజ్రోత్సవ దినోత్సవం సందర్భంగా ఉపన్యసిస్తూ కుప్పకూలి మృతి చెందిన హృదయ విదారకమైన సంఘటన గ్రేటర్ హైదరాబాద్ కాప్రా సర్కిల్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం కాప్రా సర్కిల్ పరిధిలోని పంపు కూడా లక్ష్మీవిలాస్‌లో నివాసముండే ఉప్పల సురేష్ (56) అనే వ్యాపారి స్వాతంత్ర



ఉప్పల సురేష్(ఫైల్)

దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విల్లాస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో స్వాతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత గురించి ఉపన్యసిస్తున్న క్రమంలో హఠాత్తుగా కుప్పకూలి మృతి చెందడంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. స్వాతంత్రానికి ముందు స్వాతంత్రం తేవడానికి జరిగిన చరిత్రను చెబుతున్న క్రమంలో ఇలాంటి దుస్సంఘటన జరగడంతో పలువురు నేతలు ఆయన మృతికి సంతాపాన్ని తెలియపరిచారు. మృతుడు ఉప్పలసురేష్ అంబర్‌పేట్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీలో ఫార్మాసియాటికల్ ఏజెన్సీని నిర్వహిస్తున్నారు. ఆయన మృతి సమాచారం తెలుసుకున్న జగద్గిరిగుట్ట శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ రేగురి ప్రవీణ్ గుప్తా, అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్తా, జగదీష్ గుప్తా దామెర, నేతి శంకర్ గుప్తా, పులిగిల్ల నర్సింలుగుప్తా, గాంధీ, అంగడి సత్యనారాయణ తదితరులు ఆయన నివాసానికి చేరుకొని తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు.

# ఎనిమిదేళ్లలో అపూర్వ అభివృద్ధి

## యావత్ దేశానికి తెలంగాణ అదర్శం: మంత్రి హరీష్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం సాధించుకున్నామని, డాక్టర్ బి.అర్. అంబేద్కర్ అధ్వర్యంలో రూపొందించిన రాజ్యాంగం దేశాన్ని ప్రపంచ దేశాలకు అదర్శంగా నిలిచేలా చేసిందని రాష్ట్ర ఆర్థిక, ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రం లోని డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన 75వ స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకల్లో ఆయన జెండా ఆవిష్కరణ చేసి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ అశయ సాఫల్యం కోసం స్వరాష్ట్రాన్ని సాధించుకున్నామో..అ లక్ష్య సాధన దిశగా సిఎం కెసిఅర్ నాయకత్వంలో రాష్ట్రం పురోగమిస్తుందన్నారు. 75 సంవత్సరాలలో ఏ రాష్ట్రం సాధించలేని విజయాలను కేవలం 8 యేండ్లలో తెలంగాణ రాష్ట్రం సాధించిందన్నారు. యావత్ దేశానికే తెలంగాణ అదర్శంగా నిలుస్తుందన్నారు. జిల్లాలో 33 ప్రాథమిక అరోగ్య కేంద్రాలు, 194 అరోగ్య ఉప కేంద్రాలు, 3 కమ్యూనిటీ అరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖనాలు ప్రజలకు అందు బాటులోకి వచ్చి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలో కొత్తగా పీజీ కోర్సులను ప్రారంభించుకోవడంతో పాటు 100 సీట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను ప్రారంభించుకున్నామన్నారు. 15వ అగస్టు నుంచి 26,646 మందికి కొత్త ఫించన్‌లు అందివ్వడం జరుగుతుందన్నారు. దళితబంధు ద్వారా జిల్లాలో 495 మందికి రూ.10 లక్షల చొప్పున అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హుస్నాబాద్ ఎమ్మెల్యే ఒడితత సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్, జడ్పీ చైర్మన్ వేలేటి రోజాశర్మ, కలెక్టర్ ప్రశాంత్‌జీవాన్‌పాటిల్, సీపీ ఎన్.శ్వేత వివిశాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ చైర్మన్ మంజులరాజనర్సు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన అధికారులకు ప్రశంసా పత్రాలను అందించడంతో పాటు స్వాతంత్ర సమరయోధులను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఎంతగానో అకట్టుకున్నాయి.

# ఈ యేడాది 719 ప్రత్యేక రైళ్లు నడిపాం



- నియమిత రైళ్లకు 5385 అదనపు కోచ్‌లు
- గుంతకల్ డివిజన్ విద్యుదీకరణ పూర్తి
- ద.మ రైల్వే స్వాతంత్ర్య వేడుకల్లో అరుణ్ కుమార్ జైన్

**హైదరాబాద్ ఆగస్టు 15 ప్రభాతవార్త :** ప్రయాణికుల అవసరార్థం 719 ప్రత్యేక రైళ్లను నడిపామని, ఎక్కువ మంది ప్రయాణికులను చేరవేయడానికి వీలుగా నియమిత రైళ్లకు 5385 అదనపు కోచ్‌లను చేర్చడం జరిగిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ (ఇంఛార్జ్) అరుణ్ కుమార్ జైన్ తెలి పారు. అలాగే 96 కిలో మీటర్ల రైలు మార్గం విద్యుదీకరణ జరిగిందని గుంతకల్ డివిజన్‌పూర్తి విద్యుదీకరణ పూర్తి చేశామని ఆయన వెల్లడించారు. సోమవారం 76వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరిం చుకుని సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్ మైదానంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ( ఇంఛార్జీ) అరుణ్ కుమార్ జైన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందన స్వీకారం చేశారు. సీనియర్ రైల్వే అధికారులు సిబ్బంది వారి కుటుంబ సభ్యులు ఈ వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్బంగా అరుణ్ కుమార్ జైన్ తమ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో మాట్లాడుతూ స్వాతంత్ర్యం ద్వారా సంక్రమించిన వారసత్వాన్ని గౌరవిం చడానికి ఆజాదీకా అమృత్ మహోత్సవ్ సందేశాన్ని చాటడానికి దమ రైల్వే చేపట్టిన వివిధ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ ఏడాది 2022 ఏప్రిల్ నుంచి జూలై మధ్య కాలంలో ఎన్‌సిఆర్ స్థూల రెవెన్యూ వసూళ్లు రూ. 5909 కోట్లకు చేరా యన్నారు. ఇది గత సంవత్సరం కన్నా 43 శాతం ఎక్కువ అని ఆయన వెల్లడించారు. అదే విధంగా మండలంలో సరుకుల రవాణా కూడా బాగా పెరిగిందని 2022 ఏప్రిల్ - జూలై మధ్య కాలంలో 43.6 మిలియన్ టన్నుల సరుకుల రవాణా జరిగిందన్నారు. తద్వారా రూ. 4048 కోట్ల రాబడి వచ్చిందని ఇది గత సంవత్సరం కన్నా 20 శాతం ఎక్కువని ఆయన తెలిపారు. అదే సమయంలో ప్రయాణికులను తీసుకెళ్లడం కూడా బాగా పెరిగిందన్నారు. ఆర్థిక సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో 78 మిలియన్ల ప్రయాణి కులను తమ గమ్య స్థానాలకు చేరవేయడం ద్వారా రూ. 1617 కోట్ల రెవెన్యూ వచ్చిందని ఇది గత సంవత్సరం మొదటి నాలుగు నెలల్లో వచ్చిన రెవెన్యూతో పోలిస్తే 175 శాతం ఎక్కువని వెల్లడించారు. అంతేకాకుండా ప్రస్తుత ఆర్థిక సంవ త్సరంలో జోన్ మార్గాల విద్యుదీకరణ పనులు చురుకుగా సాగాయని, 96 కిలో మీటర్ల రైలు మార్గం విద్యుదీకరణ జరిగిందని గుంతకల్ డివిజన్ పూర్తి విద్యుదీకరణ అయ్యిందని ఆయన వెల్లడించారు. మౌలిక సదుపాయాల గురించి వివరిస్తూ మండలంలో పూర్తి కాకుండా మిగిలి పోయిన రైలు మార్గాలను పూర్తి చేయడానికి గట్టి కృషి జరిగిందని, తద్వారా భద్రాచలం సత్తుపల్లి మధ్య కొత్త ప్రాజెక్టు మరియు విజయవాడన గుడివాడ - మచిలీపట్నం- నిడదవోలు - నర్సీపట్నం, అలాగే గుడివాడ - భీమవరం డబుల్ లైను ప్రాజెక్టు పూర్తయ్యాయని అంతే కాకుండా కాజీపేట - బలార్షా సెక్షన్‌లో బిసిగిరి షరీఫ్ మరియు ఉప్పల్ మధ్య మూడవ లైను పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. భద్రతా అంశాలను ఆయన ప్రస్తావిస్తూ భారతీయ రైల్వేల దేశీయ స్వయంచాలక రైలు రక్షణ వ్యవస్థ కవచ్‌ను దమ రైల్వేలోని 1455 కిమీ నెట్‌వర్క్‌కు విస్తరించడం జరిగిందన్నారు. రైల్వేలో యంత్రాల సహాయంతో ట్రాక్ నిర్వహణలో కూడా దమ రైల్వే మండలం ముందున్నదని తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ జులై మధ్య రైల్వే ట్రాక్‌ల భద్రతను పటిష్ఠం చేయడానికి జోన్ వ్యాప్తంగా 5200 కిలో మీటర్ల మరియు 1789 పాయింట్లలో మరమ్మతు పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం లో రహదారులు రైలు మార్గాల ప్రయాణికుల భద్రతను పెంచడానికి 19 మను ష్యులు అజమాయిషీ చేసే లెవెల్ క్రాసింగ్‌లను తొలగించడం జరిగిం దన్నారు. దమ రైల్వేకు కొత్త ఆర్థిక సంవత్సరం ఆశావహంగా ప్రారం భమైందని, అందరం కలిసి పని చేసి మరింత విజయాలను సాధిద్దామని అరుణ్ కుమార్ జైన్ ఆశావాహం వ్యక్తం చేశారు.

# జిహెచ్‌ఎంసి, జలమండలి, హెచ్‌ఎండిఎలలో ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను హైదరాబాద్ మహానగర పాలక సంస్థ, జలమండలి, హెచ్‌ఎండిఎలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిహెచ్‌ఎంసి కార్యాల యంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కమిషనర్ డిఎస్ లోకేష్‌కుమార్, ఈవిడిఎం విశ్వజిత్ కంపాటి, ఈఎన్‌సి జియా ఉద్దిన్, అదనపు కమిషనర్లు శృతి ఓజా, సరోజా, జయరాజ్ కెనడీ, విజయలక్ష్మి, సిఈ దేవానంద్, సిపిపి దేవేందర్‌రెడ్డి, ఓఎస్‌డి సురేష్‌లు పాల్గొన్నారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడుతూ జిహెచ్‌ఎంసి సొంత నిధులను సమకూర్చుకుని అభివృద్ధిలో వెనకడుగు వేయకుండా ప్రజలకు మౌలిక వసతులు సదుపాయాలకు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించి విశ్వనగంగా సుస్థిత అభివృద్ధికి కృసి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన రవాణా కల్పించేందుకు రోడ్లు, ఫ్లైఓవరు నిర్మాణాలు చేపట్టి, నగరాన్ని సిగ్నల్ ఫ్రీ నగరంగా ప్రసిద్ధి చెందేలా చర్యలు తీసుకుంటున్నట్లు, యువతకు ఉపాధి, స్వయం సహాయ మహిళా సంఘాలకు ఆర్థిక బలోపేతానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్‌తో కలిసి రూ.145.88కోట్ల ఆర్థిక సమాయాన్ని 2082 స్వయం సహాయక సంఘాలకు పంపిణీ చేశారు. స్వయం ఉపాధి పథకం ద్వారా 1.62కోట్ల రూపాయల విలువగల రుణాలను 189 మందికి పంపిణీ చేశారు. వివిధ ప్రతిభావంతులకు వీల్‌చైర్స్, చేతికర్రలు, ట్రైసికిళ్లు, సహాయ పరికరాలు పంపిణీ చేశారు.

**హెచ్‌ఎండిఎ:** హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్, బుద్ధపూర్ణిమ పరిధిలో అదికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. హైదరాబాద్ గ్రోత్‌కారిడార్ నానక్‌రాంగూడ వద్ద అర్బన్ ఫారెస్ట్రు డైరక్టర్ బి.ప్రభాకర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించడగా, సిజిఎం మాజీద్ షరీఫ్, రవీందర్‌లు పాల్గొన్నారు. బుద్ధపూర్ణిమ ప్రాజెక్టు పరిధిలోని సంజీవయ్య పార్కులో ఓఎస్‌డి రాంకిషన్, ఎస్టేట్ అధికారి గంగాధర్, చీఫ్ అకౌంట్స్ అధికారి విజయలక్ష్మి, సూపరింటెండెంట్ ఇంజనీర్ పరంజ్యోతిలు పాల్గొన్నారు. హెచ్‌ఎండిఏ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎండిఏ సెక్రటరీ చంద్రయ్య, డిఎస్‌పి వెంకటరమణగౌడ్, సూపరింటెండెట్ ఇంజనీర్ హుస్సేన్, ఎడి విశ్వప్రసాద్‌లు పాల్గొన్నారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న జిహెచ్‌ఎంసి మేయర్ విజయలక్ష్మి

**జలమండలిలో:** జలమండలిలో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎండి దానకిషోర్ జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు శ్రీధర్‌బాబు, రెవెన్యూ డైరక్టర్ విఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరక్టర్ రవికుమార్, ఆపరేషన్ డైరక్టర్ స్వామి, చీఫ్ విజిలెన్స్ అధికారి రవిచందన్‌రెడ్డి, జలమండలి కార్మిక సంఘం అధ్యక్షులు రాంబాబుయాదవ్, ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్, కార్మిక సంఘం అసోసియేట్ ప్రసిడెంట్‌లు రాజ్‌రెడ్డి, జహంగీర్‌లు పాల్గొన్నారు.



షాపూర్ నగర్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన జాతీయ జెండా

## కుత్బుల్లాపూర్‌లో జాతీయ జెండాకు అవమానం!

### ఎమ్మెల్యే మెప్పు పొందడానికి పార్టీ నేతల అత్యుత్సాహం

**హైదరాబాద్ (జీడిమెట్ల), ఆగస్టు 15 ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జాతీయ జెండాకు అవమానం జరిగింది. సోమవారం 75వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఐడీపీఎల్, షాపూర్‌నగర్ రహదారిలో ఉన్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన జాతీయ జెండాపై ఎమ్మెల్యే కెపి వివేకానంద్, టీఆర్ఎస్ నాయకుడి ఫోటోలు దర్శనమిచ్చాయి. కొందరు టీఆర్ఎస్ నేతలు రాజకీయ లబ్ధి పొందడానికి ఫ్లాగ్ కోడ్ ఆఫ్ ఇండియా ఆక్ట్‌ను ఉల్లంఘించి జాతీయ జెండాను అవమానించడం పట్ల ప్రజల్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార పార్టీకి చెందిన నేతలు ఇలా జాతీయ జెండాను కించపరచడం దురదృష్టకరమని, ఇప్పటికైనా అధికారులు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



కమాండ్ కంట్రోల్ వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తరువాత అధికారులు, బాలలతో కలిసి ఫోటో దిగిన కొత్వాల్ ఆనంద్

## కమాండ్ కంట్రోల్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన కొత్వాల్ ఆనంద్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సర్కారు ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సమీకృత పోలీసు కమాండ్ కంట్రోల్ వద్ద సిటీ కొత్వాల్ సి.వి ఆనంద్ సోమవారం ఉదయం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. హైదరాబాద్ పోలీసు హెడ్ క్వార్టర్స్ వద్ద పంద్రాగస్టు వేడుకల్లో సిటీ పోలీసు కమిషనర్ ఇటీవల కాలంలో జాతీయ పతాకం ఎగు ర వేయడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి. ఇంతకు ముందు బషీర్‌బాగ్‌లో పోలీసు కమిషనరేట్ వుండగా ఇప్పుడు బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌కు మారడం విదితమే. ఆనంద్ మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల వల్ల దేశానికి స్వాతంత్రం వచ్చిందని, దీనిని కలకాలం నిలుపుకోవాల్సిన బాధ్యత అందరిపైనా వుందని అన్నారు. 75 ఏళ్ల ప్రస్థానంలో దేశం ఎన్నో ఘనతలను అందుకుందని, ఎన్నో విజయాలను సాధించిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర అదనపు పోలీసు కమిషనర్ (సిట్ అం డ్ క్రైం) ఏ.ఆర్ శ్రీనివాస్, పరిపాలనా విభాగం జాయింట్ సిపి ఎం. రమేష్, ఐటి సెల్ డిసిపి సతీష్, టాస్క్‌ఫోర్స్ డిసిపి సునీతా రెడ్డి, సిటిసి డిసిపి చింతమనేని శ్రీనివాస తదితరులు పాల్గొన్నారు. కమాండ్ కంట్రోల్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తరువాత కమిషనర్ ఆనంద్ అక్కడి నుంచి నేరుగా గో ల్కొండ కోటలో సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో జరిగిన పంద్రాగస్టు వేడుకలకు హాజరయ్యారు. కాగా బషీర్‌బాగ్‌లో గల ఓల్డ్ కమిషనరేట్‌లో ఎడిఓ సుధారాణి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



గాంధీనగర్‌లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

## ఇంటింటికి జెండా కాదు ప్రతి పేదవాడికి ఇళ్లు అవసరం: ప్రొఫెసర్ కోదండరామ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), ఆగస్టు 15 ప్రభాతవార్త:** ఇంటింటికి జెండా కాదు కావాల్సింది, ప్రతి పేదవాడికి ఇళ్లు అవసరమని తెలంగాణ జనసమితి(టిజెఎస్) అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లో టిజెఎస్ గాంధీనగర్ డివిజన్ కన్వీనర్ గుండెల్లి రవిందర్ యాదవ్ ఆధ్వర్యంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జాతీయ పతాకాన్ని ప్రొఫెసర్ కోదండరామ్ ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు ఎం.నర్సయ్యగౌడ్, ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్, కవాడీగూడ డివిజన్ కన్వీనర్ అజయ్‌గౌడ్, ఎన్ఎస్ సెల్ అధ్యక్షుడు వెంకన్న, కార్యకర్తలు గుండెల్లి నరేందర్‌గౌడ్, ప్రభాకర్, సత్య నారాయణ తదితరులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఇండ్లు లేని పేద ప్రజలు ఎంతో మంది ఉన్నారని, వారందరికి ఇళ్లు అవసరమని అన్నారు. ఎందరో మహనీయులు త్యాగాల ఫలితంగానే నేడు ప్రభుత్వాలు ఫలాలు అనుభవిస్తున్నాయని, కానీ ప్రజలకు మాత్రం వారు చేసిందేమిలేదన్నారు.

## ఎయిర్‌పోర్టులో ఘనంగా వజ్రోత్సవాలు



జెండా ఆవిష్కరణలో మాట్లాడుతున్న ప్రదీప్ పనికర్

**శంషాబాద్, ఆగస్టు15,ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకలను హైదరాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎయిర్ పోర్టు సీఈవో ప్రదీప్ పనికర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహనీయులు చేసిన పోరాటాల ఫలితంగా లభించిన స్వాతంత్ర దేశంలో నేడు శరవేగంగా అభివృద్ధి పథంలో నడుస్తున్నామని అన్నారు. ప్రపంచంలోని అగ్రగామీ విమానాశ్రయా లలో హైదరాబాద్ విమానాశ్రయం కూడా ఉండటం గర్వించదగిన విషయమని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థులు సంస్కృతిగా కార్యక్ర మాలను నిర్వహించారు. ఎయిర్‌పోర్టు రక్షణ సిబ్బంది జాగిలాలతో విన్యాసాలు చేయించారు.

## హార్ ఘర్‌కా తిరంగా కొత్తది కాదు

### మేకిన్ ఇండియా సర్వే బెంగళూరు హిందుస్థాన్ రాఫెల్స్‌ను ఎందుకు క్యాన్సిల్ చేశారు: మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్రమోడి ఘర్‌ఘర్‌కాగా తిరంగా అనే నినాదం ఈ రోజు ఏదో కొత్తగా వచ్చినట్లుగా ఆర్భాటం చేస్తున్నారని, దేశ భక్తి అనేది ప్రజల రక్తంలో, నరనరాల ఉందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య అన్నారు. ఈ రోజు కొత్తగా వచ్చింది కాదన్నారు. కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈ నినాదంతోటి మోడి ఏదో చేస్తున్నామని దానితో ప్రజల్లో ముందుకు ఎందుకు వెళ్లారో చెప్పాలన్నారు. సావర్కర్ గురించి ప్రస్తావిం చారని, నెహ్రూ త్యాగ ఫలితం తొమ్మిది సంవత్సరాల స్వతంత్ర ఉద్యమంలో జైలు కెళ్లారని, ఆ కుటుంబంలో ప్రధానమంత్రులుగా చేసిన ఇద్దరు బలిదానాలు అయితే స్వాతంత్రానికి దేశభక్తికి సంబంధం లేదని అంటారా అన్నారు. గొప్పగా మాట్లాడుతున్న ప్రధాని మోడి ముఖ్యమంత్రి పదవి స్వీకరించిక ముందు ఎప్పుడైనా తిరంగ జెండా పట్టుకుని తిరిగారా? అంటూ ప్రశ్నించారు. తిరంగ జెండా పట్టుకోలేకపోతయిన వాళ్లంతా దేశభక్తులు కాదని అంటున్నారా? అని ప్రశ్నించారు. ప్రధానిగా బాద్యతలు చేపట్టిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తరువాత ఇచ్చిన హామీలు ఈ సందర్భంగా ఏమైనా ప్రస్తావించారా? అన్నారు. మేడిన్ ఇండియా గురించి మాట్లాడుతున్నారని, రాఫెల్ డీల్‌లో బెంగుళూరులో హిందుస్థాన్‌లో ఏరోనాటిక్స్‌లో 118 రాఫెల్స్ తయారు చేద్దామని చెప్పిన దానిలో మీరు వాటిని ఎందుకు రద్దుచేశారన్నారు. రష్యాతో దేశంలోనే ఆయుధాలు ఉత్పత్తి చేసే ఒప్పందం మీరు ఈ మద్య క్యాన్సిల్ చేశారు కదా, ఇది ఎందుకు కోసం క్యాన్సిల్ చేశారన్నారు. మేడిన్ ఇండియా వద్దా అన్నారు. ఈ దేశంలో హెచ్ఏఎల్, ఇండియన్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, భారత ఎలక్ట్రికల్స్ లిమిటెడ్- ప్రపంచంలో ఆయుదాలు తయారు చేస్తున్న 100 దేశాల్లో ఈ మూడు కంపెనీలు ఉన్నాయన్నారు. తూటాలు పేల్చి మేడిన్ ఇండియా అంటున్నారు. మేడిన్ ఇండియాకు అడ్డంకిగా మోడి తయారు అయ్యాడన్నారు. ఏ జాతీయ పార్టీ ఏం చేసిందో మీ కళ్లకు కనపడం లేదా అన్నారు. ప్రపంచంలో నెంబర్‌వన్ తయారీరంగంలో ఉన్న జర్మనీని బ్రిటన్, ఫ్రాన్స్ దేశాలను అధిగ మించి, చైనా, అమెరికా దేశాలతో సమానంగా ఉందన్నారు. అంటే చప్పట్లు, దీపాలు, గరిటలు కొడితే రాదన్నారు.

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై దాడి అమానుషం

### దాడిని ఖండించిన బిజెపి నేతలు



**హైదరాబాద్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రజాసంగ్రామ యాత్రకు ప్రజలకు బ్రహ్మ రథం పట్టి తమ గోడును చెప్పుకుంటూ ఉంటే అది చూసి ఓర్వలేకనే, ప్రజా సంగ్రామ యాత్రపై రాళ్లదాడి చేశారని బిజెపి నేతలు ధ్వజమెత్తారు. అరచేతిని అడ్డంపెట్టుకుని సూర్య కాంత్రి ఆపలేరని, టిఆర్ఎస్ ఆరిపోయే దీపం అన్నారు. ప్రజా సంగ్రామ యాత్రతో అధికార పార్టీ పీఠాలు కదిలిపోతున్నాయని బిజెపి శాసనసభ పక్షనేత రాజాసింగ్ అన్నారు. బండిసంజయ్ దాడిని ఆయన తీవ్రం గా ఖండించారు. అదేవిధంగా పాదయాత్ర ప్రముఖ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. గంగిడి మనోహర్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల రాంచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్, బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ, అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జె.సంగప్ప, దాసోజుశ్రవణ్‌తో పాటు పలువురు నేతలు ఖండించారు.

## నేటి నుంచి 22 వరకు స్వతంత్ర భారత వజ్రోత్సవ పుస్తక మహోత్సవం

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి ఈనెల 22 వరకు పుస్తక మహోత్సవం జరుగనుంది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మహాత్మా గాంధీ ఆలోచనా సరళిని ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఈ వజ్రోత్సవ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నట్లు సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ తెలిపారు. ఎల్బీ స్టేడియంలో నిర్వహించే ఈ పుస్తక మహోత్సవాన్ని మంత్రి శ్రీనివాసగౌడ్, వజ్రోత్సవ కమిటి చైర్మన్ కె.కేశవరావు, చీఫ్ సెక్రటరీ సోమేష్ కుమార్ ప్రారంభిస్తారు. కాగా, ఈ పుస్తక ప్రదర్శనలో మహాత్మా గాంధీ బోధించిన అహింసా మార్గం, మత సామరస్యం, జాతి సమైక్యత వంటి దృక్పదాలను 3 వేల పుస్తకాలను ప్రదర్శించనున్నారు. అదే విధంగా గాంధీ తత్వమైన సుస్థిర వ్యవసాయం, వైద్యం, కుటీర పరిశ్రమలు, చేనేత తదితర అంశాలను స్టాల్స్‌లో ప్రదర్శించనున్నారు. అలాగే, ప్రముఖ పబ్లిషర్స్‌కు చెందిన 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేశామనీ, ప్రతీ రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఉంటుందనీ, విద్యార్థులు, ప్రజలు ఈ ప్రదర్శనను జయప్రదం చేయాలని జూలూరు గౌరీశంకర్ విజ్ఞప్తి చేశారు.



హైదరాబాద్ బిజెపి కార్యాలయంలో జెండా ఆవిష్కరించిన నేతలు



సిపిఐ కార్యాలయంలో స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్న సురవరం సుధాకర్‌రెడ్డి, చాడా తదితరులు



టిఆర్ఎస్ భవన్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎంపి కె.కేశవరావు

# తెలంగాణ సంపద పేదరిక నిర్మూలనకు ఉపయోగపడాలి

## స్వాతంత్ర్య వేడుకల్లో డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్

**వికారాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు అసువులు బాసారని, వారి త్యాగ ఫలితమే నేడు మనం అనుభవిస్తున్న స్వాతంత్ర్యం అని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ అన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా



ప్రసంగిస్తున్న డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావుగౌడ్

అంగరంగ వైభవంగా జెండా పండుగను జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు సైతం గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తే రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తారో...అదే తీరుగా సీఎం కేసీఆర్ పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా 19 మండలాలు, 508 రెవెన్యూ గ్రామాలు, 578 గ్రామ పంచాయితీలు, నాలుగు మున్సిపాలిటీలతో వికారాబాద్ నూతన జిల్లాగా ఆవిర్భవించిందని గుర్తు చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో తెలంగాణ డయాగ్నస్టిక్ సెంటర్ ఏర్పాటు చేసి పేద ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిఖిల, జిల్లా ఎస్పీ ఎన్.కోటిరెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పి.సునీతారెడ్డి, వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, టీఎస్ కమిషన్ సభ్యులు శుభప్రద్‌పటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మురళీకృష్ణ, జడ్పీ వైస్ చైర్మన్ విజయకుమార్, వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుల్లపల్లి మంజుల తదితరులు ఉన్నారు.





## దేశాభివృద్ధిలో కీలకంగా విద్యుత్ రంగం

### పవర్ గ్రిడ్ సదర్న్ రీజియన్ ఇడి శ్రీవాస్తవ

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దేశాభివృద్ధిలో విద్యుత్ రంగం కీలకంగా వ్యవహరిస్తోందని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (పిజిసిఐఎల్) సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ శ్రీవాస్తవ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్‌లోని పవర్ గ్రిడ్ సదరన్ రీజియన్ ట్రాన్స్‌మిషన్ ప్రధాన కార్యాలయంలో సోమవారం శ్రీవాస్తవ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ పంపిణీలో పవర్ గ్రిడ్ ప్రాధాన్యతను గుర్తి నొక్కి చెప్పారు. ప్రత్యేకించి పవర్ ట్రాన్స్‌మిషన్‌కు సంబంధించి దాని లైన్ లభ్యతను సమర్థవంతంగా కొనసాగిస్తోందని చెప్పారు. దేశాభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడే రన్నింగ్ ప్రాజెక్టులకు విద్యుత్ పంపిణీ నిమిత్తం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ జరుపు కొంటున్న వేళ అభివృద్ధికి సంబంధించిన విషయంలో మనం పునరంకితం చేసుకోవాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్వయం ఆధారిత కోసం ప్రయత్నించాలని సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటకలోని కొంత భాగం కలిసి ఉన్న హైదరాబాద్ పవర్ గ్రిడ్ రీజియన్ పరిధిలో ఉద్యోగులందరూ హర్ ఘర్ తిరంగాను ఘనంగా జరుపు కోవడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పవర్ గ్రిడ్ రీజియన్ పరిధిలోని ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, దీప్ శిఖా మహిళా సమితిల ఆధ్వర్యంలో క్రీడలు, ఆటలను నిర్వహించారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు.

# 'ఎట్ హోమ్'కు హాజరు కాని సిఎం కెసిఆర్

≫ రాచకొండ సీపీ మహేశ్ భగవత్, మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు తదితరులు హాజరయ్యారు. పలు పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఎట్ హోం కార్యక్రమానికి కెసిఆర్ వెళతారని తొలుత ప్రచారం జరిగింది. కానీ ఆయన వెళ్లలేదు. మంత్రులు, టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా కనిపించలేదు. సిఎం గైర్హాజరుపై గవర్నర్ స్పందించారు. సిఎం కెసిఆర్ సాయంత్రం 6.55కి వస్తారని సిఎంఓ నుంచి సమాచారం వచ్చింది. తాను, హైకోర్టు సీజే సిఎం కెసిఆర్ కోసం 30 నిమిషాల పాటు ఎదురుచూసినట్లు గవర్నర్ తెలిపారు. అయితే గెస్టులు అంతా వెయిట్ చేస్తున్నారని ప్రోగ్రామ్ స్టార్ట్ చేశామని, కెసిఆర్ ఎందుకు రాలేదో తెలియదన్నారు. సిఎంవో ఆయన రావడం లేదన్న సమాచారం కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. బాసర ట్రిపుల్ ఐటీ సమస్యలపై కెసిఆర్ లేఖ రాశానని తమిళిసై తెలిపారు. విద్యార్థులకు, ప్రభుత్వానికి వారధిగా ఉండాలనేది తన ఉద్దేశ్యమని వివరించారు.

**కెసిఆర్‌కు కరోనా వచ్చిందేమో: రఘునందన్‌రావు**

ఎట్ హోమ్ కార్యక్రమానికి సిఎం కెసిఆర్ హాజరు కాకపోవడాన్ని బిజెపి నేతలు తప్పుబడుతున్నారు. తొలుత వస్తానని రాజ్‌భవన్ వర్గాలకు సమాచారం ఇచ్చి ఆ తర్వాత గైర్హాజరవడంపై సెటైర్లు వేస్తున్నారు. బిజెపి ఎమ్మెల్యే రఘునందన్‌రావు రాజ్‌భవన్‌లో కొద్దిసేపు తనను కలిసిన మీడియావారితో చిట్ చాట్ చేశారు. గవర్నర్ నిర్వహించిన కార్యక్రమానికి కెసిఆర్ రాకపోవడాన్ని తప్పుబట్టారు. కెసిఆర్‌కు కరనా వచ్చిందేమో అందుకే రాలేదు.15 రోజులు రెస్ట్ అని చెబుతున్నారు. కలెక్టరేట్ ఓపెనింగ్, మునుగోడు సభకు వెళ్లడేమో అని పేర్కొన్నారు. కెసిఆర్, కెటిఆర్ మీద ఈడిని ప్రయోగించం, చీకోటి కేసులో కొంత మంది ఎమ్మెల్సీలు బయటపడతారని పేర్కొన్నారు.





## దేశ అవసరాల దృష్ట్యా 10 కొత్త ప్రాజెక్టులు

### సింగరేణి సిఎండి శ్రీధర్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దేశ విద్యుత్ అవసరాలు తీర్చేందుకు రానున్న ఐదేళ్లలో సింగరేణి 10 కొత్త ప్రాజెక్టులను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ సిఎండి ఎన్ శ్రీధర్ తెలిపారు. తద్వారా 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించనున్నట్లు చెప్పారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జాతీయ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం మాట్లాడుతూ తమ సంస్థ దక్షిణ భారత దేశంలోని విద్యుత్ సంస్థలకు తగినంత బొగ్గును అందించి వాటి ప్రగతికి తోడ్పడిందన్నారు. ప్రస్తుతం 1200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని మరో 800 మెగావాట్లకు విస్తరింప చేయనున్నట్లు వివరించారు. తెలంగాణ రాక ముందు 12 వేల కోట్ల రూపాయల లావాదేవీలు ఉన్న సింగరేణి ప్రస్తుతం 26,500 కోట్ల రూపాయలకు చేరిందని తెలిపారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, లాభాల్లో మహారత్న కంపెనీలకు ధీటుగా వృద్ధిని నమోదు చేసిందని వెల్లడించారు. ఈ సందర్భంగా ఉత్తమ అధికారులైన డీజీఎం సత్తు సంజయ్, స్పోర్ట్స్ సూపర్ వైజర్ షాలెం కుమారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సలహాదారులు డిఎన్ ప్రసాద్, సురేంద్ర పాండే, ఈడి జెఆల్విన్, జీఎం కెసూర్యనారాయణ, ఎం సురేశ్ పాల్గొన్నారు.

## సమాఖ్య విలువలకు కేంద్రం తూట్లు

≫ అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన సిఎం చివరలో కేంద్రం రాష్ట్రాలకు చేస్తున్న అన్యాయంపై ప్రస్తావించారు. ఢిల్లీ గద్దె మీద కూర్చున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం సమాఖ్య విలువలకు తూట్లు పొడుస్తున్నదని, కూచున్న కొమ్మను నరుక్కున్న చందంగా రాష్ట్రాలను ఆర్థికంగా బలహీనపరిచే కుట్రలకు కేంద్రం పాల్పడుతున్నదని ఆరోపించారు. కేంద్రం పన్నుల రూపంలో వసూలు చేసే ఆదాయం మొత్తంలోంచి న్యాయబద్ధంగా 41శాతం వాటా రాష్ట్రాలకు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్రం ఈ వాటాను కుదించాలనే దురుద్దేశంతో పన్నుల రూపంలో కాకుండా సెస్సుల విధింపు రూపంలో దొడ్డిదారిన ఆదాయం సమకూర్చుకుంటున్నదని చెప్పారు. దీని ద్వారా రాష్ట్రాలకు 2022-23లో రావాల్సిన ఆదాయంలో 11.4శాతం ఆదాయానికి గండి కొడుతున్నదని తెలిపారు. అంటే రాష్ట్రాలకు 41శాతం వాటా రావాల్సిన చోట 29.6శాతం మాత్రమే ఇచ్చి అన్యాయం చేస్తున్నదన్నారు. ఇది చాలదన్నట్లు రాష్ట్రాల ఆర్థిక స్వేచ్ఛను దెబ్బతీస్తూ నిరంకుశంగా రకరకాల ఆంక్షలు విధిస్తున్నదన్నారు. రాష్ట్రాలు ఎఫ్ఆర్‌బిఎం పరిమితిలో తీసుకునే రుణాల మీద సైతం కేంద్రం కోతలు విధిస్తున్నదన్నారు.

సహకార సమాఖ్య స్ఫూర్తి అంటూ... ఆదర్శాలను వల్లించే కేంద్ర సర్కార్ ఆచరణలో మాత్రం అధికారాల కేంద్రీకరణకు పాల్పడుతున్నదని, ఇండియా ఈజ్ యూనియన్ ఆఫ్ స్టేట్స్ అని పేర్కొన్న రాజ్యాంగం తొలి అధికరణాన్నే అపహాస్యం పాలు చేస్తున్నదని తెలిపారు. ఉమ్మడి జాబితాలోని అంశాల్లో రాష్ట్రాలను సంప్రదించకుండానే నిర్ణయాలు తీసుకొని రాష్ట్రాల నెత్తిన రుద్దుతున్నదని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం మొండి చేయి చూపిస్తోందంటూ మండిపడ్డారు. రైతుల ఉద్యమంతో కేంద్రం రైతు నల్ల చట్టాలపై కేంద్రం వెనక్కి తగ్గిందన్నారు. టాక్సుల పేరిగ జనాన్ని దోచుకుంటోందని విమర్శించారు. చిన్న పిల్లలు తాగే పాలు, స్మశాన వాటిక నిర్మాణంపై కేంద్రం ఎడాపెడా పన్నులు వేస్తోందని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఉచితాలపై కేంద్రం రాష్ట్రాలను అవమానిస్తోందన్నారు. కేంద్రం తీరు వల్ల దేశ ఆర్థికాభివృద్ధి కుంటుపడిందని సిఎం కెసిఆర్ వ్యాఖ్యలు చేశారు. ద్రవ్యోల్బణం పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, అంతర్జాతీయ విపణీలో రూపాయి విలువ నానాటికి తీసికట్టు నాగంభొట్లు అన్న తీరుగా ఎన్నడూ లేనంతగా పడిపోయిందని పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం తీవ్రతరమౌతున్నదని, కేంద్రంలో అధికారంలో ఉన్న పెద్దలు తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విద్వేష రాజకీయాలతో ప్రజలను విభజిస్తూ నీచమైన ఎత్తుగడలను పాల్పడుతున్నారన్నారు.

తెలంగాణ అన్ని రంగాల్లో పెట్టుబడి వ్యయాన్ని అధికంగా చేస్తూ అనూహ్యమైన ప్రగతిని సాధిస్తూ పురోగమిస్తుంటే కొంతమంది అప్పులు ఎక్కువగా చేస్తుందని అవగాహనా రాహిత్యంతోనూ, కుట్ర పూరితంగానూ వ్యాఖ్యానిస్తున్నారని సిఎం కెసిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వెల్లడించిన లెక్కల ప్రకారం 2019-20 సంవత్సరానికి రాష్ట్ర అప్పులు మొత్తం 2లక్షల 25వేల 450 కోట్ల రూపాయలు, 2014లో తెలంగాణ ఏర్పడే నాటికి సమైక్య రాష్ట్రం నుంచి తెలంగాణకు సంక్రమించిన అప్పు రూ.75వేల 577 కోట్ల రూపాయలు ఉందన్నారు. అంటే తెలంగాణ ప్రభుత్వం చేసిన అప్పులు రూ.1 లక్షా 49వేల 873 కోట్లు అని వివరించారు. ఈ రుణ మొత్తాన్ని ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్మాణానికి, మౌలిక వసతుల కల్పనకు పెట్టుబడి వ్యయంగానే వినియోగించిందన్నారు. జిఎస్‌డిపిలో రుణ నిష్పత్తి పరిశీలిస్తే, దేశంలోని 28 రాష్ట్రాల్లో 22 రాష్ట్రాలు మన రాష్ట్రం కన్నా అధికంగా అప్పులు కలిగి ఉన్నాయని తెలిపారు. జిఎస్‌డిపిలో మన రాష్ట్ర అప్పుల నిష్పత్తి 23.5శాతం కాగా, జిడిపిలో దేశం అప్పుల నిష్పత్తి 50.4శాతం, ఏ రకంగా చూసినా రాష్ట్రం అప్పులు ఎఫ్ఆర్‌బిఎం చట్ట పరిమితుల్లోనే ఉన్నాయని తెలిపారు. ఈ వాస్తవాన్ని గమనించకుండా బురదజల్లడమే లక్ష్యంగా కొంత మంది రాష్ట్ర అప్పుల గురించి దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

తరతరాలుగా భారతదేశం నిలబెట్టుకుంటూ వస్తున్న శాంతియుత సహజీవనాన్ని విచ్ఛినం చేసేందుకు రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారే నేడు ఫాసిస్టు దాడులకు పాల్పడుతున్నారని, ఈ దుర్మార్గాన్ని చూసి కచ్చితంగా స్వాతంత్ర్య సమరయోధుల ఆత్మలు ఘోషిస్తున్నాయన్నారు. నేడు భారత దేశం ప్రతిష్టను దెబ్బతీసే వెకిలి మకిలి ధోరణులు చోటు చేసుకుంటున్నాయని, మన రాష్ట్రంలోనూ మత చిచ్చురేపి రేపాలనీ, శాంతిని, సామరస్య వాతావరణాన్ని దెబ్బ తీయాలనీ, తద్వారా అభివృద్ధిని ఆటంకపరచాలనీ విచ్ఛినకర శక్తులు ప్రయత్నిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని మేధావి లోకం, యువకులు, విద్యార్థులు, ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండి ఈ శక్తుల కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల కామన్‌వెల్త్ క్రీడల్లో 61 పతకాలను సాధించిన భారత క్రీడాకారులకు నేను మనస్ఫూర్తిగా శుభాకాంక్షలను తెలుపుతున్నానని, రాష్ట్రానికి 6 పతకాలను సాధించి పెట్టిన తెలంగాణ క్రీడాకారులకు ప్రత్యేకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు ప్రకటించారు.



## తక్కువ వ్యవధిలో నంబర్ 1 స్థానానికి ఎదిగిన ఎంఈఐఎల్: చైర్మన్ రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** అతి తక్కువ వ్యవధిలో ఎంఈఐఎల్ సంస్థ దేశంలోనే నెంబర్ 1 స్థానానికి ఎదిగిందని ఆ సంస్థ చైర్మన్ పీపీ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో సోమవారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ల్యాండ్ రిగ్‌పై జాతీయ పతాకాన్ని ఆయన ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజా సంక్షేమం దృష్ట్యా మౌళిక వసతులు, పవర్, హైడ్రోకార్బన్స్ ప్రాజెక్టులను నిర్మించినట్లు చెప్పారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా 6 నుండి 12 తరగతి వరకూ 750 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి 75 వేల రూపాయలను అందించనున్నట్లు ప్రకటించారు. అర్హులైన విద్యార్థుల ఎంపిక నిమిత్తం ఒక కమిటీని నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఐసిలో స్వాతంత్ర్య వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** ఎల్ఐసీ హైదరాబాద్ డివిజనల్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ ఎం జగనాధ్ జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ అజాది కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా పలు కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఉద్యోగులు, ఏజెంటు, పాలసీదారులు అందరూ సమిష్టిగా పాల్గొనడమే ఈ వేడుకల స్ఫూర్తన్నారు. అందరి ప్రయోజనాల కోసం దేశాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ విద్యానంద్ ఝూ తదితరులు పాల్గొన్నారు.

## జెండా పండుగలో తీవ్ర విషాదం

### విద్యుత్ ఘాతంతో ఇద్దరు మృతి: మరొకరికి గాయాలు



మృతులు అనిల్ కుమార్, తిరుపతయ్య

**పటాన్‌చెరు, ఆగస్టు15, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు తీవ్ర విషాదం నింపాయి. స్వాతంత్ర్య వజ్రోత్సవాల్లో భాగంగా జెండా పండుగను ఘనంగా జరుపుకుంటున్న వేల 11/33 కెవి విద్యుత్ లైన్ మాటున ఇద్దరూ బలవగా, మరొకరు గాయాలతో బయటపడడంతో అప్పటిదాకా ఆనందోత్స వాలతో ఉన్న ఆ కాలనీలో ఒక్కసారిగా విషాద ఛాయలు నెలకొన్నాయి. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లా, ఆలేరు నియోజకవర్గం టంగుటూరు గ్రామానికి చెందిన పూజారి అనిల్‌కుమార్ గౌడ్ (40)కొన్నేళ్ల క్రితం వచ్చి మండలంలోని ఇంద్రేశం ఆనంద్‌నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటు ఏటీఎం మెయింటెనెన్స్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. కడప జిల్లాకు చెందిన కల్పకూరి తిరుపతయ్య (42) రోజువారి పని చేసుకుంటూ అదే కాలనీలో నివాసం ఉంటున్నాడు. కాగా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం పదిన్నర గంటల సమయంలో జెండా ఎగురవేస్తుండగా ప్రమాదవశాత్తు 11/33 కెవి విద్యుత్తు షాక్ రావడంతో అనిల్ కుమార్, తిరుపతయ్యలు విద్యుత్ ఘాతంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. మరొకరు ధనుం జయరావుకి గాయాలు కావడంతో విషయం తెలుసుకున్న పటాన్‌చెరు డీఎస్పీ భీమ్‌రెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో పట్టణంలోని మాక్స్‌క్యూ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఇద్దరు మృతిచెందినట్లు వైద్యులు ధృవికరించారు. మరొకరు చికిత్స పొందు తున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఇద్దరు మృతిచెందడం పట్ల పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబీకులకు ధైర్యం చెప్పారు. కాలనికి చెందిన రాజు కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామనాయుడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# దేశంలో 13 బంగారు గనుల విక్రయానికి గ్రీన్ సిగ్నల్

### ఆంధ్రప్రదేశ్‌లోని 10 గోల్డ్ మైన్లకు ఈ నెలలో వేలం

### ప్రైవేటు చేతుల్లోకి సింగరేణి బొగ్గు బ్లాక్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** మైనింగ్ రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు, దేశ స్థూల జాతీయ ఆదాయాన్ని పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం దేశంలోని పలు బంగారు గనులను విక్రయించే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా దేశంలోని ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని 13 బంగారు గనులను రానున్న రోజుల్లో విక్రయించనుంది. ఈ బంగారు గనుల్లో ఆంధ్రప్రదేశ్‌లోనే 10 ఉండగా, మిగిలిన 3 ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విక్రయించనున్న బంగారు గనుల్లో రామగిరి నార్త్ బ్లాక్, బోకసంపల్లి నార్త్ బ్లాక్, బొకసంపల్లి సౌత్ బ్లాక్, జవకుల-ఎ, జవకుల-బి, జవకుల-సి, జవకుల-డి, జవకుల-ఒ, జవకుల-ఎఫ్ బ్లాక్‌లు ఉన్నాయి. వీటిలో 5 బంగారు గనులకు ఈ నెల 26వ తేదీన వేలం వేయనున్నారు. మిగిలిన 5 బంగారు గనులను ఇదే నెల 29వ తేదీన వేలం వేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు గాను మార్చి నెలలోనే టెండర్లను అహ్వానించినట్లు కేంద్ర గనుల మంత్రిత్వశాఖ అధికారులు వెల్లడించారు. అలాగే ఉత్తరప్రదేశ్ లోని బంగారుగనులకు కూడా ఇదే నెలలో వేలం నిర్వహించనున్నట్లు తెలిసినా దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల కాలేదు. ఉత్తరప్రదేశ్‌లోని మూడు గనుల్లో రెండు సోనపహారి బ్లాక్, దుర్వ బియాందండ్ బ్లాక్, సోన్‌భద్ర బ్లాక్‌లు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మూడు బ్లాక్‌ల వేలానికి టెండర్లను అహ్వానిస్తూ మే 21వ తేదీన నోటీసులు జారీ అయ్యాయి. కాగా దేశంలో ఖనిజాల వేలం నిబంధనల్లో సవరణలు పోటీని ప్రోత్సహిస్తాయని, తద్వారా బంగారు గనులకు సంబంధించి బ్లాక్‌ల విక్రయంలో మరింత భాగస్వామ్యానికి అవకాశం ఉంటుందని కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఇప్పటికే రాష్ట్రాలు 199 మినరల్ బ్లాక్‌లను వేలం వేశాయన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 45 మినరల్ బ్లాక్‌లను అమ్మకానికి పెట్టినట్లు సంబంధిత అధికారులు తెలిపారు. 2015 సంవత్సరంలో మైనింగ్ చట్టంలో సవరణలు చేసిన తర్వాత వేలం మార్గం ద్వారా ఖనిజ బ్లాక్‌ల కేటాయింపు ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. తద్వారా వచ్చే ఆదాయంలో రాష్ట్ర ప్రభుత్వాలు మంచి వాటాను పొందుతున్నాయని వెల్లడించారు. మరోపక్క కేంద్రం ఇటీవల నిర్వహించిన వేలంలో సింగరేణికి చెందిన కొత్తగూడెం జిల్లాలోని కోయగూడెం-3 బ్లాక్‌ను అరో కోల్ ప్రైవేటు సంస్థ దక్కించుకుంది. కోయగూడెం-3 బ్లాక్ కోసం అరో కోల్ సంస్థ ఒక్కటే దరఖాస్తు చేసుకుంది. దీంతో తొలి రెండు రౌండ్లలో అరో కోల్ సంస్థకు టెండర్ కమిటీ ఖరారు చేయ లేదు. నిబంధనల ప్రకారం మూడోసారి డీమ్డ్ టు బి యాక్సెప్టెడ్ పద్ధతిన విధిగా ఈ టెండర్‌ను ఖరారు చేయాల్సి వచ్చింది. రిజర్వు బొగ్గు పరిమాణాన్ని పరిగణలోకి తీసుకుని ఈ కాంట్రాక్టు 20,750 కోట్ల రూపాయలకు ఖరారు అయింది. ఇది అరబిందో గ్రూపునకు చెందిన సంస్థ కావడం విశేషం. సింగిల్ టెండర్ ద్వారా అరో కోల్ సంస్థ కోయగూడెం-3 గని లీజును చేజిక్కించుకుంది. సుమారు 8.32 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న ఈ బ్లాక్‌లో దాదాపు 119.80 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు ఉన్నట్లు అంచనా. దీన్ని 30 సంవత్సరాలకు లీజుకు తీసుకున్న అరో కోల్ సంస్థ దాదాపు 113.46 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనుంది. కాగా మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ యాక్ట్ 1957 ప్రకారం కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం మేరకు దేశ వ్యాప్తంగా పలు బొగ్గు బ్లాక్‌లను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం గెజిట్ జారీ చేసింది. ఇందులో భాగంగా సింగరేణి కాలరీస్ పరిధిలోని 4 బొగ్గు బ్లాక్‌లకు టెండర్ ప్రక్రియను చేపట్టింది. వీటిలో కల్యాణఖని బ్లాక్ నెంబర్ 6, శ్రావణ్‌పల్లి, కోయగూడెం బ్లాక్ నెంబర్ 3, సత్తుపల్లి బ్లాక్ నెంబర్ 6 బొగ్గు బ్లాక్‌లు ఉన్నాయి. కోయగూడెం బ్లాక్‌కు అరో కోల్ సంస్థ టెండరు దాఖలు చేయగా, మిగిలిన 3 బొగ్గు బ్లాక్‌లకు ప్రైవేటు సంస్థలు ఏవీ ముందుకు రాలేదు. దీంతో ఒక్క కోయగూడెం బ్లాక్ 3ను అరో కోల్ సంస్థ దక్కించుకున్నట్లు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

## ఆర్టీసి ఉద్యోగులకు రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించేందుకు కృషి: టీఎస్ ఆర్టీసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అతి త్వర లోనే రూ.1000 కోట్ల ఉద్యోగుల బకాయిలను చెల్లిస్తామని టీఎస్ ఆర్టీసి చైర్మన్, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. సంస్థ ఉద్యోగులకు సెప్టెంబర్ నెల జీతభత్యాలతో పాటు మరో డిఏను అందిస్తామని ప్రకటించారు. 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్ బస్‌భవన్ ప్రధాన కార్యాలయంలో ఆర్టీసి పోలీసు సిబ్బంది కవాతును, గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గోవర్ధన్ మాట్లాడుతూ ఆర్టీసిలో బిడబ్ల్యుఎస్ పథకం ద్వారా త్వరలోనే ఉద్యోగాలను భర్తీచేస్తామని ప్రకటించారు. రానున్న రోజుల్లో 300 ఎలక్ట్రికల్ బస్సులను ప్రారంభిస్తామనీ, కమర్షియల్ రెవెన్యూ కోసం అతి త్వరలోనే సొంత బ్రాండ్‌తో జీవా వాటర్ బాటిళ్లను కూడా ప్రారంభించుకుంటున్నామని చెప్పారు.



## ఎస్పీడీసీఎల్ పటిష్టం: సిఎండి రఘుమారెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థను (ఎస్పీడీసీఎల్) 13,129 కోట్ల రూపాయలతో పటిష్టపరచినట్లు ఆ సంస్థ సిఎండి జి రఘుమారెడ్డి చెప్పారు. హైదరాబాద్ మింట్‌కాంపౌండ్ వద్ద గల ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం నాటికి నూతనంగా 33/11 కెవీ సామర్థ్యం కలిగిన 556 సబ్ స్టేషన్లు, 774 కిలోమీటర్ల భూగర్భ కేబుల్ 1318 పిటిఆర్‌లు, 2,40,839 డిటిఆర్‌లతోపాటు, నూతన లైన్లు వంటి వాటిని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాష్ట్రం ఏర్పడేనాటికి 29644 మిలియన్ యూనిట్లుగా ఉన్న ఇన్‌పుడ్ ఎనర్జీ ప్రస్తుతం 58 శాతం పెరుగుదలతో 46794 మిలియన్ యూనిట్లకు చేరిందని వివరించారు. అలాగే పంపిణీ నష్టాలను 9.14శాతానికి తగ్గించగా, 95.84 శాతంగా ఉన్న రెవెన్యూ వసూళ్ల 98.39 శాతానికి చేరాయని పేర్కొన్నారు. ఇవన్నీ సంస్థ అంతర్గత సామర్థ్యం పెంపునకు చేసిన కృషికి సంకేతం అని చెప్పారు. సెక్షన్ అధికారులు తమ పరిధిలోని యూడీసీ, ఓఎస్ఎల్ సర్వీసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, వాటిని తనిఖీ చేసి బిల్లులు జారీ చేయాలని, తద్వారా సంస్థ రెవెన్యూ పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్లు టి.శ్రీనివాస్, కె రాములు, జి పర్వతం, సిహెచ్ మదన్‌మోహన్‌రావు, ఎస్ స్వామిరెడ్డి, పి నరసింహారావు, జి గోపాల్, సివిఐ కె మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



**తెలంగాణ సినిమా ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో**

హైదరాబాద్‌లోని తెలంగాణ సినిమా ఇండస్ట్రీస్ ఎంప్లాయిస్ ఫెరేషన్ కార్యాలయంలో 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఫెడరేషన్ అధ్యక్షులు వద్దే కరుణాకర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి హెచ్ మూర్తి, తెలంగాణ సినిమా అండ్ స్టిల్ ఫోటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షులు కర్ణకోట వెంకటేష్, ప్రధాన కార్యదర్శి అవలూరు రవీందర్, తెలంగాణ సినిమా అండ్ టీవీ డబ్బింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ ప్రెసిడెంట్ కవితాఘ్నోస్సీ, తెలంగాణ సినిమా అంట్ టీవీ పెయింటింగ్ ఆర్టిస్ట్స్ యూనియన్ ప్రెసిడెంట్ రాజన్, ట్రెజరర్ సాయికుమార్, తెలంగాణ సినిమా వెల్డింగ్ యూనియన్ ప్రెసిడెంట్ సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఈవెంట్ పిక్స్
స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో సెలబ్రిటీలు













# 'సలార్' న్యూపోస్టర్ విడుదల



పాన్ఇండియాస్టార్ హీరో ప్రభాస్, డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ మూవీ సలార్.. యావత్ సినీ పరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రమిది.. ప్రముఖ నిర్మాణసంస్థ హోంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.. భారీ అంచనాల మధ్య సెప్టెంబర్ 28న ఈచిత్రం విడుదల కాబోతోంది.. ప్రభాస్ ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది..కాగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభాస్ న్యూలుక్ పోస్టర్‌ను విడుదల చేశారు.. మాస్ యాక్షన్ అడ్వెంచరస్ మూవీగా తెరకెక్కిస్తున్నారు.. ఇండియా సహా యూరప్, మిడిల్ ఈస్ట్, ఆఫ్రికా దేశాల్లో ఈచిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాభై శాతానికి పైగా షూటింగ్ పూర్తిచేసుకుంది.. ఈచిత్రంలో విఎఫ్‌ఎక్స్‌కు చాలా ప్రాధాన్యత ఇస్తున్నారు.. ప్రేక్షకులు, అభిమానుల అంచనాలకు ధీటుగా ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# నా కెరీర్‌లో బెస్ట్ ఓపెనింగ్: నితిన్




హీరో నితిన్ మాస్‌యాక్షన్ మూవీ మాచర్ల నియోజకవర్గం.. భారీ మాస్ కమర్షియల్ సక్సెస్‌ను అందుకుంది. శ్రేష్ఠమూవీస్ బ్యానర్‌పై సుధాకర్‌రెడ్డి, నికితా రెడ్డి నిర్మాతలుగా ఎం ఎస్ రాజశేఖర్‌రెడ్డి దర్శకత్వంలో కృతిశెట్టి, కేథరిన్ థ్రెస్సా హీరోయిన్లుగా నటించారు. ఆగస్టు 12న ఈచిత్రం విడుదలైంది.. ఈసందర్భంగా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలుపుతూ కార్యక్రమం నిర్వహించింది.. హీరో నితిన్ మాట్లాడుతూ, తెలుగు ప్రేక్షఖులకు చాలా థాంక్స్ అన్నారు. నా కెరీర్‌లోనే బెస్ట్ ఓపెనింగ్స్ ఇచ్చారన్నారు. మీ ప్రోత్సాహం ఎపుడూ ఉంటుందని నమ్మానని అన్నారు. నా నమ్మకం మాచర్ల నియోజకవరగనం మరోసారి నిజమైందన్నారు. చాలా కాలం తర్వాత నా జోర్‌లోని మార్చి యాక్షన్‌లోకి వెళ్లానని అన్నారు. దీన్ని ప్రేక్షకులు అద్భుతంగా రిసీవ్ చేసుకున్నారన్నారు.. కార్యక్రమంలో కృతిశెట్టి, నిఖితా రెడ్డి, చిత్ర దర్శకుడు రాజశేఖరరెడ్డి ప్రసాద్ మూరెళ్ల, సాహి సురేష్ తదితరులు మాట్లాడారు.

# ఫుల్లీ లోడెడ్ మసాలా మూవీ

పాన్ఇండియా స్టార్ విజయ్ దేవరకొండ, సౌత్ బ్రేకింగ్ డైరెక్టర్ పూరి జగన్నాద్ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్ఇండియా మూవీ లైగర్.. ఆగస్టు 25న విడుదల కాబోతోది.. మైక్‌టైసన్ ఇందులో కీలకపాత్రలో నటిస్తున్నారు. పూరి కనెక్ట్స్ , బాలీవుడ్ స్టార్ ప్రొడక్షన్ సంస్థ ధర్మ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.. పూరి జగన్నాద్, చార్మికౌర్, కరణ్‌జోహార్, అపూర్వ



మెహతా సంయుక్తంగా ప్రతిష్టాత్మకంగా ఈచిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, పాటలు ఈచిత్రంపై దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేశాయి.. తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో ఆగస్టు 25న ప్రేక్షకుల ముందుకు ఈచిత్రం రాబోతోంది.. ఈనేపథ్యంలో యూనిట్ వరంగల్-హన్మకొండ ఖాజీపేటలోని సత్యసాయి కన్వెన్షన్ హాలులో గ్రాండ్‌గా టూర్ నిర్వహించింది..స్థానిక ప్రముఖులు , రాజకీయ నేతలు పాల్గొన్నారు. విజయ్ దేవరకొండ మాటాడుతూ, ప్రేక్షకుల ఆదరణ మర్చిపోలేనిదని, మళ్లీ ఆగస్టు 25న మీ ప్రేమను తిరిగివ్వాలని అన్నారు. కార్యక్రమంలో పూరి జగన్నాథ్, తెలంగాణ మంత్రి యర్రబెల్లి దయాకర్, అనన్యపాండే, చార్మికౌర్, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, వినయ్ భాస్కర్, వరంగల్ ఎంపి పసునూరి దయాకర్, డిప్యూటీ మేయర్ రిజ్వాన్ షమన్, విష్, ఆలీ, రామ్ మిర్యాల, సునీల్ కశ్యప్, గెటప్ శీను, వరంగల్ శ్రీను పాల్గొన్నారు.

# 'హత్య' ట్రైలర్



తమిళ హీరో విజయ్ అంటోనీ నటిస్తున్న కొత్త చిత్రం హత్య... ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ మూవీగా తెరకెక్కుతోంది.. ఈచిత్రంలో డిటెక్టివ్ పాత్రలో విజయ్ అంటోనీ కన్పించనున్నారు. హీరోయిన్‌గా రితికా సింగ్ ఓ కీలకపాత్రలో నటిస్తోంది.. లోటస్ పిక్చర్స్‌తో కలిసి ఇన్ఫినిటీ ఫిలిం వెంచర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈచిత్రానికి కమల్ బోరా, జి.ధనుంజయన్, ప్రదీప్ బి, పంకజ్ బోరా, విక్రమ్‌కుమార్, తాన్ శ్రీ దొరైసింగమ్ పిళ్లై, సిద్ధార్థ్ శంక్, ఆర్వీఎస్ అశోక్ కుమార్ నిర్మాతలు.. ఈచిత్రంలో ట్రైలర్‌ను హీరో నాని సోషల్‌మీడియా ద్వారా విడుదల చేశారు. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో సందడిగా మీడియాతో మాట్లాడారు.. నిర్మాతలు బెల్లంకొండ సురేష్, జీవిజీ రాజు, ప్రముఖ దర్శకుడు హేమంత్ మధుకర్ తదితరులు పాల్గొన్నారు. హీరోయిన్ మీనాక్షిచౌదరి, హీరోయిన్ రితికా సింగ్, దర్శకుడు బాలాజీకుమార్, హీరో విజయ్ అంటోనీ మాట్లాడారు.

# ఛాలెంజ్ విరిసే పాత్రల కోసం చూస్తున్నా...

దక్షిణాదిన ఇటు హీరోయిన్‌గా అటు ప్రాధాన్యత ఉన్న చిత్రాల్లో నటిస్తూ మెప్పిస్తున్న హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్.. ఈ భామ ఇపుడు కార్తికేయ2 తో మరోసారిప్రేక్షకుల ముందుకు వచ్చింది. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ బ్యానర్లపై యంగ్ హీరో నిఖిల్, అనుపమ పరమేశ్రన్ జంటగా రూపొందిన చిత్రం కార్తికేయ 2. ఈచిత్రానికి చందు మొండేటి దర్శకత్వం వహించారు. ఈనెల13న థియేటర్లలో విడుదలైన ఈమూవీ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ఈసందర్భంగా అనుపమ పరమేశ్వరన్ మీడియాతో మాట్లాడింది. ఆమె మాటల్లోనే.. ఈసినిమాలో నా పాత్రకు థియేటర్లలో ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. అదే నాకు మంచి ఎనర్జీని ఇచ్చినట్టు అన్పించింది.. ఈసినిమా చూసిన వారందూ చాలా ఎంజాయ్ చేస్తూ చాలా బాగుందని చెప్పటం సంతోషంగా ఉంది.. చందు గారు ఈస్టోరీచెప్పినపుడు చాలా ఎగ్జయిట్ అయ్యాను. ఈసినిమా చేద్దాం అనుకున్నాను. ప్రతి కథకు కంటెంట్ అనేది చాలా ముఖ్యం.. చిన్న సినిమా పెద్ద సినిమా అంటూ ఏమీ ఉండదు.. మనుషుల్లో ఉన్న మంచి తనాన్ని నేను దైవంగా భావిస్తాను.. ఈ



మూవీలో కృష్ణ తత్త్వం కాన్సెప్ట్ నాకు బాగా నచ్చింది.. అందుకే ఈసినిమా కథ నచ్చటంతో నాకొచ్చిన కొన్నిప్రాజెక్టులను కూడ వదులుకున్నాను.. లొకేషన్స మారూతూ షూటింగ్ చేయటంతో

చాలా కష్టపడాల్సి వచ్చింది. అలాగే మంచు గడ్డకట్టే ప్రదేశంలో షూటింగ్ చేయటంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొ నాల్సి వచ్చింది.. జేమ్స్‌బాండ్ టైప్‌లో ఎంట్రీ ఇచ్చావు అంటు న్నారు.. అలాగే కొన్ని చోట్ల హీరోను డామినేట్ చేసే విధంగా నా పాత్ర ఉంది అనటంలో వాస్తవం లేదు. అయితే కథకు తగ్గట్టుగానే నా పాత్ర ఉంటుంది.రౌడీ బాయ్స్‌లో ఎక్కువ గ్లామర్‌గా ఉండాలని చేసిన పాత్ర కాదు. సిట్యువేషన్ డిమాండ్ మేరకు ముద్దు సీన్స్‌లో నటించాను.. 75 ఏళ్లుఅయినా కూడ విమెన్ ఎంపవర్ మెంట్ అనేది ఈక్వల్‌గా ఉంది అనుకుంటు న్నాను.. అయితే పదేపదే మహిళలు వెనుకలబడి ఉన్నారు అని చెప్పటం వలన ఇంకా మహిళలు వెనుకబడి ఉన్నారనే భావన గురి చేస్తుంది.. ఇపుడు మహిళలు మగవారితో సమానంగా ముందుకు వెళ్తున్నారు నా చిన్నపుడు స్కూటీపై ఆగస్టు 15న ఇండియన్ ఫ్లాగ్ పెట్టుకుని తిరిగేదానిన... నేను ఎక్సరిమెంటల్ సినిమాలు చేయటానికి ఎక్కువ ఇంట్రెస్ట్ చూపుతాను.. నాకొచ్చే పాత్రలు ఛాలెంజింగ్ ఉండాలి అలాంటి పాత్రలు నాకు నచ్చు తాయి.. ఒక ఆర్టిస్టుగా ఎన్ని లాంగ్వేజిస్ కుదిరితే అన్ని లాంగ్వే జెస్ చేయాలని ఉంటుంది... అది నాకు నిర్మాతకు, దర్శకులకు కూడ స్పాన్ పెరుగుతుంది.. ఇంతకుముందు టాలీవుడ్ అంతా బాలీవుడ్ వైపు చూసేవారు.. అయితే ఇపుడు రాజమౌళి గారు వచ్చిన తర్వాత బాహుబలి, కెజిఎఫ్ సినిమాలా తర్వాత ఆ ట్రెండ్ మారిపోయింది.. ఇపుడు అంతా కమెడియన్ సినిమా అయ్యింది.. ప్రస్తుతం రెండుచిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి.. మరో రెండు చిత్రాలు చర్చల్లో ఉన్నాయి. వాటి వివరాలు త్వరలో తెలియ జేస్తాను.. అలాగే 18 పేజెస్ సినిమా వారం రోజుల షూటింగ్ పెండింగ్ ఉంది.

# 'వాంటెడ్ పండుగాడ్' రిలీజ్ డేట్




ప్రముఖ దర్శకుడు కె.రాఘవేంద్రరావు సమర్పణలో యునైటెడ్ కె.ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సునీల్, అనసూయ భరద్వాజ్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న చిత్రం వాంటెడ్ పండుగాడ్.. శ్రీధర్‌సీపాన దర్శకత్వం వహిస్తున్నారు. సాయిబాబ కోవెలమూడి, వెంకట్ కోవెలమూడి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. ఈచిత్రం ఆగస్టు 19న విడుదల కాబోతోంది.. ఈసినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు.. దర్శకేంద్రుడు కె.రాఘవేంద్రరావు మాట్లాడుతూ, ఎంటర్‌టైనింగ్‌మూవీగా ఉంటుందని ఆగస్టు 19న రిలీజ్ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సునీల్, అనసూయ, సుడిగాలి సుధీర్, డైరెక్టర్ హరీశ్‌శంకర్, చిత్ర దర్శకుడు శ్రీధర్ సీపాన, రైటర్ బివిఎస్ రవి, తనికెళ్ల భరణి, శ్రీనివాస్‌రెడ్డి,పృధ్వీ, శ్రీలీల, హీరో రోషన్ మాట్లాడారు.


# మంచి పేరొస్తుందని భావిస్తున్నా..



టాలీవుడ్‌లో అందరి దృష్టిని ఆకర్షిస్తూ నాలుగు కథలతో ఇంట్రెస్టింగ్ మూవీ రాబోతోంది. రచన మీడియా వర్క్స్ సమర్పణలో ఎఫ్3 ప్రొడక్షన్స్ , ఫుట్ లూస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మిస్తున్న చిత్రం కమిట్‌మెంట్.ఇందులో తేజస్వి మడివాడ ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆమె మీడియాతో మాట్లాడారు.. ఈ సినిమాలో నాలుగు స్టోరీలు ఉన్నాయని తెలిపారు. అందులో ఒకటి నాది స్టోరీ ఇందులో నా క్యారెక్టర్ సినిమా ఛాన్స్ అవకాశాల కోసం తిరిగే క్యారెక్టర్ నిజం చెప్పా లంటే శ్రీరెడ్డిగారి క్యారెక్టర్‌కు దగ్గరగా ఉంటుంది.. ఈసినిమాలో స్టోరీ, ఇండస్ట్రీలో జరిగే నాచు రాలిటీకి దగ్గరగా ఉంటుంది.. అందుకే ఈస్టోరీ వినగానే ఓకే చేశాను.. ఈసినిమా ట్రైలర్‌ను చూస్తే అలా అన్పిస్తుందా కానీ ఇది నిజానికి సినిమాలో మంచి కంటెంట్ , మెసేజ్ ఉంటుందన్నారు.. అందరూ సిఇమా ఇండస్ట్రీని బద్నామ్ చేయ్యొద్దు అని చెప్పేదే ఈసినిమా మెసేజ్. ఈసినిమా రియాలిటీకి దగ్గరగా ఉంటుంది. ఈసినిమా ద్వారా నాకు మంచి పేరొస్తుందని భావిస్తున్నాను.. ఈసినిమా ఇండస్ట్రీ నాకు ఫుడ్ పెట్టింది.. నాకు ఒకదారి చూపించింది.. నేను జర్నలిజం చేశాను.















vaartha.com



# జెండా రంగులున్న 'పొలిటికల్ పుట్టు'

**పొరుగు రుచి:** తమ పార్టీ జెండా రంగుకు జతయ్యేలా దుస్తులను ధరించే కార్యకర్తలను చూసుంటారు. కానీ కేరళలో జెండాకు జతయ్యే రంగులున్న 'పొలిటికల్ పుట్టు'ను ఎంతో ఇష్టంగా తింటున్నారు. పుట్టు తెలుసుగానీ కొత్తగా ఈ పొలిటికల్ పుట్టేంటని అనుకుంటున్నారు కదూ.. తిరువనంతపురంలోని హోటల్ యజమాని జుల్ఫికర్ రంగురంగుల పుట్టును ప్రత్యేకంగా అందిస్తున్నాడు. మిగతా వారికంటే భిన్నంగా పుట్టును అందిం చాలనే ఉద్దేశంతో ఈ ప్రయోగానికి శ్రీకారం చుట్టాడు. క్యారెట్, బీట్‌రూట్, బీన్స్, రాగి, మొక్కజొన్నల సహజ సిద్ధమైన రంగులనే పుట్టుకు ఉపయో గిస్తాడు. భార్య సహకారంతో ఆరు రకాల పుట్టులను రుచికరంగా వండి వడ్డిస్తున్నాడు. రేటు కూడా ఇరవై నుంచి నలభై రూపాయలే.❒





స్వాతంత్ర్య అమృత మహోత్సవం

# బ్రిటిష్ సైన్యంతో పోరాడిన వీరవనిత

**ఒకవైపు వేల సంఖ్యలో బ్రిటిష్ సైన్యం.. మరోవైపు వందల్లో కిత్తూరు సైనికులు. ఆ పోరుపై నాడు దేశమంతటా ఆసక్తికర చర్చ. గంటల వ్యవధిలోనే నలిపేస్తామని ప్రగల్భాలు పలికిన ఆంగ్లేయులు.. ఘోరంగా ఓడిపోయారు. ఈ యుద్ధంలో కిత్తూరు సైన్యానికి నాయకత్వం వహించారు రాణి చెన్నమ్మ.**

కర్ణాటకలోని బెలగావి జిల్లా కిత్తూరు సంస్థానాన్ని 17,18 శతాబ్దాల్లో లింగాయత్ దేశాయ్ వంశస్థులు పాలించారు. సంస్థానాధీశుడు మల్ల సర్జా భూపతి కాలంలో మరాఠా రాజ్యంతో సత్సంబంధాలు ఉండేవి. దాంతో టిప్పుసుల్తాన్ ఆయన్ని 1785లో బందీగా పట్టుకెళ్లగా ఆయన భార్య రుద్రమ్మ మంత్రాంగం నెరపి విడుదల చేయించింది. అనంతరం ఆయన బ్రిటిషర్లతో స్నేహాన్ని కొనసాగించాడు. మరాఠా పీష్వాలతో వైరం పెరగడంతో సమీప కాకతి సంస్థానాధీశుడితో మైత్రికి ప్రయత్నించి ఆయన కూతురు 15 ఏళ్ల చెన్నమ్మను రెండో పెళ్లి చేసుకున్నాడు. 1778లో పుట్టిన చెన్నమ్మ చిన్న వయసులోనే కత్తిసాము, గుర్రపు స్వారీ నేర్చుకుంది. మల్ల సర్జా, రుద్రమ్మలకు శివలింగ పుట్టాడు. చెన్నమ్మకూ కుమారుడు పుట్టాడు. తన అంతరంగీకుల మోసంతో మల్లసర్జా 1816లో పీష్వాల చేతిలో హతమయ్యాడు. ఆ విషాదంతో రుద్రమ్మ కూడా మృతి చెందింది. శివలింగకు పట్టాభిషేకం చేసి పాలనలో చేదోడుగా ఉండేది చెన్నమ్మ. అనూహ్యంగా 1824లో శివలింగ, చెన్నమ్మ కొడుకు రోజుల వ్యవధిలోనే అనారోగ్యంతో కన్ను మూశారు. తన మరణానికి ముందే ఓ బాలుణ్ని శివలింగ దత్తత తీసుకున్నా.. అది చెల్లదని ధార్వాడ్‌లో బ్రిటిషర్ల రాజకీయ సలహాదారు. జాన్ థాకరే స్పష్టం చేశాడు. సంస్థానంలోని రూ.16 లక్షల నగదు, భారీగా ఉన్న నగలను అప్పగించాలని హుకుం జారీ చేశాడు. తమ సంస్థానాన్ని కబళించడం సరికదని చెన్నమ్మ విన్నవించినా ఆంగ్లేయులు వినలేదు. దాంతో.. 'అసలు మా రాజ్యాలకు వారసులను నిర్ణయించడానికి వీరెవర అంటూ చెన్నమ్మ ఎదురు తిరిగింది. ఫలితంగా థాకరే 1824 అక్టోబరులో సైన్యంతో దాడి చేశాడు. కిత్తూరు సైనికులు చెన్నమ్మ సారథ్యంలో తెల్లవారిని ఊచకోత కోశారు. థాకరే సైతం వీరి కత్తి వేటుకు హతమయ్యాడు. ఇద్దరు బ్రిటిష్ అధికారులు బందీలుగా చిక్కారు. కలెక్టర్ చాప్లిన్.. రాయబారంతో వారిని చెన్నమ్మ విడిచిపెట్టారు. ఈ యుద్ధంతో బ్రిటిషర్లనూ ఓడించవచ్చని మిగిలిన సంస్థానాలకు అర్థమైంది.

**గన్‌పౌడర్ బూడిద....** అవమాన భారంతో కుంగిపోతున్న చాప్లిన్ 20వేల సైన్యంతో మళ్లీ కిత్తూరుపైకి వచ్చాడు. యుద్ధం వద్దని మద్రాసు గవర్నర్‌కు చెన్నమ్మ లేఖలు రాసినా, రాయబారులను పంపినా అతను స్పందించలేదు. ఇక యుద్ధం అనివార్యమైంది. రాణికి అండగా సైన్యంతోపాటు పౌరులు కూడా నిలిచారు. ఆమె కత్తి పట్టి యుద్ధంలోకి దిగింది. ఆ పోరాట 12 పోరాటం 12 రోజులు సాగింది. ఈ సారి పోలాపూర్ సబ్ కలెక్టర్ మన్రో ప్రాణాలు కోల్పోయాడు. ఇలా లాభం లేదని ఆంగ్లేయులు కుటిల తంత్రం పన్నారు. చెన్నమ్మ సైన్యంలోని ముఖ్యుడైన మల్లప్ప శెట్టిని లొంగదీసుకుని, గన్‌పౌడర్‌లో బూడిదను కలిపించారు. దీంతో వారి తుపాకులు, ఫిరంగులు పేలలేదు. ఈ ద్రోహంతో చెన్నమ్మ ఓడిపోయి, బ్రిటిషర్లకు బందీగా చిక్కింది. విచారణ కోసం ఆమెను ధార్వాడ్ కలెక్టరేట్‌లో కొన్ని రోజులు ఉంచారు. తర్వాత జీవితఖైదు విధించారు. బైల్ హొంగల్ కోటలో శిక్ష అనుభవిస్తూ 1829లో కన్నుమూసినా.. దేశస్వతంత్ర పోరాట చరిత్రలో ధ్రువతారగా నిలిచింది. ❒

# కాంజీవరం పట్టు చీరెలు

శ్రావణమాసం మొదలై పండుగలు వస్తున్నాయి. అందాల భరిణెలు మెచ్చే ఆరణి, కాంతలు కావాలనుకునే కాంజీవరం పట్టు చీరల్ని కట్టుకుని పండగలు, వ్రతాల వేళ పుత్తడి బొమ్మలా మెరిసిపోండి.







ఆరోగ్య భాగ్యం

# రక్తదాన ప్రాధాన్యత



డాక్టర్. కె.ఉమాదేవి, తిరుపతి

మానవ శరీరంలో రక్తం మొత్తం సాధారణంగా శరీర బరువులో 7% సమానం. మన శరీరంలోని కణాలకి అవసరమైన ఆహారం, ప్రాణవాయువును, శరీర ఉష్ణోగ్రతను రెగ్యులేట్ చేయడానికి, కణాల నుండి మెటబాలిక్ వ్యర్థ పదార్థాల్ని తొలగించడానికి రక్తం అవసరమవుతుంది. మన శరీరంలో 4.5 నుండి 5.5 లీటర్ల రక్తం ఉంటుంది. ఆస్ట్రియన్ బయోలజిస్ట్, ఫిజిషియన్ కార్ల్ లాండ్ స్టయినర్ 1930లో ఎ,బి,ఎబి, ఒ బ్లడ్ గ్రూప్స్‌ని గుర్తించినందుకు నోబుల్ ప్రైజ్ వచ్చింది. జూన్ 14వ తేదీ ఆయన పుట్టిన రోజు సందర్భంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ 2004 రోమ్‌లో ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరపడమైనది. 2005 నుంచి ప్రభుత్వ ఆరోగ్య సంస్థలు. స్వచ్ఛంద సంస్థలు, రెడ్ క్రాస్ సంస్థలు, రక్తదాన శిబిరాల్ని ఏర్పాటు చేయడమైనది. ప్రపంచ మంతటా అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో అభివృద్ధి చెందిన టెక్నాలజీ ద్వారా బ్లడ్ బ్యాంకుల్ని స్థాపించడమైంది. బ్రిటన్ శాస్త్రవేత్త చార్లెస్ రిచర్డ్ డ్ర్యూ దీనికి ఆద్యుడు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా, అత్యవసర పరిస్థితుల్లో రోడ్ ట్రాఫిక్ ఆక్సిడెంట్స్ గాయాలు. కాన్పు సమయాలో, మెడికల్ సర్జిన్‌లో ఆపరేషన్స్ ప్రాణ రక్షణార్థం వీటిని నిర్వహించడమైంది.

**రక్త దాతలకు ఉండవలసిన లక్షణాలు :** వయస్సు 18-65 సంవత్సరాలుండాలి. బరువు 45-65 కిలోలు ఉండవచ్చు. పల్స్ రేట్ 60-100 నిమిషాలు ఉండాలి. బ్లడ్ ప్రేషర్ 110-120/80-90 ఎం.ఎం, హెచ్‌జి ఉండాలి. హోమ్‌గ్లోబిన్ 12.5 జిఎం/100 ఎంఎల్ బాడీ టెంపరేచర్ 37.5సెం వుండాలి. మానసిక శారీరక ఆరోగ్యం ముఖ్యం. రక్తదానం, ఇవ్వడానికి 24 గంటల ముందు ఆల్కహాల్, స్మోకింగ్ చేయరాదు. ఉపవాసం మీతిమీరి తినడం లాంటివి చేయరాదు. దయాబెటిక్స్ కూడా నార్మల్ షుగర్ లెవల్స్ ఉన్నప్పుడు హెల్తీ లైఫ్ స్టయిల్ ఉన్నప్పుడు, ఇతర వ్యాధులకు మందులు వాడే వారు కూడా అర్హులు. ❏

ఉడికించిన బంగాళదుంప పొట్టుతో అద్దాలను రుద్దితే వాటిపై మరకలు తొలగి స్పష్టంగా కనిపిస్తాయి.

చెలి చిట్కా



# వడ్ల ఊకతో అందం

**పాల వర్ణంలో మెరుపులీనే జపాన్ అమ్మాయిల సౌందర్యం వెనుక రహస్యమే.. వడ్ల ఊక అట. వందల సంవత్సరాల నుంచి ఇప్పటివరకు ఆ దేశమహిళల ఆరోగ్యకరమైన చర్మం, అందానికి వారు పాటిస్తున్న మరిన్ని చిట్కాలను కూడా తెలుసుకుందాం.**

- యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు పుష్కలంగా ఉండే పడ్ల ఊక పొడిని జపాన్‌మహిళలు ముఖానిక స్క్రబ్బింగ్ చేయడానికి వాడతారు. సౌందర్య లేపనాల్లోనూ వినియోగిస్తారు. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. వృద్ధాప్యపు ఛాయలను దరికి చేరనీయదు.
- ఆహారంలో వాడే రాజ్మా గింజలను అందాన్ని పెంపొందించుకోవడానికి కూడా వీరు ఉపయోగిస్తారు. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచు తాయి. ఈ గింజల్లోని సపోనిన్ చర్మరంధ్రాల్లో మురికిని శుభ్రపరుస్తుంది. రాజ్మా గింజల పేస్ట్‌ని ముఖానికి రాసి రుద్దితే మురికితోపాటు మృతకణాలు దూరమవుతాయి. అలానే ముఖంపై మొటిమలు, నల్లని మచ్చలు వంటివీ తగ్గుతాయి. ❏



# వీటితో ఆరోగ్యం



రోజులో బ్రేక్‌ఫాస్ట్ కీలకం. రాత్రంతా కడుపు ఖాళీ ఉండటంతో శరీరానికి శక్తి కావాల్సి ఉంటుంది. బ్రేక్‌ఫాస్ట్‌లో గుప్పెడు మొలకెత్తిన విత్తనాలు తినడం లేదా రాత్రిపూట తినడం ఆరోగ్యానికి మంచిదే.

- శనగలు, పెసలు, శనక్కాయలు, అలసందలు, లాంటి గింజలను నీటిలో నానబెడతే మొలకెత్తిన విత్తనాలు తయారవుతాయి. ఇందులో ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయి. ఎక్కువ మోతాదులో ఆహారాన్ని తినాలనుకున్నప్పుడు వీటితోనే సరిపెట్టుకోవచ్చు. కడుపు నిండుతుంది.
- ఫైబర్ శాతం అధికంగా ఉండటం వల్ల త్వరగా జీర్ణమవుతాయి కూడా. ఐరన్, కాపర్ ఉండటం వల్ల రక్తప్రసరణను మెరుగుపరుస్తాయి. జుట్టు పెరగడానిక కూడా ఉపకరిస్తాయి. డైటింగ్ చేసేవారు ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వాళ్లు మొలకెత్తిన విత్తనాలతో దోస్తీ చేయాల్సిందే.
- మొలకెత్తిన విత్తనాల్లో విటమిన్లు, మినరల్స్ శాతం ఎక్కువే.
- ఎ-విటమిన్ పుష్కలం కాబట్టి ఇవి తింటే కంటికి మంచిది. వీటిని తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది.
- ఇందులోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్, పొటాషియం వల్ల రక్తనాళాల్లో ఒత్తిడి తగ్గటంతో పాటు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఎంజైమ్‌ల పవర్ హౌస్ అయిన ఈ మొలకెత్తిన విత్తనాలను గర్భిణులు, పిల్లలు తప్పక తినాలి. ❏

ఆధ్యాత్మికం

# ప్రథమ దర్శనం

లక్ష్మీదేవి తన స్వర్గపు నివాసాన్ని విడిచిపెట్టి, భూమిపై కరవీర పూర్ (కొల్లాహపూర్)లో నివసించింది. ఆమె బయలుదేరిన తర్వాత, విష్ణువు భూలోకంలో, వెంకట కొండపై పుష్కరిణి పక్కన, ఆహారం, నిద్ర లేకుండా, లక్ష్మి తిరిగి రావడానికి ధ్యానంతో చింత చెట్టు కింద చీమలపుట్ట (కొండ)లో నివసించాడు బ్రహ్మ, శివుడు అతడిపై జాలి కలిగి, విష్ణువుకి సేవ చేయాలని ఒక ఆవు, దూడ రూపాలుగా ఏర్పడ్డారు. లక్ష్మి ఒక అవుల కాపరిణి రూపంలో చోళ దేశం యొక్క రాజుకు ఆవు, దూడను అమ్మింది. చోళ రాజు తన పశువుల మందతో పాటు వెంకట కొండపై ఈ పశువులను కూడా కలిపి మేపటానికి పంపుతాడు. చీమలపుట్ట మీద విష్ణువుని కనిపెట్టి, ఆవు తన పాలును అందించి, తద్వారా అతనికి ఆహారం ఇచ్చింది. ఇంతలో, రాజభవంతి వద్ద, ఆవు నుండి కొద్దిగానైనా పాలు లభించడం లేదని, దీని వల్ల చోళరాణి ఆవు కాపరుడికి శేరాబడు అనే యాదవుడు పాలు లేకపోవడానికి కారణాన్ని తెలుసుకోవడానికి, ఆవు కాపరుడు శేరాబడు ఆవును రహస్యంగా అనుసరించి, చీమలపుట్టపై తన పొదుగు నుండి పాలను ఖాళీ చేస్తున్న ఆవును కనుగొన్నాడు. ఆవు యొక్క ప్రవర్తన వలన ఆగ్రహానికి గురైన ఆవు కాపరుడు శేరాబడు తన గొడ్డలిని ఆవు మీదకు విసిరివేసాడు. కాని ఆవుకు హాని కలిగించలేక పోయాడు అయినప్పటికీ, ఆవు కాపరుడు శేరాబడు విసిరిన గొడ్డలి దెబ్బ నుండి ఆవును కాపాడేందుకు విష్ణువుకు రక్తస్రావం అవటం చూసినపుడు, శేరాబడుకి మహావిష్ణువు పిశశిగా శేరాబడుని శపిస్తాడు. తన తప్పు తెలుసుకొని క్షమించమని ప్రార్థిస్తాడు మహా విష్ణువు అప్పుడు నాకు పద్మావతితో కళ్యాణం జరుగుతుంది. అప్పుడు నీకు శాపం విమోక్షం కలుగుతుంది మహావిష్ణువు శేరాబడుకి ఒక వరం ఇస్తారు. భూమి మీద మొట్ట మొదట నువ్వు నన్ను చూశావు కాబట్టి నా ప్రథమ దర్శనం నీకే ఇస్తున్నాను ఆ శాపం అంతం అవుతుందని విష్ణువు దీవించాడు. ఆ తరువాత, విష్ణువు శ్రీనివాసుడు లాగా, వరాహ క్షేత్రంలో ఉండాలని నిర్ణయించుకున్నాడు. తన నివాసం కోసం ఒక స్థలాన్ని మంజూరు చేసేందుకు వరాహుడిని కోరాడు. ❏







## ఐపిఎల్ స్టార్ట్ కానీయండి
# అప్పుడు చూద్దాం
### మహిళా ఐపిఎల్‌పై స్మృతి మంథాన రిప్లై

**లండన్:** మహిళల ఐపిఎల్‌ను వచ్చే ఏడాదినుంచి ప్రారంభిస్తామని బిసిసిఐ వెల్లడించిన సంగతి తెలిసిందే. టీమిండియా స్టార్‌బ్యాటర్‌క్రికెట్ బ్యూటీ స్మృతి మంథాన ఇదే విషయమై స్పందించాలనికోరితే ప్రారంభం అయ్యాక చూద్దాంలే అంటూ తలను గుండ్రంగా తిప్పుతూ తనదైనశైలిలో క్యూట్ రియాక్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ విడియో నెట్‌లో హల్‌చల్‌చేస్తోంది. ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న మహిళల ది హండ్రెడ్‌లీగ్‌లో ఆడుతున్న స్మృతి సౌతర్న్ బ్రేవ్‌జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తోంది. ఓవల్ ఇన్విజిబుల్స్ జట్టుతోమ్యాచ్ అనంతరం మీడియా ఆమెను ఐపిఎల్‌పై ప్రశ్నలు సంధించారు. వచ్చే ఏడాది మహిళల ఐపిఎల్‌పరంగా మీనుంచి ఇదే ఆటతీరును చూడొచ్చా అన్న ప్రశ్నకు స్మృతి తలను దించుతూ ఆటూ ఇటూ ఊపింది. తర్వాత స్పందించి భారత్‌లోక్రికెట్‌అంటే చాలా ఇష్టపడతారు. ఫార్మాట్‌తో సంబంధం లేకుండా మేం ఏం మ్యాచ్ ఆడినా మాకు మద్దతుంటుంది. ఇండియాలో మ్యాచ్ ఆడుతుంటే మాలో తెలియని ఉత్సాహం ఉంటుంది. వమిళల ఐపిఎల్‌ప్రారంబం గొప్ప విషయం అంది. అది ప్రారంభం అయిన తర్వాత చూద్దాంలే. మూడేళ్లుగా ఇదే వింటున్నాం. అది స్టార్ట్ అయ్యేవరకూ చూద్దాం ఇదే ప్రశ్న మూడేళ్లుగా అడుగుతున్నారు. మళ్లీ అదేనా అన్నట్లు చూసిందని సోషల్‌మీడియాలో సెటైర్లు పేలుతున్నాయి. పురుషుల ఐపిఎల్‌ముందే మహిళల ఐపిఎల్‌నిర్వహిస్తామని బిసిసిఐ అధికారి ఒకరు చెప్పినసంగతి తెలిసిందే.

## టొరంటో ఓపెన్ టెన్నిస్‌టోర్నీ విజేత హాలెప్

**టొరంటో:** రొమేనియా స్టార్ సిమోనా హాలెప్ మూడోసారి టొరంటో ఓపెన్ ప్రపంచ టెన్నిస్ మాస్టర్స్ వెయ్యో టైటిల్‌ను సాధించింది. ముందురోజు జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్‌లో హాలెప్ బ్రెజిల్‌కు చెందిన బీట్రిజ్ హదాద్ మయాస్‌పై 6:3, 2:6, 6:3 తేడాతో విజయంసాధించింది. సెమీస్‌లో అమెరికా క్రీడాకారిణి జెస్సికా పెగూలాపై 2:6, 6:3, 6:4తో పోరాడి నెగ్గిన హాలెప్ ఫైనల్‌లోనూ అదే ట్యాలెంట్‌తో టైటిల్‌ను సాధించింది. చిట్టచివరి ఫైనల్‌పోటీలో తొలిసెట్ సులువుగా గెలిచిన హాలెప్ రెండోసెట్‌లోప్రత్యర్థినుంచి ఊహించని పోరు ఎదురయింది దీనితో ఆమె తడబడి 2:6తో చేజార్చుకుంది. అయితే కీలకమైన మూడోసెట్‌లోప్రత్యర్థికి పుంజుకునే ఛాన్స్ ఇవ్వకుండానేమ్యాచ్‌ను సాధించింది. తద్వారా మూడో కెనడియన్ ఓపెన్ టైటిల్‌ను సాధించినట్లయింది. 2016, 2018ల్లో కూడా హాలెప్ ఈ టోర్నీలో విజేతగా నిలిచింది.

## రిటైర్మెంట్ రెండో వార్షికోత్సవం
### ఎంఎస్ ధోనీకి ఐసిసి స్పెషల్ విడియో

**న్యూఢిల్లీ:** భారత జట్టుకు ఎన్నో కీలక విజయాలు అందించిన కెప్టెన్ మిస్టర్ కూల్ ఎంఎస్‌ధోనీ సరిగ్గా ఇదేరోజు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిఆడు. 2020 ఆగస్టు 15న అన్ని ఫార్మాట్ల క్రికెట్‌కు ధోనీ రిటైర్మెంట్‌ప్రకటించాడు. ఇక ధోనీ రిటైర్మెంట్ రెండో ఏడాది సందర్భంగా ఐసిసి ఒక స్పెషల్ విడియోను సోషల్‌మీడియాలోపోస్టుచేసింది. 2007లో టి20 ప్రపంచకప్, 2011లో వన్డేప్రపంచకప్, 2013 ఛాంపియన్స్ ట్రోఫీతోపాటు ఐసిసి ఈవెంట్లలో ధోనీ సారథ్యంలో భారత్ సాధించిన విజయక్షణాలను ఐసిసిచూపించింది. కాగా ఈ విడియోకు ఎంఎస్‌ధోనీ 1928 గంటలనుంచి నన్ను రిటైర్డ్‌గా పరిగణించండి. 2020 ఆగస్టు 15న భారత సూపర్‌స్టార్ ఎంఎస్‌దోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలుపలికాడు. లెజెండ్‌కి ఇదే మా ప్రత్యేక నివాళి అని ఐసిసి క్యాప్షన్ ఇచ్చింది. భారత్‌క్రికెట్ చరిత్రలో తనపేరును ధోని సువర్ణాక్షరాలతో లిఃంచాడు. ఐసిసి నిర్వహించిన అన్ని టోర్నమెంట్లను తన ఖాతాలో వేసుకున్న తొలికెప్టెన్‌దోనీ మాత్రమే. 2007లో టీ20 ప్రపంచకప్ 2011లో వన్డేప్రపంచకప్, 2013లో ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీని ధోనీ సారథ్యంలోనే భారత్ కైవసంచేసుకుంది. ధోనీ తన అంతర్జాతీయ కెరీర్‌లోమూడు ఫార్మాట్‌లు కలిపి 17,226 పరుగులుసాధించాడు. ఆతడి కెరీర్‌లో 15 సెంచరీలవరకూ ఉన్నాయి.

ఆట





## పాక్ పేసర్‌పై మార్కస్ స్టొయినిస్ ఫిర్యాదు

**లండన్:** ఇంగ్లండ్‌లో జరుగుతున్న ది హండ్రెడ్ టోర్నీలో పాకిస్థాన్ ఫాస్ట్ బౌలర్ మహ్మాద్ హస్నేన్ బౌలింగ్ తీరుపై ఆస్ట్రేలియా పవర్ హిట్టర్ మార్కస్ స్టొయినిస్ ఫిర్యాదులుచేసాడు. ఈ టోర్నీలో సౌథరెన్‌బ్రేవ్‌టీమ్ తరపున స్టొయినిస్ ఆడుతుండగా ఓవెల్ ఇన్‌విన్సిబుల్ టీమ్‌కి పాకిస్థాన్ పేసర్ మహ్మాద్‌ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇది హండ్రెడ్‌బాల్‌క్రికెట్ టోర్నీ. మ్యాచ్‌లో 27బంతుల్లో రెండుఫోర్లు, రెండు సిక్స్‌ల సాయంతో 37 పరుగులుచేసిన స్టొయినిస్ టీమ్ స్కోరు 69వద్ద మహ్మాద్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఔట్ అయిన తర్వాత పెవిలియన్‌కి వెళుతున్నస్టొయినిస్ అంపైర్‌వైపుచూస్తూ మహ్మాదక్షనిబంధనలకు విరుద్ధంగా బౌలింగ్‌చేస్తున్నాడంటూ సైగలుచేసాడు. వాస్తవానికి మహ్మాద్ బౌలింగ్‌పై ఫిర్యాదులురావడం కొత్తేమీకాదు. బిగ్‌బాష్ లీగ్ 2021:22 సీజన్‌లో మహ్మాద్ బౌలింగ్‌పై అంపైర్ కెరార్డ్ అబూడ్ ఫిరాయదుచేయడంతో ఐసిసి ఆతని బౌలింగ్‌ను నిషేధించింది. గంటకు 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్‌చేసే మహ్మాద్ తన మోచేతిని 15 డిగ్రీలకి మించి వంచుతున్నాడని అంపైర్ ఫిర్యాదుచేసాడు. దాంతో ఈ ఏడాదిజనవరిలో బయోమోకానిక్ టెస్టుకి హాజరైన మహ్మాద్‌ని పరీక్షించిన లాహోర్‌క్ష వర్సిడీ మేనేజ్‌మెంట్ సైన్స్ ఆతని బౌలింగ్ నిబందనలకు లోబడే ఉందని చెప్పింది. ఏడాది జూన్‌నుంచి ఆతను మళ్లీ అన్నిఫిర్మాట్లలతోనూ క్రికెట్ ఆడుతున్నాడు. కానీ తాజాగా మార్కస్ స్టొయినిస్ పరోక్షంగా ఫిర్యాదుచేయడంతో మళ్లీ అందరిచూపు మహ్మాద్ బౌలింగ్‌వైపు మళ్లింది.


## కామెంటరీ కెరీర్‌కు ఇయాన్‌చాపెల్ గుడ్‌బై

**కాన్‌బెర్రా:** ఆస్ట్రేలియా మాజీ టీమ్ కెప్టెన్ ప్రఖ్యాత వ్యాఖ్యాతగా మారిన ఇయాన్‌చాపెల్ ఇక కామెంటరీ కెరీర్‌కు విరామం ఇచ్చాడు. ఇయాన్‌చాపెల్ ఆసీస్‌క్రికెట్‌లో ఆల్‌టైమ్ అత్యుత్తమ ప్లేయర్లలో ఒకడు. ఆతడిని ఇటీవల సిడ్నీమార్నింగ్‌హెరాల్డ్ అనే వార్తాసంస్థ చేసిన ఇంటరూవ్యలో ఆతడు కామెంటరీకి గుడ్‌బైచెప్పాలనే అలోచనలో ఉన్నాడు. చాపెల్ 75 టెస్టుమ్యాచ్‌ల్లో ఆస్ట్రేలియా తరపున ఆడాడు. 30 మ్యాచ్‌లకు ఆ జట్టు సారథిగా బాద్యతలునిర్వర్తించాడు. ఇక ఆతని అంతర్జాతీయ క్రికెట్‌కెరీర్ 1977లో ముగిసింది. ఆ తర్వాత కామెంటేటర్‌గా తన కెరీర్ ప్రారంభించిన చాపెల్‌సుమారు 45 ఏళ్లపాటు కామెంటరీ ప్యానెల్‌లో మంచి విశ్లేషణలు ఇచ్చాడు.

తన ఇంటర్వ్యూలో చాపెల్ మాట్లాడుతూ నాక్రికెట్ కెరీర్‌ముగిసినరోజు ఇప్పటికీ నాకళ్లల్లో మెదులుతుందని ఆరోజు పదేపదే వాచ్‌చూస్తూ గడిపానని, టైమ్ 11 దాటాకా ఇక నాకెరీర్‌ముగిసిందనే నిర్ణయానికొచ్చానన్నాడు. కామెంట్రీపరంగా కూడా ఇన్నేళ్లపాటు సేవలందించడం సంతోషంగా ఉన్నా రిటైర్ కావాల్సిన టైమ్ వచ్చిందన్నాడు. కొన్నేళ్ల కిందటే నాకు హార్ట్ ఎటాక్ వచ్చినప్పటినుంచి నా ఆరోగ్యపరిస్థితి గతంలోలా ఉండటంలేదని, అదృష్టవశాత్తూ హార్ట్ ఎటాక్‌నుంచి బతికానని, కానీ మరింత జాగ్రత్త తీసుకోవాలని అందుకే రిటైర్ అవుతున్నట్లుచాపెల్‌చెప్పాడు.



### టెన్నిస్ క్రీడాకారులకు
# అద్భుతప్రేరణ సెరీనా
### దిగ్గజ టెన్నిస్ స్టార్ రాఫెల్‌నాదల్



**న్యూయార్క్:** ప్రపంచంలోని ఉత్తమ మహిళా టెన్నిస్‌క్రీడాకారిణుల్లో సెరీనా విలియమ్స్ ఒకరని టెన్నిస్‌గ్రేట్ రాఫెల్ నాదల్ పేర్కొన్నాడు. ఆమె ఒక అద్భుతమైన ప్రేరణగా నిలుస్తుందని, ఆల్‌టైమ్ గొప్ప క్రీడాకారుల్లో ఆమె ఒకరని ప్రశంసించాడు. తన కెరీర్ చివరి అంకానికి చేరుకున్న సెరెనా 2022లో ఇప్పటివరకూ ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఇకి సిన్సినాటి మాస్టర్స్‌లో ఎమ్మా రడుకానుతో ఆమె పోటీపడుతోంది. యుఎస్ ఓపెన్‌కుముందు ఆమె చివరి ప్రపంచ టెన్నిస్ అసోసియేషన్ వెయ్యో ప్రదర్శన ఇదే కావడం గమనార్హం. ఇక రాఫెల్ సెరెనాకు సంబంధించి తలుచుకుంటూ ఆమెకు సంబంధించి చాలా జ్ఞాపకాలున్నాయని, ఆమె ఎప్పటికీ గొప్ప క్రీడాకారుల్లో ఒకరని, ఆమెతో సుదీర్ఘకాలంగా టెన్నిస్ ఆడటం నా అదృష్టంగా భావిస్తున్నట్లు నాదల్ పేర్కొన్నారు. టెన్నిస్‌నుంచి ఆమె విరమించడం బాధాకరమే కానీ ఆమెచేసిన టెన్నిస్‌క్రీడల్లో నెలకొల్పిన అన్ని లక్ష్యాలు గుర్తుచేసుకుంటే ఆమెకు అభినందనలు చెప్పకుండా ఉండలేనని అన్నాడు. టెన్నిస్‌కు ఒక క్రేజు తీసుకొచ్చినవాళ్లలో సెరెనా ఒకరని అన్నారు. ఆమె ఎవల్యూషన్‌కోసం ఆమెకు శుభాకాంక్షలు తెలిపాడు. ప్రపంచ వ్యాప్తంగా చాలామందికి ఒక అద్భుతమైన ప్రేరణ సెరీనా అని అన్నాడు. ఆమె తనజీవితంలోని ఈదశలో తనకోసం ఎంచుకున్న మంచిపనులు సజావుగా సాగాలని కోరుకుంటున్నట్లు నాదల్‌చెప్పాడు.

## 5జి రాకతో కొత్త కొలువులు..

**ముంబై, ఆగస్టు 15:** భారత్‌లో నెక్ట్స్ జనరేషన్ 5జి టెక్నాలజీకి సంబంధించిన బిడ్డింగ్ ముగిసింది. మరికొద్ది నెలల్లో దేశంలో 5జి టెక్నాలజి అందుబాటులోకి రానున్న విషయం విదితమే. ఈ రంగంలోని 4 అతి పెద్ద ప్రైవేట్ టెలికం కంపెనీలు విస్తరణకు వేగంగా అడుగులు వేస్తున్నాయి. రానున్న మూడు నెలల కాంలో దీని ద్వారా కొత్త ఉద్యోగ అవకాశాలు రానున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. ఇప్పటికే ప్రపంచంలోని చాలా దేశాల్లో 5జి టెక్నాలజీ అందుబాటులో ఉంది. తాజాగా భారత్‌లో 5జి టెక్నాలజీని ప్రవేశపెట్టారు. దీనికి సంబంధించి ఇటీవల జరిగిన వేలంలో రిలయన్స్ జియో, భారతీఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా, అదానీ డేటా కంపెనీలు ప్రధానంగా వేలంలో పాల్గొన్నాయి. వారం రోజుల పాటు జరిగిన ఈ వేలంలో సుమారు లక్షన్నర కోట్ల రూపాయల విలువైన స్పెక్ట్రమ్‌వేలం జరిగింది. ఈ స్థితిలో బిడ్డింగ్ తర్వాత టెలికం కంపెనీలు తమ కస్టమర్లకు 5జి టెక్నాలజీని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో 5జి టెక్నాలజీని ప్రవేశపెట్టడం వల్ల, వచ్చే త్రైమాసికంలో దేశంలో దాదాపు 6వేల కొత్త ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని తెలుస్తోంది. ముఖ్యంగా ఆపరేటర్లు, సేల్స్‌మెన్, కేబుల్ ఇన్‌స్టాలర్లకు అధిక డిమాండ్ ఉందని నివేదికలు చెబుతున్నాయి. 2021లో టెలికం కంపెనీలు డిసెంబర్ నుంచి 5జి టెక్నాలజీ కోసం అవసరమైన ఉద్యోగులను నియమించుకోవడం ప్రారంభించినట్లు నివేదికలు చెబుతున్నాయి. గత సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్య 45 శాతం, జనవరి-మార్చి త్రైమాసికంలో 65శాతం, ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 75శాతం ఉద్యోగుల నియామకం జరిగింది. 5జి టెక్నాలజీ వల్ల 2023 ఆర్థిక సంవత్సరం నాటికి టెలికం రంగంలో 18వేల నుంచి 20వేల ఉద్యోగాలు వస్తాయని పరిశ్రమ వర్గాలు అంచనాలు చెబుతున్నాయి. నియామకాల్లో జోరు కొనసాగుతుందని వారు అంటున్నారు. 5జి వేలం ముగియకముందే, రోల్ అవుట్ ప్లాన్‌లు అమల్లోకి రాకముందు నుంచే టెలికం కంపెనీలు తమ బ్రాడ్‌బ్యాండ్ కార్యకలాపాలను విస్తరించడం ప్రారంభించేశాయి. ఈ కారణంగా ఉద్యోగ అవకాశాలు భారీగా పెరుగుతున్నాయి.

## పెట్రోల్‌లో 10శాతం ఇథనాల్ లక్ష్యాన్ని సాధించాం: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** దేశ 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రధాని మోడీ ఎర్రకోటపై వరుసగా తొమ్మిదోసారి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం ఎర్రకోట నుంచి ఆయన ప్రసంగిస్తూ, పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలపాలనే లక్ష్యం నెరవేరిందని వెల్లడించారు. దీని వల్ల వేల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆదా కావడమే కాకుండా రైతుల ఆదాయాన్ని పెంచడంలో కూడా దోహదపడిందని వెల్లడించారు. పెట్రోలియం ఉత్పత్తుల కోసం మనం ఎక్కువగా దిగుమతులపై ఆధారపడతామనేది రహస్యమేమీ కాదు. అందువల్ల నవంబర్ 2022 నాటికి పెట్రోల్‌లో 10శాతం ఇథనాల్ కలపడం సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. లక్ష్యంగా పెట్టుకున్న షెడ్యూల్ సమయానికంటే ఐదునెలల ముందుగానేపెట్రోల్‌లో



10శాతం ఇథనాల్‌కలపాలనే లక్ష్యాన్ని భారత్ సాధించింది. ముడి చమరు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడానికి 2025-26 నాటికి పెట్రోల్‌లో ఇథనాల్ మిక్సింగ్ నిష్పత్తిని రెట్టింపు చేయాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది. చెరకు, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల నుంచి సేకరించిన ఇథనాల్‌ను 10 శాతం వరకు పెట్రోల్‌లో కలపడం ప్రభుత్వ రంగ పెట్రోలియం కంపెనీల బలమైన ప్రయత్నాల వల్ల సాధ్యమైందని తెలుస్తోంది. ప్రభుత్వ యాజమాన్యంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియంకార్పొరేషన్ లిమిటెడ్, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ లు ఇందుకోసం చాలా ప్రయత్నాలు చేశాయి.

పెట్రోల్‌లో 10 శాతం ఇథనాల్ కలపడం ద్వారా దేశానికి రూ.41,500 కోట్లకుపైగా విదేశీ మారకద్రవ్యం ఆదా అయింది. ఇది మాత్రమే కాదు, గ్రీన్ హౌస్ గ్యాస్ (జిహెచ్‌జి) ఉద్గారాలను 27 లక్షల టన్నుల మేర తగ్గించింది. దీంతో రైతులకు తక్షణమే రూ.40,600 కోట్లకుపైగా చెల్లింపులు జరిగాయి. యుఎస్, బ్రెజిల్, యూరోపియన్ యూనియన్, చైనా తర్వాత భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఇథనాల్ ఉత్పత్తిలో ఐదవ అతిపెద్ద మార్కెట్‌గా ఆవిర్భవించింది.

### వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

(రూ. కిలోకు) (Rs. Per Kg)

| | | |
|---|---|---|
| ఫామ్‌గేట్ | (Farmgate) | 117 |
| డ్రెస్స్‌డ్ | (Dressed) | 139 |
| విత్ స్కిన్ | (with skin) | 202 |
| స్కిన్‌లెస్ | (Skinless) | 229 |

## ముఖేష్ అంబానీ కుటుంబానికి బెదిరింపు కాల్స్



**ముంబై, ఆగస్టు 15:** రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్, ప్రముఖ పారిశ్రామికవేత్త ముఖేష్ అంబానీ, ఆయన కుటుంబానికి మరోసారి బెదిరింపు ఫోన్ కాల్స్ రావడం కలకలం రేపింది. అంబానీ కుటుంబాన్ని బెదిరిస్తూ రిలయన్స్ ఫౌండేషన్ నిర్వహిస్తోన్న హర్‌కిసాన్‌దాస్ ఆసుపత్రికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో మళ్లీ అదే నంబర్ నుంచి మూడు, నాలుగుసార్లు ఫోన్ కాల్స్ వచ్చినట్లు ఆసుపత్రి యాజమాన్యం ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ముంబైలోని డిడి మార్గ్ పోలీ సులు వెంటనే దర్యాప్తు చేపట్టారు. ఫోన్ నంబరు ఆధారంగా ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి మానసిక స్థితి సరిగా లేదని సమాచారం. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ముంబై పోలీసులు వెల్లడించారు. గూగుల్‌లో సెర్చ్ చేసి మరి, ఆసుపత్రి ల్యాండ్ లైన్‌కు ఫోన్ చేసినట్లు తెలుస్తోంది.

## నిలకడగా బంగారం ధరలు

**ముంబై, ఆగస్టు 15:** బంగారం ధరలు సోమవారం నిలకడగా ఉన్నాయి. వెండి ధరల్లో కూడా ఎలాంటి మార్పులు చోటు చేసుకోలేదు. ప్రస్తుతం బులియన్ మార్కెట్లో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.48,150గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.52,530గా ఉంది. ఇక వెండి ధర ప్రస్తుతం కిలో రూ.59,300గా ఉంది. హైదరాబాద్ 22 క్యారెట్ల బంగారం తులం ధర ప్రస్తుతం రూ.48,150గా ఉండగా, ఇక 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాముల ధర రూ.52,320గా ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.48,150గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.52,320గా ఉంది. విశాఖపట్నం 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.48,150గా ఉండగా, 24క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.52,320గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల బంగారం ధర



రూ.48,200గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.52,580గా ఉన్నాయి. చెన్నై 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.49,140గా ఉండగా, 24 క్యారెట్ల 10గ్రాముల ధర రూ.52,610గా ఉన్నాయి. ముంబైలో 22 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.48,150గా ఉండగా, 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.52,530గా నమోదైంది. ఢిల్లీలో 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.48,300గా ఉండగా, 24 క్యారెట్ల 10గ్రాముల ధర రూ.52,690గా నమోదయ్యాయి. కోల్‌కతాలో 22 క్యారెట్ల ధర 10 గ్రాములకు రూ.48,150గా ఉండగా, 24 క్యారెట్ల ధర రూ.52,530గా ఉన్నాయి. కేరళలో 22 క్యారెట్లధరరూ.48,150గా ఉండగా, 24 క్యారెట్ల దర రూ.52,530గా నమోదైంది. సోమవారం హైదరాబాద్‌లో కేజీ వెండి ధర రూ.64,800గా ఉంది.

## రానున్నది టెక్ శకమే: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ప్రధాని మోడీ ఎర్రకోట నుంచి తన స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగాన్ని ఇచ్చారు. ఇందులో భారత భవిష్యత్తుపై మాట్లాడుతూ డిజిటల్ ఇండియా ద్వారా సాంకేతికతను ప్రజలకు చేరువ చేస్తున్న నేపథ్యంలో 'టెక్‌అడే' అనే పదాన్ని ఉపయోగించారు. ఆధునిక భారతంలో 5జి, చిప్ తయారీ వంటి నూతన సాంకేతికతల్లో భారత్ ముందుకు సాగుతోందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సాంకేతిక పరివర్తన, అవసరాన్ని నొక్కి చెప్పేందుకు 'టెక్‌అడే' అంటూ ప్రస్తావించారు. దేశంలో త్వరలో 5జి సేవలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. డిజిటల్ టెక్నాలజీ ద్వారా ఆరోగ్యరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని ప్రధాని అన్నారు. చిన్న రైతులు, చిన్న పారిశ్రామికవేత్తలు, వ్యాపారుల సామర్థ్యాలు సమర్థవంతమైన భారతదేశానికి హామీ అని పేర్కొన్నారు. న్యాచురల్ ఫార్మింగ్ భారతదేశానికి కొత్త బలాన్నిస్తుందని పేర్కొన్నారు. గ్రీన్ ఉద్యోగాల కల్పనతో బహుళ ఉపాధి



అవకాశాలు వస్తాయని అభిప్రాయపడ్డారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' సందర్భంగా దేశంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ప్రధాని మోడీ 'జై అనుసంధాన్' కోసం పిలుపునిచ్చారు. అంతరిక్ష రంగం నుంచి డ్రోన్ తయారీ వరకు అన్ని రంగాల్లో భారత్ వేగంగా పురోగమిస్తోందని ప్రధాని అన్నారు. ప్రధాని ఈ ప్రసంగంతో భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని తెలుస్తోంది. దేశీయ మార్కెట్లు కూడా ఈ ఉత్సాహాన్ని రానున్న రోజుల్లో కొనసాగుతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# వాణిజ్యం

### మనవడితో ముకేష్ స్వాతంత్ర్య వేడుకలు

**ముంబై, ఆగస్టు 15:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75యేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం యావత్ భారతావని ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను అట్టహాసంగా జరుపుకుంది. ప్రముఖుల నుంచి సామన్యుల వరకు సగర్వంగా మువ్వన్నెల జెండాను ఎగురవేసి, స్వాతంత్ర్య సమర యోధులత్యాగాలను గుర్తుచేసుకున్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త, రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీ తన కుటుంబంతో కలిసి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ముంబైలోని తన నివాసం ఆంటిలియాలో సతీమణి నీతా అంబానీ, మనవడు పృథ్వీ ఆకాశ్ అంబానీతో కలిసి స్వతంత్ర వేడుకలను జరుపుకొన్నారు. ముఖేష్ మనవడిని ఎత్తుకోగా, నీతా అంబానీ చేతిలో త్రివర్ణ పతాకాన్ని పట్టుకుని మా తుఝే సలాం అంటూ స్వతంత్ర భారతావనికి వందనం చేశారు. ఇక కేంద్రం పిలుపునిచ్చిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా అంబానీ నివాసం ఆంటిలియా తిరంగా వెలుగుల్లో కళకళలాడింది.

### 30 లక్షల మార్క్ దాటిన టెస్లా

**న్యూఢిల్లీ, ఆగస్టు 15:** ఎలక్ట్రిక్ కార్ కంపెనీ టెస్లా కీలక మైలురాయిని అధిగమించింది. టెస్లా మూడు మిలియన్ల కార్ ప్రొడక్షన్ మార్క్‌ను క్రాస్ చేసిందని టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్ ప్రకటించారు. ఈ సందర్భంగా టెస్లా సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. మూడు మిలియన్ల కార్లను తయారు చేసినందుకు అభినందనలు గిగా షాంఘై. మొత్తంగా టెస్లా మూడు మిలియన్లకుపైగా ఉత్పత్తి మార్క్‌ను దాటేసింది అంటూ మస్క్ ట్వీట్ చేశారు. చైనాలో టెస్లా మూడవ అతిపెద్ద వాహన తయారీ సంస్థ. ఈ యేదాది ప్రథమార్థంలో దాదాపు రెండు లక్షల వాహనాలను కస్టమర్లకు డెలివరీ చేసింది. టెస్లా కార్లు ఇప్పటివరకు 40 మిలియన్ మైళ్లకు పైగా సాధించింది. ఈ యేడాది చివరికి 100 మిలియన్ మైళ్లకు చేరాలని కంపెనీ భావిస్తోంది. రానున్న సంవత్సరాల్లో టెస్లా కంపెనీ 10లేదా 12 గిగాఫ్యాక్టరీలను నిర్మించవచ్చని ఇటీవల ఎలాన్ మస్క్ ప్రకటించిన విషయం విదితమే. అలాగే 2019లో ప్రకటించిన, చాలా కాలంగా ఎదురుచూస్తున్న సైబర్‌ట్రక్ కూడా త్వరలో ఆవిష్కృతమవుతుందన్నారు. కాగా రెండవ త్రైమాసికంలో టెస్లా 16.93 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని నివేదించింది. బెర్లిన్ వెలుపల టెస్లా కొత్త ఫ్యాక్టరీ జూన్‌లో వారానికి వెయ్యి కార్లను దాటిందని మస్క్ వెల్లడించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/21-22 **Air Surcharge:** Delhi : 40 Ps.